8-7Pg1exHMNWJQE_8-7Pg1exHMNWJQE.qxd 08/Jul/26 12:02 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 158 పేజీలు: 12 వెల: 6.50

**టిక్‌టాక్‌వల్లే గెలిచా: డొనాల్డ్ ట్రంప్**
9లో

**అయోధ్య ట్రస్టు అధీనంలో 30 కిలోల బంగారు ఆభరణాలు**

# ఎంట్రప్రెన్యూర్లుగా రైతులు


మంగళవారం జరిగిన 19వ ఎస్ఐపిబి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

### పారిశ్రామికీకరణ ఆ దిశగా సాగాలి
## వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం
### మరిన్ని ఇథనాల్ ప్రాజెక్టులు ఏర్పాటు: సిఎం చంద్రబాబు
### 19వ ఎస్ఐపిబి సమావేశంలో 11 ప్రాజెక్టులకు ఆమోదం

**విజయవాడ, జూలై 7, ప్రభాతవార్తప్రతినిధి:** రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చేలా కార్యచరణ ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రైతులు ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు దోహదం చేసేలా పారిశ్రామికీకరణ జరగాలన్నారు. ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించాలాని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా భవిష్యత్‌లో పెరిగే ఇథనాల్ డిమాండ్‌ను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఇథనాల్ బ్లెండింగ్ 40 శాతానికి పెంచితే. మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇథనాల్ తయారీ రంగంలో వచ్చే అన్ని పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. పెట్రోలు, డీజిల్‌లో మిక్స్ చేసేందుకు ఇథనాల్ భారీగా అవసరం కానుందన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి పాలసీ తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై దృష్టిపెట్టాలన్నారు. ఆ దిశలో రైతులను ప్రోత్సహించాలన్నారు. సంపద సృష్టి, సర్క్యులర్ ఎకానమీ అనేది ప్రభుత్వ విధానం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్దేశించారు. సచివాలయంలో మంగళవారం 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 11 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,076.11 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. దీంతో 10,531 ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయి.

**100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు లక్ష్యం:** పర్యాటకరంగంలో అపార అవకాశాలు ఉన్నాయి. తిమ్మమ్మ మర్రిమాను సహా రాష్ట్రవ్యాప్తంగా 100 టూరిస్ట్ స్పాట్‌ల దగ్గర ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. పోలవరం, దిండి, గండికోట, కంబం చెరువు, లంబసింగి లాంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. లంబసింగి, అరకు సమీపంలో రిసార్ట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేస్తోంది.
>>2

## కాగ్నిజెంట్, విశాఖ ఐటి సెజ్‌కు
# కేంద్రం ఆమోదం

**విజయవాడ, జూలై 7, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ విశాఖపట్నంలో ఐటీ/ఐటీఈఎస్ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు పొందింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తుది నోటిఫై చేసింది. విశాఖపట్నం రూరల్ మండలం పరిధిలోని ఐటీమధురవాడ2 ప్రాంతంలో 8.98 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ సెజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి కాగ్నిజెంట్ సంస్థకు లెటర్ ఆఫ్ అప్రూవల్ కూడా జారీ అయింది. సెజ్ చట్టం ప్రకారం డెవలప్‌మెంట్ కమిషనర్ నేతృత్వంలో ఒక అప్రూవల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కస్టమ్స్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు ఈ సెజ్‌ను ఇన్‌ల్యాండ్‌కంటైనర్ డిపో
>>2

# పెట్టుబడుల కేంద్రంగా ఎపి



మంగళవారం సియోల్‌లోని ఎల్‌జీ సైన్స్‌పార్కులో అక్కడి ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్

### మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తాక్రేకర్ కేంద్రాన్ని ప్రారంభించండి
### ఎఐ, ఐటి, ఎలక్ట్రానిక్స్‌లో వేగంగా పురోగతి
### సియోల్‌లో ఎల్జీకెమ్ ప్రెసిడెంట్ యున్‌జు కోహ్, హుందాయ్ ఇడితో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పెట్టుబడులకు అత్యంత అనుకూల మౌలిక పరిస్థితులున్నాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పునరుద్ఘాటించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవపరమైన స్థల సదుపాయాలు, రవాణ వ్యవస్థ ఉందని వివరించారు. సౌత్ కొరియా పర్యటనలో భాగంగా మంగళవారం ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ ఎల్జీ ఓవర్సీస్ హోల్డింగ్ కంపెనీస్ హెడ్ యున్‌జు కోహ్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ కాకినాడపోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రం/సముదాయాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దక్షిణ కొరియాలోని ఎల్జీ కెమ్ అధునాతన కార్యకలాపాలను నమూనాగా తీసుకుని, మూలపేటలో ప్రపంచ స్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. భారతదేశంలో సమగ్రమైన ఈవీ, బ్యాటరీ పవర్ స్టోరేజి పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు, సమీకృత క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్, సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. మూలపేటలో ఎస్ఏఎఫ్ బయోఇథనాల్ ఉత్పత్తిపై దృష్టి సారించి, జీవ ఇంధనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వాల్యూ యాడెడ్ వనరులుగా మార్చేందుకు, ప్లాస్టిక్ రీసైక్లింగ్, పైరోలిసిస్ ప్లాంట్లను ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్‌జు కోహ్ మాట్లాడుతూ ఎల్జీ పాలిమర్స్ విశాఖపట్నం ప్లాంట్ (గోపాలపట్నం) ద్వారా గతంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ భారతీయ కార్యకలాపాలకు, ఇతర తయారీదారులకు (పాలీస్టైరిన్) కీలకమైన పాలిమర్ భాగాలను సరఫరా చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం శ్రీసిటీలో, యాక్రిలోనిట్రైల్ బ్యూటాడైన్ స్టైరిన్ కాంపౌండ్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన తాజా ప్రతిపాదనలపై సంస్థ
>>2


మంగళవారం ఒడ్డుకు వచ్చిన మత్స్యకారులతో పోలీసులు

## ఆ 10 మంది మత్స్యకారులు సురక్షితం
### మూడు రోజులు అన్వేషించి ఒడ్డుకు చేర్చిన శ్రీకాకుళం పోలీసు బృందం

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జూలై 7 ప్రభాతవార్త:** గత నెల జూన్ 24వ తేదీన విశాఖపట్నం తీర ప్రాంతానికి చెందిన 10 మంది మత్స్యకారులు చేపల వేట నిమిత్తం బోటులో సముద్రంలోకి వెళ్లారు. వేట నిర్వహిస్తున్న సమయంలో బోటు ఒడిశా సముద్ర సరిహద్దు ప్రాంతానికి చేరుకోగా ఇంజిన్ సాంకేతిక లోపం తలెత్తడంతో పాటు ప్రతికూల వాతావరణం, తుఫాను ప్రభావం కారణంగా సముద్రంలో చిక్కుకుపోయారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా తెలియగానే విశాఖపట్నం రేంజ్ ఐజీ మరియు మెరైన్ విభాగం ఐజీ గోపీనాథ్ జట్టి తక్షణమే స్పందించి శ్రీకాకుళంజిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డికి అవసరమైన ఆదేశాలు జారీచేశారు. చిక్కుకుపోయిన మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నా
>>2

### గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శనలు
### జీరాంజీ కింద కామన్ ఫెసిలిటీ సెంటర్లు: డి.సిఎం పవన్


మంగళవారం విజయవాడలో జరిగిన హస్తకళా ప్రదర్శనలో స్టాల్స్ పరిశీలిస్తున్న డి.సిఎం పవన్

# ఇక హస్తకళల పర్యాటకం

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** కళాకారుల ప్రతిభ ప్రపంచానికి తెలియాలి. పిల్లలు, వారి తల్లిదండ్రుల కళను వారసత్వంగా కొనసాగించాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. సంప్రదాయం గుర్తుచేసుకోవడానికి కాదు, మరింత ముందుకు సాగాలన్నారు. లోకల్ టు గ్లోబల్ రీతిన మన హస్తకళలు ప్రపంచానికి చేరాలి అన్నారు. మన వస్తువులకు మార్కెటింగ్ పెరగాలి. కళారూపాలకు మూలాధారమైన కర్రనిల్వ అవసరం. కళాకారులపై కేసులు లేకుండా చేశామన్నారు. మంగళవారం విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో
>>2

### కృష్ణలంక పిఎస్‌లో
## నాగరాజు విచారణ
### సిట్‌ను అనుమతించిన హైకోర్టు
### సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. నిందితుడు, సస్పెండైన సీఐ నాగరాజును విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారించేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)కు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను న్యాయస్థానం సవరించింది. అలాగే విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేసి సంబంధిత కోర్టు ముందు ఉంచాలని పేర్కొంది. సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో సీఐ నాగరాజు కస్టడీపై దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను మార్చాలని కోరుతూ ఏపీ హైకోర్టులో ఇటీవల సిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై నిన్న (సోమవారం) విచారణ జరగగా.. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును మంగళవారానికి రిజర్వ్ చేసింది. ఈ మేరకు నేడు తీర్పు వెలువరించింది. సోమవారం నాడు కేసు విచారణ సందర్భంగా ఇరువర్గాల న్యాయవాదులు పోటాపోటీగా తమ వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక విషయాలను కోర్టు దృష్టికి తెచ్చారు. విజయవాడ కోర్టు విధించిన కొన్ని షరతుల కారణంగా దర్యాప్తునకు ఆటంకం కలుగుతోందని హైకోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. నిందితుడిని ప్రశ్నించేందుకు పరిమితులు ఉండటంతో దర్యాప్తు సక్రమంగా జరిగే అవకాశం లేదని పేర్కొన్నారు.

నాగరాజును విచారించే సమయంలో వీడియో రికార్డింగ్‌కు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని.. అయితే ఆడియో రికార్డింగ్ వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణ వల్ల నిందితుడి హక్కులకు ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. మరోవైపు నాగరాజు తరఫు న్యాయవాది కూడా హైకోర్టులో తన వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని ఉందని, భద్రతా కారణాల దృష్ట్యా కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణకు అనుమతి ఇవ్వొద్దని హైకోర్టును కోరారు. అన్ని రకాల సౌకర్యాలు, భద్రత ఉన్న రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు నేడు తీర్పు వెలువరించింది.



2లో

## ఫ్రాన్స్ అధ్యక్షునికి తప్పిన ప్రమాదం
### డమాస్కస్‌లోని హోటల్ వద్ద భారీ పేలుడు, 18 మందికి తీవ్రగాయాలు


మంగళవారం జకార్తాలో ప్రధాని మోడీని అత్యున్నత పురస్కారంతో సత్కరిస్తున్న ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటో

### ఇండొనేసియాకు
# 'బ్రహ్మాస్త్రం'
### బ్రహ్మోస్, అస్త్ర క్షిపణుల సరఫరాకు భారత్ అంగీకారం
### ఉభయ దేశాల మధ్య 19కీలక ఒప్పందాలపై సంతకాలు
### రక్షణరంగంలో మరింత సహకారం
### అధ్యక్షుడు సుబియాంటోతో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు

**జకార్తా, జులై 7:** భారత్, ఇండోనేషియా తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు చేర్చాయి. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్యం, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తృతం చేసే లక్ష్యంతో ఇరు దేశాలు 19 కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ చారిత్రక పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీకి ఇండోనేషియా తమ దేశ
>>2

### ప్రధాని మోడీకి ఇండొనేసియా అత్యున్నత పురస్కారం
## 'బిన్‌టాంగ్ ఆదిపూర్ణ' పురస్కారం అందించిన అధ్యక్షుడు సుబియాంటో

**జకార్తా,జులై 7:** ప్రధాని మోడీకి అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేసియా ప్రభుత్వం ఆయన్ను అత్యున్నత పురస్కారంతో సత్కరించింది. 'బిన్‌టాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండొనేసియా' అవార్డుతో మోడీని సన్మానించారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ మెడల్‌ను అందజేశారు. ప్రస్తుతం మోదీ ఇండోనేసియా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఎంతో ప్రేమతో ఇండోనేషియాకు తనకు అత్యున్నత పురస్కారాన్ని అందజేసినట్లు పీఎంవో కార్యాలయం తన ట్వీట్‌లో తెలిపింది. ఈ గౌరవం కోట్లాది మంది భారతీయులకు చెందుతుందని మోడీ పేర్కొన్నారు. ఈ సత్కారం ఇండోనేసియా
>>2



### అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో
# 38మందికి ఉరి ఖరారు
### 11మందికి జీవిత ఖైదు
### ప్రత్యేక కోర్టు తీర్పు సమర్థించిన హైకోర్టు

**అహ్మదాబాద్, జులై 7:** అహ్మదాబాద్‌లో 2008నాటి వరుస బాంబుపేలుళ్ల కేసులో 38 మంది దోషులకు విధించిన మరణశిక్ష గుజరాత్ హైకోర్టు సమర్థించింది. మరో 11 మందికి విధించిన జీవిత ఖైదును కూడా యథాతథంగా కొనసాగిస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఉగ్రదాడిలో మరణించిన బాధితుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 2022లో ప్రత్యేక ట్రయల్ కోర్టు విధించిన మరణశిక్షలను ఉన్నత హైకోర్టు సమర్థించింది. ఒకే కేసులో ఇంత పెద్దసంఖ్యలో నిందితులకు ఉరిశిక్ష ఖరారు కావడం భారత న్యాయవ్యవస్థ చరిత్రలోనే ఇది మొదటిసారి. ట్రయల్‌కోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన
>>2

8-7pg2exHMNWJQE_8-7pg2exHMNWJQE.qxd 08/Jul/26 12:05 AM Page 1





మంగళవారం సియోల్‌లో ఎల్‌జీ అధికారులు,ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్

# పెట్టుబడుల కేంద్రంగా ఏపి

>> ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్ మాట్లాడుతూ... భారత్ లోని చెన్నై, అనంతపురంలో మాడ్యూల్స్, కీలక విడిభాగాలను తమ సంస్థ తయారు చేస్తుందని తెలిపారు. గురుగ్రామ్ ఆఫ్టర్‌మార్కెట్ విడిభాగాల కేంద్రంగా ఉంది, చెన్నై లాజిస్టిక్స్ కేంద్రం నుంచి హ్యుందాయ్/కియా సర్వీస్ విడిభాగాలను ఎగుమతి చేస్తుందని చెప్పారు. కొత్తగా హైదరాబాద్ లో ఆర్ అండ్ డీ కేంద్రం, బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతపురంలోని తయారీ కేంద్రం ద్వారా హ్యుందాయ్ సంస్థ కియా ఇండియా కోసం మాడ్యూల్స్, కీలక విడి భాగాలను ఉత్పత్తి చేస్తుందని, ఎయిర్‌బ్యాగ్స్, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ల వంటి కీలక భాగాలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

**అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీతో మంత్రి నారా లోకేష్ భేటీ:** సెమీకండక్టర్స్, ఒసాట్ (అసెంబ్లింగ్, ప్యాకేజింగ్, టెస్టింగ్) రంగంలో పేరెన్నికగన్న అపాక్ట్ కంపెనీ సీఈవో సియాంగ్ డాంగ్ లీ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్ లో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో అపాక్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అపాక్ట్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నట్లు చెప్పారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు పరిశీలిస్తున్న హనా మైక్రాన్ తో పాటు ఇతర ఒసాట్ సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా అనుసంధానించాలని దిగని కోరారు. సెమీకండక్టర్ కార్యకలాపాలకు సంబంధించి యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం కోసం ఏపీఎస్ఎస్‌డీసీతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. భారతదేశంలో అపాక్ట్ కార్యకలాపాల విస్తరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీ మాట్లాడుతూ హైదరాబాద్ కోసం ఫిబ్రవరి 2024లో ప్రకటించిన ఎస్‌ఎంఎస్ టెక్నాలజీస్ జాయింట్ వెంచర్‌కు, విశాఖపట్నం కోసం 12 ఆగస్టు 2025న ఇండియా సెమీకండక్టర్ మిషన్ కింద ఆమోదం లభించిందని తెలిపారు. రూ. 468కోట్లతో సంవత్సరానికి 96 మిలియన్ల పరికరాలను తయారుచేసే లక్ష్యంతో ఏర్పాటు కానున్న విశాఖ యూనిట్ నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని చెప్పారు.

ఎసిప్.ఎపాక్ట్ వైజాగ్ ఒసాట్ జాయింట్ వెంచర్ ఆంధ్రప్రదేశ్‌కు లభించిన ఒక ప్రతిష్టాత్మక సెమీకండక్టర్ విజయతమని ఆయన అభివర్ణించారు. ఏపీ ప్రభుత్వం అందించిన ప్రతిపాద నలను సానుకూలంగా పరిశీలిస్తామని ఈ సందర్భంగా లీ తెలిపారు.

# ఇక హస్తకళల పర్యాటకం


హస్త కళాకారులు తయారు చేసిన టోపీని ధరించిన డి.సిఎం పవన్

>> ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం 2026ను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు ఈ మహోత్సవంలో రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ హస్త కళాకారులు ఉత్పత్తి చేసిన కళా రూపాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రామాయణంలోని రావణ సంహార ఘట్టాన్ని తిలకించారు. సతీమణి అన్నా కొణిదల కోసం ఉప్పాడ జాందానీ చీరలు కొనుగోలు చేశారు. ప్రతి స్టాల్‌ను సందర్శిస్తూ, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ కళాకారులకు తనవంతు ప్రోత్సాహం అందించారు. కళాకారులతో మమేకమవుతూ, వారి నైపుణ్యాన్ని అభినందించారు. కళాకారుల సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కళాకారుల కోరిక మేరకు క్లస్టర్ల వారీగా గ్రూపు ఫోటోలు దిగారు. మన రాష్ట్రానికే సొంతమైన హస్తకళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. మహోత్సవంలో కాకినాడకు చెందిన తోలుబొమ్మల కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పవన్ కళ్యాణ్ సందర్శించారు. సనాతన ధర్మ ఔన్నత్యాన్ని తెలియజేసే విధంగారూపొందించిన రామాయణ, భారత, భాగవత కళారూపాలను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రావణ సంహార ఘట్టం అందర్నీ ఆకట్టుకుంది. తరతరా లుగా తోలుబొమ్మలాటను నమ్మకుని జీవనాధారం సాగిస్తున్న తమ కుటుంబాలు, నేడు అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చే స్థితికి చేరుకున్నట్టు కళాకారులు వివరించారు. తోలుబొమ్మలాట ఔన్నత్యాన్ని చాటేలా రాబోయే గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శన ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హస్తకళాకారుల స్టాళ్లను పరిశీలించారు. కొండపల్లి, ఏటికొప్పాక వంటి బొమ్మలను ఆసక్తిగా చూశారు. హస్తకళాకారుల గ్రామాలను పర్యాటకంతో అనుసంధానించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో చేనేత, హస్తకళల సలహాదారు సుచిత్రా ఎల్లా సూచించిన ప్రతిపాదనను పవన్ అభినందించారు. అనంతరం ఆయన మాట, మంతి కార్యక్రమంలో మాట్లాడుతూ హస్త కళాకారుల కోసం కంటిచూపు పరీక్షలు నిర్వహిస్తాం. భారతదేశ ఉనికికి హస్త కళారూపాలు మూలం. హస్త కళాకారుల కోసం ప్రభుత్వం దన్నుగా నిలబడుతుంది. ప్రతి కళాకారుడికి ఒక కథ, ఒక కష్టం ఉంటుంది. హస్తకళల గ్రామాలను పర్యాటకంగా అనుసంధానం చేయాలి. హస్త కళాకారుల సమస్యలపై కేబినెట్‌లో ప్రస్తావిస్తా జాతి గొప్పతనం నిర్మాణాల్లో కాదు, కళాకారుల పనితనంలో ఉంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. బొబ్బిలి వీణలు, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతి చాటుతున్నాయన్నారు. హస్తకళా రూపాలు ప్రపంచానికి చేరాలంటే ఆన్‌లైన్ మార్కెటింగ్ అవసరం అన్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటక అభివృద్ధికి చర్యలుతీసుకుంటామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రిస్పష్టం చేశారు. కళాఖండాన్ని రూపొందించిన కళాకారుడికి ఆ గుర్తింపు దక్కే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాకారుల కష్టాన్ని ప్రపంచానికి పరిచయం చేసే విధంగా ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులకి దిశానిర్దేశం చేశారు. విబి జీ రాం జీ పథకం కింద క్లస్టర్లవారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హస్తకళల పరిరక్షణకు అన్నివిధాల చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు క్లస్టర్ల వారీగా నిరంతరం వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.

**లేపాక్షి ఈ కామర్స్ యాప్ ఆవిష్కరణ:** హస్తకళా మహోత్సవం వేదిక నుంచి లేపాక్షి ఈ కామర్స్ యాప్ ను పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్ తో పాటు యాపిల్ యాప్ స్టోర్ లోనూ అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ ద్వారా మన రాష్ట్ర హస్తకళా ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త మార్కెటింగ్ అవకాశాలు దక్కనున్నాయి. దీంతో పాటు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన 100 ఉద్యమ్ వర్క్ షాపులను ప్రారంభించారు. 2 వేల మంది కళాకారులను అధికారిక పారిశ్రామిక వ్యవస్థలోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ వర్క్ షాపులను నిర్వహిస్తున్నారు. అనంతరం సంప్రదాయ హస్తకళల పరిరక్షణ, ప్రచారంలో విశేష కృషి చేసిన పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. సవిత, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ , రాష్ట్ర చేనేత, హస్తకళల విభాగం సలహాదారు సుచిత్ర ఎల్లా, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ , పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి , అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు , ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జీరాంజీ కింద తొలి విడతగా రూ.2,545.50 కోట్లు విడుదల

**విజయవాడ,.జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం భారీ ఊతం ఇచ్చింది.కూలీల వేతనాల కోసం రూ.1,414.16 కోట్లు కేటాయింపు చేసింది. మెటీరియల్ వ్యయాలకు రూ.942.77 కోట్లు విడుదల చేసింది..గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యం. ఇస్తూ ఈ పథకం అమలు చేస్తూంది..వీబీజీ-గ్రాం ద్వారా గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలియచేసారు.వికసిత్ భారత్-2047 లక్ష్య సాధ నలో ఏపీ ముందంజలో ఉంటుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆశాభావం వ్యక్తం

## ప్రశ్న రావణ్ నెల్లూరు జైలుకు తరలింపు

**నెల్లూరు క్రైమ్, జూలై 7, ప్రభాతవార్త :** హిందూ దేవుళ్లను అవమానించడంతోపాటు, మావోయిస్టు పార్టీకి అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన కేసులో ప్రశ్న రావణ్‌ను పోలీసుల అరెస్టు చేసి గన్నవరం కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. నేస్తమా ఆదేశాల మేరకు ప్రశ్న నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజులను దూషించిన కేసులోనూ నెల్లూరు దర్గా మిట్ట పోలీస్ స్టేషన్లో ఆయనపై కేసు నమోదయి ఉంది.

# ఎంట్రప్రెన్యూర్లుగా రైతులు

>> ఏటికొప్పాక, కొండపల్లి , ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడ, పొందూరు కళారూ పాల్గొ కూడా తీర్చిదిద్దాలి. ఇందుకోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. నేచర్, వాటర్, అమ్యూజ్మెంట్ పార్కులను అనుసంధానించాలి. సూర్యలంక మాస్టర్ ప్లాన్ త్వరితగతిన రూపొందించాలి. కుప్పంలో కంగుండి కోట, చిత్తూరు జిల్లాలో ఎలిఫెంట్ సఫారీ వంటివి అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా పర్యాటక రంగం నుంచి జీఎస్‌డీపీ వాటా పెరిగేలా చూడాలి, అని ముఖ్యమంత్రి చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అవసరమైన హోటల్ గదులు పెద్దఎత్తున వస్తున్నాయని సీఎం అన్నారు. 2024లో 4,390 హోటల్ రూములు ఉంటే ఈ రెండేళ్లలో 9,364 హోటల్ రూముల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. దీంతో రాష్ట్రంలో 13,753 హోటల్ రూములు అందుబాటులోకి వస్తున్నాయి... దీని కృషి చేసిన అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు.

**సోలార్ సెల్స్ తయారీలో అగ్రగామి కావాలి:** రెన్యువబుల్ ఎనర్జీ విస్తృత కావడంతో సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలను ఆహ్వానించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. సోలార్ సెల్స్‌లో ఏపీ అగ్రగామిగా నిలవాలన్నారు. ఇంకా ఏర్పాటు చేయాల్సిన 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని నిర్దేశించారు. డ్రైపోర్టు, బెర్తులన్నిటికి ఎంఎస్ఎంఈ పార్కులను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లతో యువతకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ వినియోగించేలా చూడాలన్నారు. టీపీసీఎల్ అమ్మా ప్రాజెక్టుల త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా సంప్రదింపులు జరపాలన్నారు. రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశానికి మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, దుర్గేష్, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా 339 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటితో రాష్ట్రానికి మొత్తం రూ.11,86,271 కోట్ల విలువైన పెట్టుబడులు వస్తున్నాయి. అలాగే 10,41,821 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి.

# ఫ్రాన్స్ అధ్యక్షునికి తప్పిన ప్రమాదం

**డమాస్కస్, జులై 7:** సిరియా రాజధాని డమాస్కస్‌లో వరుస పేలుళ్లు తీవ్ర కలకలం రేపాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆ దేశ పర్యటనలో ఉండగా ఆయన బస చేసిన హోటల్ వద్దే ఈ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. అయితే, ఈ ఘటనలో ఆయన క్షేమంగా బయటపడినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాతో సమావేశమయ్యేందుకు అధ్యక్ష భవనంలోకి మెక్రాన్ వెళ్లిన వెంటనే సమీపంలోని ఫోర్ సీజన్స్ హోటల్ వద్ద పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. సుదీర్ఘ కాలంగా అంతర్యుద్ధంతో నలిగిపోయిన సిరియా.. ఇటీవల అక్కడ పాలకులు మారిన తర్వాత పునర్నిర్మాణంపై దృష్టి సారించింది. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే గతంలో పలు దేశాలు విధించిన అనేక ఆంక్షలు ఎత్తివేయడానికి పాశ్చాత్య దేశాలను ఒప్పించడంలో కీలక పాత్ర వహించిన మెక్రాన్. అల్-షరా అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఆ దేశంలో కీలక పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతినిధుల బృందంలోతో కలిసి డమాస్కస్‌లోని ఫోర్ సీజన్స్ హోటల్‌లోనే బస చేశారు. మెక్రాన్ పర్యటన కొనసాగుతున్న సమయంలోనే హోటల్‌కు సమీపంలో రెండు పేలుళ్లు సంభవించాయి. చెత్తడబ్బాలో ఒకటి, పార్కింగ్ చేసిన కారులో మరో పేలుడు జరిగినట్లు సిరియా అధికారిక మీడియా తెలిపింది. ఈ ఘటనలో నలుగురు భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు సమాచారం. అయితే, డమాస్కస్‌లోని జస్టిస్ ప్యాలెస్ సమీపంలోని ఓ కేఫ్‌లో ఇటీవలే భారీ పేలుడు సంభవించగా, పది మంది ప్రాణాలు కోల్పోయారు.

## కాగ్నిజెంట్, విశాఖ ఐటి సెజ్‌కు కేంద్రం ఆమోదం

>> గా కూడా ప్రకటించడం విశేషం. కొన్ని నెలల క్రితం, ఫిబ్రవరిలో, తెలంగాణలోని నానక్‌రామ్ గూడ, ఆదిభట్లలో రెండు ఐటీ సెజ్‌ల ప్రతిపాదనలను కాగ్నిజెంట్ వెనక్కి తీసుకుంది. ఆ తర్వాత ఇప్పుడు విశాఖలో భారీ ప్రాజెక్ట్‌కు అనుమతులు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రాజెక్ట్ తో సుమారు రూ.1,580 కోట్ల పెట్టుబడి, దాదాపు 8,000 ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. దశలవారీగా పూర్తిస్థాయి క్యాంపస్‌ను అభివృద్ధి చేయనుండగా, విశాఖపట్నం ఐటీ స్వరూపాన్ని ఈ ప్రాజెక్ట్ సమూలంగా మార్చనుందని నిపుణులు భావిస్తున్నారు. విశాఖలో ఈ సెజ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌లకు, కొత్తగా చదువులు పూర్తి చేసి ఉద్యోగాల కోసం చూసే ఫ్రెషర్ లకు చాలా ఉపయుక్తంగా ఉంటుంది. స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇతర రాష్ట్రాలకు నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గుతుంది మౌలిక సదుపాయాలు, రవాణా, ఇంటర్నెట్ ఫెసిలిటీ వంటి అంశాలలో మెరుగుదల ఈ ప్రాంతంలో ఐటీ రంగ అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఈ ప్రాజెక్టు ఏపీ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. విశాఖ ఐటీ సెక్టార్ వృత్తి చెందడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుంది. ఇది ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి కీలకమవుతుంది. రాబోయే రోజులలో విశాఖలో మరిన్ని ఐటీ సంస్థలు వచ్చే అవకాశం పెరుగుతుంది. ఇది యువతకు ఉపాధి, రాష్ట్రానికి ఆర్థిక ప్రగతిని కలిగిస్తుంది.

# వేగంగా అమరావతి నిర్మాణం

## సిఆర్‌డిఎ 63వ సమావేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై 7,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి నిర్మాణం వేగవంతంగా జరిగే విధంగా సీఆర్డీఏ అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు కీలక కార్యచరణను చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు.ఆ దిశలో అధికారులు స్పందించి పనిచేయాలన్నారు.రాజధానిలో నిర్మాణాలు,ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ జరిగే విధంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో సీఆర్డీఏ 63వ అథారిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సీఎస్ సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. 2024 జూన్ 12 నుంచి రెండో దశ ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇస్తున్న రైతులకు ఎకరానికి వార్షిక యాన్యుటీగా రూ.40 వేల చొప్పున చెల్లించేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. భూములు అప్పగించిన తేదీ నుంచి పదేళ్లపాటు ఈ యాన్యుటీ అమల్లో ఉంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించారు.కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ తీర్మానించింది. 2026 జనవరి 6 లోపు తీసుకున్న వ్యవసాయ రుణాలకు ఈ నిర్ణయం వర్తించేలా అథారిటీ ఆమోదం తెలిపింది. ఇనాం భూములకు సంబంధించి దేవదాయ శాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకూ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.. అమరావతిలో అభివృద్ధి చేస్తున్న 25 టౌన్‌షిప్‌లలో ప్రతి దాంట్లోనూ తప్పనిసరిగా ఒక అంతర్జాతీయ పాఠశాల ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.ఇందుకు సమావేశం ఆమోదం తెలిపింది.ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ ప్రక్రియను అమలు చేయాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయాలని సమావేశం నిర్ణయం తీసుకుంది.ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సీఆర్డీఏ 63వ అథారిటీ సమావేశం నిర్ణయాలను మీడియాకు వివరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కోవూరు (నెల్లూరు), జూలై 7, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మంగళవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సంక్షేమం, ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే కూటమి లక్ష్యమని పేర్కొన్నారు.


మంగళవారం జకార్తాలో ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటోతో భేటీ అయిన ప్రధాని మోడీ

# ఇండొనేసియాకు 'బ్రహ్మాస్త్రం'

>> అత్యున్నత పౌర పురస్కారమైన బింటాంగ్ ఆదిపూర్ణ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియాను ప్రదానం చేసి అరుదైన గౌరవాన్ని అందించింది. జకార్తా పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. రక్షణ రంగంలో సహకారం ఈ ఒప్పందాల్లో ప్రధానంగా నిలిచింది. సముద్ర భద్రత, భద్రతా సహకారంపై ఉన్న అవగాహన ఒప్పందాన్ని ఇరు దేశాలు పొడిగించాయి. దీనికి తోడు, ఇండోనేషియాకు బ్రహ్మోస్, అస్త్రక్షిపణి వ్యవస్థలను అందించేందుకు ఒక రక్షణ కాంట్రాక్టుపై సంతకాలు జరిగాయి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), ఇండోనేషియాకు చెందిన రిపబ్లికోర్ప్ మధ్య గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణుల సహకారంపైనా ఒక ఒప్పందం కుదిరింది. వాణిజ్య, ఆర్థిక రంగాల్లోనూ వ్యూహాత్మక భాగస్వామ్యానికి బలమైన పునాది పడింది. ఖనిజాలు, ఉక్కు సరఫరా వ్యవస్థలలో సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఇండోనేషియాకు చెందిన పీటీ క్రాకటౌ స్టీల్ మధ్య ఒక వ్యూహాత్మక జాయింట్ వెంచర్ ఏర్పాటు కానుంది. వీటితో పాటు విపత్తు నిర్వహణ, వ్యవసాయం, టెలికమ్యూనికేషన్స్, వైద్య ఉత్పత్తుల నియంత్రణ, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై కూడా పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి. విద్యా, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించే దిశగా ఐఐఎం బెంగుళూరు, పీటీ ఇంటెలిజెన్షియా గ్రహతామా మధ్య ఒక ఎంఓయూ కుదిరింది. ఇండోనేషియాలోని చారిత్రక ప్రంబనన్ ఆలయ సముదాయ పరిరక్షణ, పునరుద్ధరణ కోసం ఒక లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను కూడా మార్చుకున్నారు. ఈ పరిణామాలు ఇరు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేశాయని భారత విదేశాంగశాఖ ప్రకటించింది.

## ప్రధాని మోడీకి ఇండొనేసియా అత్యున్నత పురస్కారం

>> ప్రజల భావోద్వేగాలకు చెందుతుందని తెలిపారు. భారత్, ఇండోనేసియా మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇది నిదర్శనమన్నారు. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినట్లు మోడీపేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తులను ఇండోనేసియా సర్కారు బింటాంగ్ ఆదిపూర్ణ అవార్డుతో సత్కరి స్తుంది.జకార్తాలోని అధ్యక్ష భవనంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ప్రధాని మోడీకి బింటాంగ్ ఆదిపూర్ణ పురస్కారాన్ని స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రబోవో మాట్లాడుతూ ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని నెలకొల్పే శక్తిగా భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు, ద్వైపాక్షిక సంబంధాలను మార్చడంలో ప్రధాని మోడీ వ్యక్తిగత నాయకత్వానికి ఈ పురస్కారం ఒక గుర్తింపు.మా గణతంత్రంఅందించే అత్యున్నత పురస్కారం ఇది. ఇండోనేషియా,భారత్ మధ్య ఉన్న చారిత్రక నాగరికతాబంధాలు,విడదీయరాని వ్యూహాత్మకవిశ్వాసానికి ఇది నిదర్శనమని ప్రకటించారు.

# ఆ 10 మంది మత్స్యకారులు సురక్షితం

>>నాయుడు ఆధ్వర్యంలో కవిటి ఎస్ఐ రవివర్మతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్ల చిరంజీవి, బషీర్ మరియు హోంగార్డు శ్రీనివాస్‌తో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, వెంటనే ఒడిశా సరిహద్దు ప్రాంతానికి పంపించారు. ఆయా పోలీసు బృందం ఒడిశా మెరైన్ పోలీసు, కోస్ట్ గార్డ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులతో నిరంతరం సంప్రదిస్తూ (కమ్యూనికేషన్) కొనసాగించింది.

మూడు రోజులపాటు నిరంతర శ్రమతో సహాయక చర్యలు నిర్వహించి, బోటును సురక్షితంగా పారాదీప్ సముద్ర తీర ప్రాంతానికి చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం మత్స్యకారులకు అవసరమైన భద్రత, ఆహారం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి, వారి కుటుంబ సభ్యుల వద్దకు క్షేమంగా చేరేలా అన్ని చర్యలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా మత్స్యకారుల ప్రాణాలను కాపాడేందుకు అంకితభావంతో పనిచేసిన జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పర్యవేక్షణలో ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నానాయుడు ఆధ్వర్యంలోని పోలీసు బృందాన్ని విశాఖపట్నం రేంజ్ ఐజీ మరియు మెరైన్ విభాగం ఐజీ గోపీనాథ్ జట్టి అభినందిస్తూ, వారి సేవా స్ఫూర్తిని ప్రశంసించారు.

## 38మందికి ఉరి ఖరారు

>> అప్పీళ్లను, అలాగే మరణశిక్షల ఖరారు పిటిషన్లను గుజరాత్ హైకోర్టు సమగ్రంగా విశ్లేషించింది. డిజిటల్ ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలు, నిందితుల కాల్ డేటా రికార్డులను పరిశీలించిన తర్వాత.. దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు చట్టబద్ధమైనదని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దోషులకు శిక్షల ఖరారుతో పాటు, ఉగ్రదాడిలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాల పట్ల న్యాయస్థానం మానవీయ కోణంలో స్పందించింది. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు గుజరాత్ ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. అలాగే తీవ్ర గాయాలపాలైన బాధితులకు రూ. 5 లక్షలు మరియు స్వల్ప గాయాలైన వారికి రూ. 1 లక్ష చెల్లించాలని కోర్టు ఆదేశించింది. తీర్పు అనంతరం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ మాట్లాడుతూ, డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించడానికి ముందు మార్చి 2025 నుండి ఈ అప్పీళ్లపై రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిగిందని తెలిపారు. "ఈ కేసులో విచారణ మార్చి 2025 నుండి రోజువారీగా జరుగుతూ వచ్చింది. మంగళవారం గుజరాత్ హైకోర్టు డివిజన్ బెంచ్ తన తీర్పును వెలువరించింది"అని పటేల్ పేర్కొన్నారు. పూర్తి స్థాయి తీర్పు ఇంకా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రాలేదని, పూర్తి ఉత్తర్వును పరిశీలించిన తర్వాతే దీనిపై మరింత వ్యాఖ్యానించగలనని ఆయన చెప్పారు. "ప్రస్తుతానికి, పూర్తి తీర్పు అప్‌లోడ్ చేయబడలేదు, కాబట్టి నేను దానిని చదివే అవకాశం పొందలేదు. తీర్పు పూర్తి పాఠాన్ని పరిశీలించిన తర్వాతే నేను దానిపై వివరంగా వ్యాఖ్యానించగలను" అని ఆయన అన్నారు. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసే హక్కు దోషులకు ఉంటుంది.

## వారం - వర్జ్యం

08-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
అష్టమి మ.12.37
రేవతి మ.3.55
వర్జ్యం : లేదు
దు. ఉ.11.46-మ.12.38
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

- **మేషం:** మాటల చాతుర్యంతో శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.
- **వృషభం:** దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం తెలుసుకుంటారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.
- **మిథునం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. కొత్తకార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఓర్పుతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు.
- **కర్కాటకం:** కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా నడుచుకోవ దానికి కొంత ఇబ్బంది పడతారు.
- **సింహం:** ఇంటాబయటా మీ మాటే చెల్లుబాటు కాగలదు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. శుభవార్తలు వింటారు.
- **కన్య :** స్థిరాస్తి వివాదాలు పరిష్కార మవుతాయి. వాహనాల విషయంలో జాగ్రత్తలు అవసరం. క్రీడారంగం యందు ఆసక్తి చూపుతారు.
- **తుల :** గృహసంబంధమైన విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన మీ వారిలో రానివ్వకుండా జాగ్రత్తలు వహించండి.
- **వృశ్చికం:** ఉపయోగపడని వ్యక్తులనుకున్న వారే కార్య విజయాలను కారణం అవుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.
- **ధనుస్సు:** రాజకీయ రంగాలలోని వారికి కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. చేతి వృత్తి పని వారికి అనుకూలంగా ఉంటుంది.
- **మకరం:** పుకారులను నమ్మకండి. సంతాన విద్యా విషయాలలో కొంత అశాంతికి లోను అవుతారు. గృహ యోగం కలదు.
- **కుంభం:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. నూతన ఒప్పందాలు కుదురు తాయి. ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు.
- **మీనం:** ముఖ్యమైన పత్రాలను జత చేయవలసిన వాటిని మర్చి పోయే అవకాశం ఉంది. జాగ్రత్తలు పాటించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్

# బాలికపై లైంగిక దాడి.. ఆత్మహత్య

## నిందితులపై పోక్సో కేసు నమోదు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై7,ప్రభాతవార్త:** బాలిక పై లైంగిక దాడి,బాలిక ఆత్మహత్యాయత్నం, మృతి చెందిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా లో చోటు చేసుకుంది.దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ప్రకారం కొవ్వూరు మండలం బంగారమ్మపేట గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికపై లైంగిక దాడి జరిగినట్లు ఆరోపణలు వెలుగుచూశాయి. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన బసవాని లక్ష్మణ్‌ను నిందితుడిగా గుర్తించిన పోలీసులు.. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితురాలు, నిందితుడు వరుసకు అన్నాచెల్లెలు అవుతారని సమాచారం. ఈ ఘటన అనంతరం బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బాలికను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు పోక్సోతో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పంటల బీమా పథకాలు కొనసాగింపు

**• అర్హులైన ప్రతి రైతు నమోదు చేసుకోవాలి • రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

**• రుణ రైతులకు ఆప్ట్అవుట్ విధానం యథాతథం • రుణేతర రైతులు కూడా స్వచ్ఛందంగా నమోదు చేసుకోవచ్చు**

**• అగ్రిస్టాక్ ఫార్మర్ ఐడి, ఇపంట ధ్రువీకరణకు ప్రాధాన్యం • రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం సబ్సిడీ భారం భరిస్తుంది**



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని రైతులకు పంటల భద్రత కల్పించేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలను 2026 -27 సంవత్సరానికి (ఖరీఫ్, రబీ) మరో ఏడాది పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, సహకార శాఖల ద్వారా సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. పంటల బీమా పథకాల ద్వారా ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఇతర అనుకోని కారణాలతో పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఖరీఫ్-2026 సీజన్‌లో నోటిఫై చేసిన ప్రాంతాల్లో నోటిఫై చేసిన పంటలను సాగు చేస్తున్న యజమాని రైతులు, కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులు, పంటపై బీమా హక్కు కలిగిన వారు అందరూ పథకంలో నమోదు చేసుకోవచ్చని మంత్రి పిలుపునిచ్చారు.

**రైతులు గడువులోపు నమోదు చేసుకోవాలి:** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఖరీఫ్-2026 సీజన్‌లో వరి మినహా అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి జులై 31 వరకు ఉండగా, రుణ, రుణేతర రైతుల నమోదు గడువు జులై 31గా నిర్ణయించబడిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వరి పంటకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 15 వరకు ఉండగా, నమోదు గడువు ఆగస్టు 15గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

రబీ 2026-27 సీజన్‌లో వరి మినహా అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 15 వరకు ఉండగా, నమోదు గడువు డిసెంబర్ 15గా నిర్ణయించారని, వరి పంటకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఉండగా నమోదు గడువు డిసెంబర్ 31గా నిర్ణయించినట్లు తెలిపారు.

**రుణ రైతులకు 'ఆప్ట్ అవుట్' విధానంలో బీమా:** సీజనల్ పంట రుణం లేదా కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి మంజూరైన లేదా పునరుద్ధరించిన రైతులు సంబంధిత బ్యాంకు శాఖల ద్వారా ఆటోమేటిక్‌గా పంట బీమా పరిధిలోకి వస్తారని మంత్రి తెలిపారు. బీమా వద్దనుకునే రైతులు మాత్రమే నమోదు గడువుకు కనీసం ఏడు రోజుల ముందుగా రుణం మంజూరు చేసిన బ్యాంకు శాఖకు లిఖితపూర్వకంగా 'ఆప్ట్అవుట్' ప్రకటన సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. అలాంటి ప్రకటన సమర్పించని రైతులందరూ స్వయంచాలకంగా బీమా పరిధిలోకి వస్తారని స్పష్టం చేశారు. నోటిఫై చేసిన పంటలకు సంబంధించి రుణ రైతులకు బీమా వర్తింపజేయడం తప్పనిసరి అని పేర్కొన్న మంత్రి, బ్యాంకులు రైతు చెల్లించాల్సిన ప్రీమియం వాటాను డెబిట్ చేసి, వాస్తవ సాగు విస్తీర్ణం ఆధారంగా పంటల వారీగా బీమా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు ప్రీమియంతో కూడిన సమగ్ర వివరాలను బీమా సంస్థలకు పంపించడంతో పాటు విదిశిలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

నిర్ణీత సమయంలో ప్రీమియం, రైతుల వివరాలను బీమా సంస్థలకు పంపించడంలో బ్యాంకులు లేదా శితిదిళీ విఫలమైతే, బీమా రక్షణ కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఆయా బ్యాంకులదేనని స్పష్టం చేశారు.

**రుణేతర రైతులకు స్వచ్ఛంద నమోదు:** రుణేతర రైతులు స్వచ్ఛందంగా పథకంలో నమోదు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఇందుకోసం యజమాని రైతులు రికార్డ్ ఆఫ్ రైట్స్ ల్యాండ్ పొజెషన్ సర్టిఫికేట్ లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇతర భూ రికార్డులను సమర్పించాల్సి ఉంటుంది.

కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ఒప్పంద పత్రాలు లేదా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. అదనంగా బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌బుక్ ప్రతులు, రైతు స్వీయ పంట సాగు ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలతో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి విదిశిలో నమోదు చేస్తారని, అసంపూర్ణ దరఖాస్తులు లేదా అవసరమైన పత్రాలు లేని దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## ఆగస్టు 1 నుంచి మార్కెట్లోకి

# 'స్వయం ఎపి' బ్రాండ్

**• 65 ప్రత్యేక ఉత్పత్తులకు సెర్ప్ గుర్తింపు**

**• గ్రామీణ మహిళా ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ • ఎస్‌హెచ్‌జీ మహిళా కుటుంబాల్లో వివాహాలకు కల్యాణలక్ష్మి**

**• మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఆగస్టు 1 నుంచి మార్కెట్లోకి 'స్వయం ఎపి బ్రాండ్' అందుబాటులోకి వస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం విజయవాడలోని సెర్ప్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ఆయా ప్రాంతాల సంప్రదాయాలను ప్రతిబింబించేలా 65 ప్రత్యేక ఉత్పత్తులను సెర్ప్ గుర్తించిందని, 587 మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారవుతోన్న ఈ ఉత్పత్తులను ఆగస్టు 1నుంచి మార్కెట్లోకి తీసుకు వస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. ఈ ఉత్పత్తుల నిల్వ, ఆర్డర్ల నిర్వహణ, స్పీడ్ సరఫరా కోసం రెండు ఫుల్ ఫిల్‌మెంట్ సెంటర్లను కూడా ప్రారంభిస్తామన్నారు. విజయవాడలో బాపూజీ మ్యూజియం దగ్గర మరియు గొల్లపూడిలోని టీటీడీసీ ప్రాంగణంలో రెండు సిగ్నేచర్ స్టోర్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఉత్పత్తులు అన్నీ నాణ్యతా ప్రమాణాల మేరకు ఉండేలా చూస్తున్నామని, ఈ విషయంలో మహిళా సంఘాలకు పూర్తి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ మహిళా ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆదాయం పెంచడంతో పాటు స్వయం ఏపీ బ్రాండ్‌ను మరింతగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే పారిశ్రామిక సంస్థల సమర్థవంత పనితీరుకోసం ప్రతి నెలా సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళల ద్వారా ఆధునిక యాంత్రిక, లాండ్రీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సెర్ప్ అధికారులకు మంత్రి సూచించారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు వివాహ సంబంధిత అవసరాల కోసం తక్కువ వడ్డీతో, సులభంగా రుణం అందించేందుకు స్త్రీ నిధి "కల్యాణ లక్ష్మి" పథకం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎస్‌హెచ్‌జీ మహిళలందరిని ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాలలో 100 శాతం నమోదు చేసి జీవిత, ప్రమాద బీమా రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. వెలుగు మార్ట్‌లు పనితీరు నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నష్టాలతో మూతపడిన, సరిగా పనిచేయని మార్ట్‌ల విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సెక్రటరీ సిఇఒ వాకాటి కరుణ, సెర్ప్ డైరెక్టర్లు, మార్కెటింగ్ సిబ్బంది, స్వయం ఎపి బ్రాండ్ కన్సల్టెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గుమ్మడి గోపాలకృష్ణకు సిఎం అభినందన

**• కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికపై చంద్రబాబు ప్రశంస**



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇటీవల కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికైన ఎపి నాటక అకాడమీ ఛైర్మన్, ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. సిఎం చంద్రబాబును సచివాలయంలో గోపాలకృష్ణ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రంగస్థలం నటనకు తొలిసారి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు రావడం సంతోషకరమన్న సిఎం, గుమ్మడి గోపాలకృష్ణకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గోపాలకృష్ణ వేసే నాటకాలన్నీ బాగుంటాయని, తన ప్రదర్శనలతో తెలుగు నాటక రంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని ముఖ్యమంత్రి కొనియాడారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యంపై వీడని మిస్టరీ

# వదంతులు నమ్మవద్దు: డిఎస్పీ తిలక్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసులో మిస్టరీ వీడలేదు. ఇంతవరకు ఏవిధమైన ఆచూకి లభించకపోగా సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంతో దర్యాప్తులో పోలీసులకు తలనొప్పిగా మారింది. కాగా ఈ సంఘటన పై పోలీసు దర్యాప్తు కొనసాగుతోందని పెద్దాపురం డిఎస్పి తిలక్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నారి జ్ఞానేశ్వరిని తల్లి వద్దకు చేర్చడమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారన్నారు. చిన్నారి ఆచూకీ తెలిసినవారు పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై ఎటువంటి కేసులు ఉండవని సంచలన ప్రకటన చేశారు. చిన్నారి జ్ఞానేశ్వరి కేసు పై పక్కా సమాచారంతో మీడియాలో వార్తలు ప్రచురించాలని, అసత్య కథనాల వలన కేసు పురోగతిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. కేసులో పురోగతి సాధించేందుకు మీడియా సహకరించాలని కోరారు.

## శాంతిపురంలో అమెరికన్ విద్యార్థుల సందడి

**• ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు పరిశీలన**



**శాంతిపురం, జులై 7 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఎంకెపురం గ్రామంలో అమెరికన్ విద్యార్థులు సందడి చేశారు. అమెరికాలోని ప్రెస్టిషియన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల బృందం గ్రామంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించింది. ఈ కార్యక్రమం రైతు సాధికార సంస్థ, ఎపి కమ్యూనిటీ మేనేజ్‌డ్ నాచురల్ ఫామింగ్ వారి ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికన్ విద్యార్థులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి పంట సాగు విధానాలు అడిగి తెలుసుకున్నారు. పంటల నిర్వహణ, గోఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, జీవామృతం, ఘనజీవామృతం తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతుల అనుభవాలను ఆసక్తిగా తిలకించారు. కుప్పం ప్రాంతంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతో ఆదర్శంగా ఉందని అమెరికన్ విద్యార్థులు పేర్కొన్నారు. రైతులు అనుసరిస్తున్న విధానాలతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంసి ఛైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు చూపిన దూరదృష్టిని అమెరికన్ విద్యార్థులకు వివరించారు. అలాగే స్వర్ణ కుప్పం లక్ష్యాల గురించి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల ఆదాయం, నేల, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు రామకుప్పం మండలం చెల్దిగానిపల్లి, పెద్దగానూరు గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో డిపిఎం అమృతవల్లి, నోడల్ అధికారి బాజీబాబు, ఎంసి డైరెక్టర్లు, ఎఫ్ఎంటిలు, రైతులు పాల్గొన్నారు.

# విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు

**• ప్రజల ప్రాణాలు, జీవనోపాధి పరిరక్షణే ప్రభుత్వ ప్రాధాన్యత • వాతావరణ హెచ్చరికల ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టి 'జీరో లాస్' లక్ష్యంగా పనిచేయాలి**

**• జిల్లా కలెక్టర్లు వ్యక్తిగతంగా సన్నద్ధత, ప్రతిస్పందన చర్యలను పర్యవేక్షించాలి • రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత**



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు చేపడుతున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. ఈ విషయంలో పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో ప్రభావంపై ఉన్నత స్థాయి అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. విపత్తుల వల్ల ఏ ఒక్క ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిరంతరం పని చేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

రాయలసీమ జిల్లాలపై ఎక్కువగా ఎల్‌నినో ప్రభావం చూపుతుందని అన్నారు. శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్రస్థాయిలో వర్షాల కొరత ఉందని తెలిపారు. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప జిల్లాల్లో ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతిలో వర్షభావ ప్రభావం మధ్యస్థంగా ఉన్నట్లు వెల్లడించారు. కరవు ముప్పు ఉన్న మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలలో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ వంటి కీలక సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదని సూచించారు. పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్ ఏపీఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు అత్యవసర స్పందనకు సిద్ధంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లాపై ఎల్ నినో ప్రభావం తీవ్రస్థాయిలో ప్రభావం చూపిందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వరి సాగు గణనీయంగా తగ్గిందని, ఇప్పటి వరకు కేవలం 30 శాతం విస్తీర్ణంలోనే నాట్లు వేశారని అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు పంట నష్ట పోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వరి మాత్రమే పండే ప్రాంతాల్లో రైతులు సాధారణ వరి రకాలు కాకుండా తక్కువ సమయంలో పంట వచ్చే వరి రకాలను సాగు చేయాలని సూచించింది. చెరువులు, బావులు, బోర్ల కింద పంటలు పండించే రైతులు తప్పని సరిగా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని అధికారులు తెలుపుతున్నారు.

**సోషల్ మీడియా వేదికగా వ్యవస్థీకృత దుష్ప్రచారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు:** సోషల్ మీడియా వేదికగా వ్యవస్థీకృత దుష్ప్రచారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. అశ్లీల పోస్టులు పెట్టడం, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారాలకు ఒడిగట్టే వ్యక్తులు, గ్రూపులపై నెట్‌వర్క్ ఆధారిత దర్యాప్తును ముమ్మరం చేయాలని ఆమె స్పష్టం చేశారు.

ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులతో కలసి శాంతిభద్రతలు, సైబర్ నేరాల కట్టడి, మహిళలకు రక్షణ, అమరావతి ప్రాంతంలో ప్రేరేపిత నిరసనలపై ఎస్‌వోపీ రూపకల్పన, ఇతర నేరాలపై పరిస్థితిని సమగ్రంగా చర్చించారు.

అన్ని పోలీసు జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు, ఐజీలతో పోలీసు పనితీరు, ఎదురవుతున్న సవాళ్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతరం అనిత మాట్లాడుతూ... రాష్ట్రంలో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ, చట్టబద్ధమైన విమర్శలకు ఆటంకం ఉండదు. అయితే అడ్డూ అదుపు లేకుండా రెచ్చిపోతే చట్టం తనపని తాను చేస్తుంది. రెండేళ్ల కూటమి పాలనలో ఏపీలో మహిళల భద్రత గణనీయంగా పెరిగింది. చిచ్చు పెట్టి విషం చిమ్మే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంటుంది అని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సమావేశంలో శాంతి భద్రతల ఏడీజీ మధుసూదన్‌రెడ్డి, సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు వేలం కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు


**• వర్జీనియా పొగాకు కొనుగోలుపై మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష**



**సచివాలయం, జులై 7 ప్రభాతవార్త:** వర్జీనియా పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సామాజిక సంక్షేమ, విద్యుత్, రెవెన్యూ శాఖల మంత్రులతో పాటు టుబాకో బోర్డు ఛైర్మన్, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌ల పరిస్థితి, కొనుగోళ్ల పురోగతి, రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి సమగ్రంగా చర్చించారు. ఈనెల 9న టుబాకో బోర్డు కేంద్ర సంయుక్త కార్యదర్శి ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న నేపథ్యంలో రైతులు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అధిక రిజెక్షన్ నమోదవుతున్న ఆక్షన్ ప్లాట్ ఫార్మ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను గుర్తించి వేంటనే పరిష్కరించాలని సూచించారు. పొగాకు వేలం కేంద్రాలను సంబంధిత సహచర మంత్రులు స్వయంగా సందర్శించి రైతులతో మాట్లాడాలని, కంపెనీల సిండికేట్ వ్యవహారాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఆక్షన్‌లలో పాల్గొనకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టుబాకో బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా, వర్జీనియా పొగాకుకు న్యాయమైన ధరలు లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ, ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పక్కా గృహాలు

**• రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**



**సచివాలయం, జులై 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు అందించే లక్ష్యంతో ఈ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టంచేశారు. పేదలకు పక్కా గృహాలు అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడంతోపాటు కేంద్రం నుంచి అధిక నిధులు సాధించి వారి సొంత ఇంటి కల నిజం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయంలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2014-19మధ్య మొత్తం 13,04,516ఇళ్లు మంజూరు చేస్తే రూ.10,194కోట్లు ఖర్చుచేసి 8,04,853ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. అందరికీ ఇళ్లు అందించాలన్న ఏకైక లక్ష్యంతో ఆనాడు రూ.10 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చుచేశారని గుర్తుచేశారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బిసిలు ఇళ్ల నిర్మాణంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.712.83 కోట్లు అదనపు ఆర్థిక సాయం అందించారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇంటికి రూ.50వేల చొప్పున ఆదివాసీ గిరిజనులకు ఇంటికి రూ.75వేల చొప్పున అందించి వారికి చేయూత నివ్వడం జరిగిందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

స్వర్ణ గ్రామం, వార్డుల్లో పనిచేసే 370మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖకు కేటాయించడంతో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం అవుతాయని మంత్రి హర్షం వ్యక్తంచేశారు. సిబ్బంది కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు ను 60 నుంచి 62కు పెంచడంతో గృహ నిర్మాణంలో నైపుణ్యం, విశేష అనుభవం ఉన్న దాదాపు 348మంది విధుల్లో కొనసాగే అవకాశం ఉందని వారి పర్యవేక్షణలో ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతం అవుతాయన్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని గృహ నిర్మాణ శాఖ చేపడుతుందని మంత్రి పార్థసారథి తెలిపారు. ఇప్పటికే బుట్టాయిగూడెం, తాడువాయి తదితర ప్రాంతాలో వేగంగా గృహ నిర్మాణాలు చేస్తున్నామన్నారు. పునరావసంలో భాగంగా పోలవరం పూర్తయ్యే లోపు నిర్వాసితులు అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పార్థసారథి స్పష్టంచేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.04/ఎ.టి.ఒ/2026-27, నిట్ నెం.12 తేది: 03.07.2026

కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్ డివిజన్, తెనాలి పరిధిలోని తెనాలి నియోజకవర్గంలో పాడీబానాకు శ్లాబ్ నిర్మాణము చేయు పనికి అంచనా విలువ: రూ.10.00 లక్షలతో CSR Funds క్రింద టెండర్లు మంజూరు చేయబడినవి. 01 పనికి అంచనా విలువ: రూ.10.00 లక్షలు. టెండర్లు 09.07.2026 నుండి ఇ-ప్లాట్ ఫారం https://www.apeprocurement.gov.in ద్వారా కోరబడుచున్నవి.

సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్ డివిజన్, తెనాలి.

DIPR.NO. 20849/CL/ADVT/1/1/2022-23 తేది: 07.07.2026

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RACPC తెనాలి, పి.బి.నెం.17, కొత్తపేట, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522201.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు

(I) ఋణగ్రహీత చిరునామా: శ్రీమతి రవీంద్ర సాయి మౌనిక, తండ్రి: ప్రభు కుమార్, డోర్ నెం.7-6-846/38, రాజీవ్ గాంధీ నగర్, 6/4 లేన్, కొత్తపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522001. మరొక చిరునామా: ఫ్లాట్ నెం.101, మొదటి అంతస్తు, శ్రీ సాయి రామ్ నివాస్, గుంటూరు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522001.
NPA: EB-RLMS HOME LOAN A/c No.44688814125

(II) బకాయి మొత్తం : తేది.19.06.2026 నాటికి రూ.42,32,024/- (అక్షరాల నలభై రెండు లక్షల ముప్పై రెండు వేల ఇరవై నాలుగు రూపాయలు మాత్రమే) + పైన పేర్కొన్న మొత్తానికి కాంట్రాక్టువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీతో కలిపి ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥వి వాటితో కలిపి చెల్లించవలెను.

(III) డిమాండ్ నోటీసు తేది : 19.06.2026 NPA తేది : 18.06.2026

స్థిరాస్థి వివరములు

శ్రీమతి రవీంద్ర సాయి మౌనిక, తండ్రి: ప్రభు కుమార్ గారి పేరున ఉన్న రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం.14330/2025, తేది.16-12-2025 S.R.O. నల్లపాడు నందు నమోదు చేయబడినది: షెడ్యూల్-A (స్థలం): గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-జిల్లా, పెదపలకలూరు గ్రామ పంచాయతీ ఏరియా, ప్రస్తుతం గుంటూరు న్యూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, పెదపలకలూరు గ్రామ డి నెం.357, 357/3 నందు విక్రేతకు విస్తీర్ణం 871.16 చ॥గ॥ల స్థలంపై హక్కు ఉన్నది. కొలతల ప్రకారం దీని విస్తీర్ణం 851.66 చ॥గ॥లుగా నిర్ధారించబడింది. తదనంతరం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నిర్వహించిన రీ-సర్వే ప్రకారం, పెదపలకలూరు గ్రామ డి నెం. 357/1, 356/1 నందు విస్తీర్ణం 851.66 చ॥గ॥ల స్థలం కలదు మరియు ఇందులో "శ్రీ సాయిరామ్ నివాస్" అపార్ట్‌మెంట్ నిర్మించబడినది. హద్దులు: తూర్పు: మాకినేని పెద రత్తయ్య గారి స్థలం - 75-0 అ॥లు, దక్షిణం: 33 అ॥ల వెడల్పు గల రోడ్డు - 105-0 అ॥లు, పడమర: 1వ పార్టీ వారి నెం.5, 6 యొక్క మిగిలిన స్థలం - 71-0 అ॥లు, ఉత్తరం: కటారి తిరుపతయ్య, వల్లంసెట్టి సాంబశివరావు ఇతరుల స్థలం - 105-0 అ॥లు.

అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటా విస్తీర్ణం 42.58 చ॥గ॥లు లేదా 35.60 చ॥మీ॥లులోని స్థలంతో పాటు ఫ్లాట్ విస్తీర్ణం 1037 చ॥అ॥లు (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియాతో కలిపి). షెడ్యూల్-B (ఫ్లాట్): పైన పేర్కొన్న A షెడ్యూల్ ఆస్తి స్థలం నందు అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని విస్తీర్ణం 42.58 చ॥గ॥లు లేదా 35.60 చ॥మీ॥లులోని పైన పేర్కొన్న స్థల వాటాకు సంబంధించి నిర్మించబడిన "శ్రీ సాయిరామ్ నివాస్" మొదటి అంతస్తులోని ప్లింత్ ఏరియా 1037 చ॥అ॥లు, కామన్ & పార్కింగ్ ఏరియాలతో ఫ్లాట్ నెం.101 కలదు. హద్దులు: తూర్పు: కామన్ కారిడార్, దక్షిణం: ఫ్లాట్ నెం.102, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై.

ఈ హద్దుల యందు నిర్మించబడిన "శ్రీ సాయి రామ్ నివాస్" మొదటి అంతస్తులోని ప్లింత్ ఏరియా 1037 చ॥అ॥లుతో (కామన్ మరియు పార్కింగ్ ఏరియాలతో సహా) ఫ్లాట్ నెం.101 అన్ని సౌకర్యాలు, కామన్ మరియు ఉమ్మడి హక్కులు, ఈజ్‌మెంట్ హక్కులు, అనుబంధ హక్కులు మొ॥వి, ఎలక్ట్రిసిటీ కనెక్షన్ డిపాజిట్, ఎలక్ట్రిసిటీ ఫిట్టింగ్‌లు మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు కేటాయించబడిన ఒక కార్ పార్కింగ్ స్థలంతో కలదు.

పైన చెప్పబడిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నారాకోడూరు బ్రాంచ్, నారాకోడూరు, గుంటూరు జిల్లా వారి నుండి ఋణము పొందియున్నారు. సదరు ఋణమునకు పైన ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనలనుసరించి సకాలంలో చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నిబంధనల ప్రకారం నిరర్థక ఖాతాగా పరిగణించబడినది. బ్యాంకువారు రిజిష్టర్ పోస్టు ద్వారా పంపించిన డిమాండ్ నోటీసులు తిరిగి వచ్చినందున/ ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరల నోటీసు జారీచేయడమగుచున్నది. కావున మీరు పైన పేర్కొన్న మొత్తములను ఈ పత్రికా ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా వడ్డీ & ఇతర ఖర్చులతో కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది : 19.06.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : తెనాలి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

8-7pg4_8-7pg4.qxd 07/Jul/26 10:53 PM Page 1



వార్త

చెడు మంత్రి వల్ల రాజు, చెడు సహవాసం వల్ల మంచి అలవాట్లు, చరిత్రహీనత వల్ల సంపదలు నాశనమవుతాయి.

- న- ఇబ్బన్

# దుష్కృత్యానికి చెంపదెబ్బ!

దేశం యావత్తును తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన అహ్మాదాబాద్ బాంబు పేలుళ్ల కేసులో కింది కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టు ఖాయం చేసింది. 38 మందికి ఉరిశిక్ష, 11 మందికి జీవితఖైదును ఖాయపరుస్తూ తీర్పు చెప్పింది. సుమారు 70 నిమిషాల వ్యవధిలో అహ్మాదాబాద్ నగరాన్ని అతలాకుతలం చేసిన 21వరుస బాంబు పేలుళ్ల దుర్ఘటనలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 46 మంది గాయపడ్డారు. భారతదేశ చరిత్రలో అత్యంత భయానక ఉగ్రదాడిగా నిలిచిపోయింది. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా 'సిమి' మాజీ నాయకుడు సఫ్దర్ నాగోరి, మరికొందరితో ఏర్పాటు చేసిన ఇండియన్ ముజాహిదిన్ ఈ ప్రేలుడు సంఘటనలకు సూత్రధారులు. కాగా శిక్షపడిన నేరస్థులందరూ హైకోర్టులో అప్పీల్ చేసుకుని వాదించుకోవడం విశేషం. 2002 గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ ప్రేలుళ్లకు ప్లాన్ చేసినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. కొందరు నిందితులు సమర్థించుకున్నారు కూడా. వీరిపై దేశద్రోహం, ఉగ్రవాద కార్యకలాపాలు, పేలుడు పదార్థాల చట్టం, హత్యాకావించడం వంటి నేరారోపణలపై వారం దరి మీద అహ్మాద్ పోలీసులు 35 ప్రాథమిక సమాచార నివేదికలు దాఖలు చేయగా ఒకే మూస కేసులుగా విచారణ జరిగింది. మొత్తం 78 మంది నిందితులపై విచారణ జరుగగా 49 మందిని దోషులుగా నిర్ధారించింది. తగిన ఆధారాలు లేవన్న కారణంగా 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఒకరు అప్రూవర్‌గామారారు. దాదాపు 13ఏళ్లపాటు విచారణ అనంతరం అహ్మాదాబాద్ ప్రత్యేక సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎ.ఆర్.పటేల్ ఫిబ్రవరి 8, 2022న తీర్పు వెలువరించి అదే నెల 18న శిక్షలు ఖరారు చేశారు. 38 మందికి ఉరిశిక్ష, 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. ఒక ఉగ్రవాద కేసులో ఇంత పెద్ద సంఖ్యలో ఉరిశిక్షలు విధించడం భారత న్యాయ చరిత్రలోనే అరుదైన విషయం. 7వేలకుపైగా పేజీల తీర్పులో ప్రస్తావించిన ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకొని శిక్షలు విధించారు. ఈ కేసులో నిందితులను సభ్యసమాజంలో తిరుగనివ్వడమంటే మానవ మాంసానికి తహతహలాడే చిరుతను వారిపైకి వదిలి పెట్టినట్లే అవుతుందని కోర్టున్యాయమూర్తి వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగం పట్ల ఏమాత్రం గౌరవభావం లేని నిందితులు ప్రజాస్వామ్యవ్యవస్థను కూల్చివేయాలనే ఉద్దేశంలోనే ఈ దురాగతానికి పాల్పడ్డారని కోర్టు అభిప్రాయానికి వచ్చింది. ఇలాంటి నేరాలను అతిసాధారణ నేరాలుగా ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని కోర్టు అభిప్రాయపడింది. దేశంలో ఉగ్రవాదాన్ని, వాటి ఛాయల్ని తుడిచిపెట్టాలన్న సంకల్పంతో, ఇతరులకు ఇలాంటి కేసుల్లో శిక్షలే భయపెట్టించాలని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. కేవలం నిందితులను శిక్షించడం ద్వారా వారిని సత్ప్రవర్తన వైపు మళ్లించాలన్నది న్యాయవ్యవస్థ ప్రధాన సిద్ధాంతం. కానీ అహ్మాదాబాద్ ఘోరకలికి బాధ్యులైనవారు క్షమార్హులు కాదనే సందేశాన్ని ఈ తీర్పు స్పష్టంచేస్తోంది. వందమంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు, కానీ ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదన్న' న్యాయ సిద్ధాంతం నేపథ్యంలోనే ఈ అంశంపై దోషులను గుర్తించి సిద్ధపడడానికి బాగా సమయం తీసుకోవాల్సి వచ్చింది. సంఘటనకు బాధ్యులుగా భావించి గుర్తించిన నిందితుల్లో 28 మంది నిందితులను కోర్టు నిదానంగా ఒక్కొక్కరి పాత్రను సమీక్షించింది. ఉగ్రవాదం వంటి అత్యంత హీనమైన కేసుల్లో కేవలం సందేహాల కారణంగా శిక్ష విధించరాదని కోర్టు అభిప్రాయపడుతూనే బలమైన సాక్ష్యాధారాలుఉన్నవారినే నిందితులుగా నిర్ధారించింది. సుదీర్ఘకాలం సాగిన దర్యాప్తులో కేసులో ప్రధాన సాక్ష్యాల గుర్తింపు, పేలుడు పదార్థాలు, ఆయుధాల స్వాధీనం వంటి అంశాల్లో దర్యాప్తులో కొన్ని లోపాలున్నాయని ప్రతివాద న్యాయవాదులు ఈ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారు. అయినా నిజమైన నిందితులను గుర్తించడంలో కిందికోర్టు బాగా ప్రయాసపడినట్లే! సాక్ష్యాల సమగ్ర పరిశీలన అనంతరమే నిందితుల పాత్రను నిర్ధారించుకున్న తర్వాతనే వారిపై అభియోగాల ఖరారు, పాత్ర, శిక్షార్హతపై పలు చర్చలు కూడా నడిచాయి. ప్రత్యేక కోర్టులు ఉరిశిక్ష విధిస్తే న్యాయప్రక్రియలో హైకోర్టు శిక్షలు ధృవీకరించాల్సి ఉంటుంది. అదే ఇప్పుడు జరిగింది. దీనికి మరో మజిలీ సుప్రీంకోర్టు. ఏ నిరపరాధి శిక్షించబడకూడదు. ఏ అపరాధీ తప్పించబడకూడదనే న్యాయసూత్రంతో న్యాయప్రక్రియమిళితమై ఉంది. దుస్సంఘటన, దురాగతం ఏ స్థాయిలో ఉన్నా, ఎవరు నిందితులెవరైనా ఏదో ఒకనాడు శిక్షలను అనుభవించాల్సిందే. ఉగ్రవాదంపై రాజీ ఉండబోదన్న సంకల్పానికి ప్రతీకగా గుజరాత్ అహ్మాదాబాద్ ప్రేలుళ్ల సంఘటన విచారణ చట్టబద్ధంగా సాగింది. సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల హక్కుల పరిరక్షణ కూడా ఈ కేసులో ప్రధానంగా పాటించారు. ఇలాంటి ఉదంతాలు జరగకుండా నిఘా వ్యవస్థ మరింత పటిష్టంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని కూడా ఈ సంఘటన గుర్తు చేస్తోంది. ఆనాటి దుర్ఘటనకు బలైన కుటుంబాలకు హైకోర్టు పరిహారాలను ప్రకటించడం మానవతా దృక్పథంతో కూడినదే. విచారణ కాలంలో 9 మంది న్యాయమూర్తుల ముందు 1163 మంది సాక్షులను విచారించగా చివరకు ప్రత్యేక కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టు ఆ శిక్షలను సమర్థించడం ఆహ్వానించదగినది. ఆనాటి ఘటనలు ఎంతో అమానుష కృత్యంగా భావించి యావత్తుభారతదేశం తల్లడిల్లిపోయింది. జస్టిస్ అల్పేష్ కోగే, జస్టిస్ సమీర్ జె దవే కూడిన అహ్మాదాబాద్ డివిజన్ బెంచి స్పెషల్ కోర్టు తీర్పును కూలంకషంగా పరిశీలించింది. దుష్కృత్యాలు ఏ రూపంలో జరిగినా వాటి వెనుక ఉన్న ముష్కరులకు శిక్షలు తప్పవని నేటి తీర్పు తేటతెల్లం చేస్తోంది.



కష్టాల్లో ఉన్నాననీ, తాను హీనుడనీ, ఏమీ సాధించలేననీ, పగలూ రాత్రి అనుకుంటూ ఉండే మనిషి ఎందుకూ కొరగాడు.

వివేకానందుడు



మనిషి గుణాలన్నిటికీ సాహసం మొదలు, సాహసం ఇతర గుణాలకు బాధ్యత వహిస్తుంది.

చర్చిల్

## ప్రజావాక్కు

### వినియోగదారుల రక్షణ నైతిక బాధ్యత

వాట్సాప్ ప్రతిపాదించిన యూజర్‌నేమ్ ఫీచర్‌పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న చర్చ ఒకకీలక అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. వినియోగదారుల సౌలభ్యం ఎంత ముఖ్యమో, వారి భద్రత అంతకంటే ముఖ్యమనే విషయాన్ని ఈ వివాదం గుర్తు చేస్తోంది. ఫోన్ నంబర్‌కు బదులుగా యూజర్‌నేమ్ ఆధారంగా సంభాషించే అవకాశం కల్పించడం గోప్యతకు మేలు చేసినా, అదే సమయంలో నకిలీ గుర్తింపులు, వ్యక్తుల పేర్లను అనుకరించడం, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలకుఅవకాశం కల్పిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో కేంద్రప్రభుత్వం భద్రతాపరమైన అంశాలపై వివరణ కోరుతూ జాగ్రత్త వైఖరిని అవలంబించడం సముచితమే. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న భారతదేశంలో సామాజిక మాధ్యమ వేదికలు కేవలం చట్టపరమైన నిబంధనలను పాటించడం మాత్రమేకాకుండా, వినియోగదారుల రక్షణను తమ నైతిక బాధ్యతగా భావించాలి. పారదర్శకత, జవాబుదారీతనం, గుర్తింపు ధ్రువీకరణ వంటి ప్రమాణాలను పాటించాలి.

- సి.హెచ్.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### అందరికీ విద్యాశక్తి పథకం

కార్పొరేటివ్ ప్రైవేటు, ప్రభుత్వపాఠశాలలకు చాలా వ్యత్యాసఉంది. ఉంటుంది, ఉండాలి కూడా. నిజమైన మానవ వికాసం ప్రభుత్వ పాఠశాలల్లోనే జరుగుతుంది. అక్కడ మాత్రమే కరికులర్ ఎగస్ట్రా కరికులర్ యాక్టివిటీస్ విశాలమైన పాఠశాల ప్రాంగణంలో ఆహ్లాదకరమైన గ్రామీణ వాతావరణంలో స్వేచ్ఛను ఆస్వాదించగలిగేలా విద్యా బోధన జరుగుతుంది. ఇక్కడ కోచింగ్ కంటే టీచింగ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖ మాత్యులు ఈనాటి కాలానికి తగినట్టుగా విద్యార్థిని విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యాబోధన జరగాలని భావిస్తూ మార్పులను ఆహ్వానిస్తూ ఒత్తిడి లేకుండా సూచిస్తూ ఉన్నారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### సర్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఓటరు ప్రక్షాళన జాబితాను ఓటర్ సవరణలతో పాటు చనిపోయిన వారి ఓట్లు, అనర్హత ఓట్లను తొలగించాలి .ఎన్యూమరేషన్ ఫారం పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్ఓలదే. ఫారాలు నింపాల్సిన బాధ్యత కూడా వాళ్లదే.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### రచయితలను ఆదుకోవాలి

ఒక అక్షరం వేయి గుండెలను మేలుకొలుపుతుంది. ఒకపాట ఒక నియంతను గద్దె దింపుతుంది. ఒక పుస్తకం సమాజాన్ని జాగత్రుతం చేసి దేశ ప్రగతికి అవసరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బాటలు వేస్తుంది. పుస్తకాన్ని ఎటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయం లేకుండా ఎక్కడైనా ఎప్పుడైనా పాఠకుడు చదవబానికి అవకాశంఉంది. సమాజాన్ని సరైన పంథాలో పెట్టడానికి రాబోయే కాలంలో ప్రజలకు ఎదురయ్యే కష్టాలను ఏకరువు పెట్టడానికి రచయిత తన కాలాన్ని కత్తిలా ఉపయోగించి అక్షరయజ్ఞం చేస్తాడు. ప్రతిఫలాన్ని ఆశించకుండా తన విజ్ఞానాన్ని ఆర్థిక స్థోమతను వినియోగించి రచనలు చేసి ముద్రించి గ్రంథాలను విఫణవీధిలోకి తెస్తున్నాడు. కాని ఆపుస్తకాలు కొనేవారు కరవైపోయారు. ఒక్కో పుస్తకాన్ని ఆవిష్కరించాలంటే కనీసం యాభైవేల రూపాయలు ఖర్చు అవుతుంది. అమ్మకాలు లేక వంద రూపాయలకు కనీసం పదిరూపాయల సొమ్ము కూడా తిరిగి రావడం లేదు. ప్రభుత్వాలు రచయిత గ్రంథాల ముద్రణకు ఎంతో కొంత సహాయం చేయాలి.

- జాన్నభట్ల నరసింహప్రసాద్, నాగారం

### జీవన ప్రమాణాన్ని పెంచే ఉపాధిహామీ

ఉపాధి హామీ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమేనా ప్రజల జీవన ప్రమాణాలను పెంచే శక్తి ఏమైనా ఉందా అని ఆలోచిస్తే ఇది సంక్షేమంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను కచ్చితంగా పెంచుతుందిఅని చెప్పవచ్చు. ఉపాధి హామీ ద్వారా ఆస్తుల సృష్టితో పాటు రైతులఆస్తుల సృష్టి కూడా కచ్చితంగా చెప్పవచ్చు. ఇలాంటి పథకాలు కేవలం సంక్షేమం అనే మూస ధోరణిలో కాకుండా అత్యవసర సమయాలలో కూడా పని చేస్తుంది అని చెప్పవచ్చు. ముఖ్యంగా లాక్‌డౌన్ ఉదంతం తీసుకుంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండడానికి ఈ పథకమే ముఖ్య కారణం. అందువల్ల ఉపాధి హామీ కేవలం సంక్షేమం మాత్రమే కాదు జీవన ప్రమాణ రేటును పెంచే స్కీమ్ అని నిశ్చితంగా చెప్పొచ్చు.

- భారత అవినాష్, జనగామ

### ఆర్ట్స్ కాలేజీని తరలించవద్దు

మానుకోటలో ప్రస్తుతం నడుస్తున్న రెడ్యాల ఆర్ట్స్ జూనియర్ కాలేజీని అదే ప్రాంతంలో నడపాలి. రెడ్యాల ప్రాంతానికి తరలించవద్దు. గిరిజన పిల్లలు జిల్లాకేంద్రంలో ఉండి చదువుకోవాలి. గ్రామాలకు తరలించడం వలన విద్యార్థులకు టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందికి ఇబ్బందికరంగా ఉంటుంది.

-కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# యుద్ధాలకు దూరం వ్యూహాత్మక సంబంధాలే!

*భారత్ వ్యూహాత్మకంగా సమదూరం పాటించటమే కాకుండా చైనా లాంటి దేశాన్ని న్యూట్రల్గా కొన్నాళ్ళయినా చేయగలుగుతే పాకిస్థాన్ కవ్వింపులు, ఉగ్రవాదాల దాడులను తేలిగ్గా అధిగమించ గలదు! పాకిస్థాన్ బెలూచిస్థాన్ తలనొప్పిని ఎదుర్కొంటూనే పాక్ ఆక్రమిత కాశ్మీర్ తిరుగుబాటుతో అతలాకుతలమవుతున్నది! అందుకనే అంతర్జాతీయంగా దృష్టిమరల్చటానికి మన దేశం మీద ఏదైనా పన్నాగం పన్నే అవకాశం వుంది! మొన్నటి ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ప్రధానమంత్రి జాగ్రత్తగా వ్యవహరించి దౌత్యపరంగా మెరుగైన విధానాలతో భారత్‌కు గౌరవస్థానాన్ని, ఇతర దేశాలు మెచ్చుకొనే విధంగా కల్పించ గలగటంలో కృతకృత్యులయ్యారు! అదే విధంగా ఇప్పుడున్న అనిశ్చిత శాంతి పరిస్థితులలో తప్పటడుగులు మన దేశం వేయదనే నమ్మకం క్రమేపీ బలపడుతున్నది!.*



రావులపాటి సీతారాంరావు

విదేశాంగ వ్యవహారాలు ఎప్పుడు ఏ మలుపు తిరుగుతాయో చెప్పటం ప్రఖ్యాతిగాంచిన విదేశీవ్యవహారాల పండితులకు, విశ్లేషకులకూ సాధ్యపడదు! దానికి కారణం పరిస్థితులు దేశాల నాయకుల చేతుల్లో వుండవు! ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేని పరిస్థితులల్లో దేశాల నాయకులు ఎప్పటికి ఏది ప్రస్తుతమో, ఏది అవసరమో చేసుకుంటూ పోకతప్పదు! భారతదేశానికి ఇబ్బందికరమైన పరిస్థితే వచ్చిపడింది! (ఫిబ్రవరి 25-26) అంటే అమెరికా, ఇజ్రాయిల్ కలిసి కట్టుగా ఇరాన్ మీద దాడి చేయకమునుపు (కొద్ది రోజుల తేడా ఫిబ్రవరి 28 నాడు దాడులు మొదలయ్యాయి), యాదృచ్ఛికంగా ప్రధాని మోడీ ఇజ్రాయిల్ రాజధాని టెల్ ఎవివ్‌ను సందర్శించారు! దాడుల తర్వాత ప్రధాని ఇజ్రాయిల్ పర్యటన ప్రత్యక్ష ఇబ్బందులు తెచ్చిపెట్టక పోయినా అనూహ్యంగా ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల సంఘర్షణలలో ఎటు మొగ్గాలో (విధిలేని పరిస్థితులలో) అన్న నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందా ఆ పరిస్థితి తప్పదా? అని మన విదేశాంగ శాఖ ఆలోచన చేయక తప్పలేదు! అదృష్టవశాత్తు భారత్ ఆ సంఘర్షణలల్లో భాగంగా మారే పరిస్థితి కలగలేదు! ప్రధాని మోడీ మౌనంగా పరిస్థితులను ఆకళింపు చేసుకొని జాగ్రత్తగా వ్యవహరించటం వల్ల ఆ గండం నుంచి ఒక విధంగా భారత్ బయటపడింది! అయితే ప్రస్తుతానికి ఇబ్బందికరమైన నిర్ణయాలు దాటవేయటం జరిగింది కానీ ముందు ముందు మరింత క్లిష్టంగా ఇజ్రాయిల్ ఇరాన్ సంబంధాలు మారితే భారత్ ఏవిధంగా వ్యవహరించాల్నో, ఆలోచన చేయాల్సిన అవసరం మాత్రం వుంది! ఇరాన్ ప్రధాని అయతుల్లా అలీ ఖొమైనీ అంతిమ సంస్కారాల కార్యక్రమానికి హాజరుకాకపోవటం దేశంలో ఎవరికీ ఆశ్చర్యాన్ని అందుకే కలిగించలేదు. భారత్ పంపిన డెలిగేషన్లో విదేశాంగ శాఖ మినిస్టర్ ఆఫ్ స్టేట్ పబిత్రా మార్గరిటా, బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అలా హస్నియాన్ (రిటైర్డ్) వుండటం రాజకీయంగా ఇరాన్‌కు నమ్మకం కలిగించటంతో పాటు భారత్ విధానం కూడా చెప్పకనే చెప్పినట్లయింది! ఇరాన్‌తో ఇజ్రాయిల్ సంఘర్షణలు ఈ మధ్య యుద్ధ స్థాయికి రాకమునుపు, ఇండియా ఇజ్రాయిల్ స్నేహ సంబంధాలు బాగానే వుండేవి! ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ దేశాల మధ్య ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ఇజ్రాయిల్ తోనూ ఇరాన్ తోనూ సంబంధాలు చాలా దగ్గరగానూ చాలా దూరంగాను వుండకుండా న్యూట్రల్గా వుండే విధంగా విదేశాంగ విధాన అమలులో చిన్నపాటి మార్పులు చేసుకోక తప్పలేదు! నిజానికి ఇజ్రాయిల్ దేశం మిలటరీ టెక్నాలజీ, ఇంటలిజెన్స్ ఎక్స్‌పర్టైజ్ ఇండియాకు అందజేసినట్లు, అంతేగాకుండా కౌంటర్ ఇన్‌సర్జెన్సీ, సాంకేతిక నైపుణ్యాన్ని మన దేశ నిపుణులకు తర్ఫీదు లాంటిది ఇచ్చినట్లు మీడియా వార్తలు వున్నాయి! ఈ సంఘర్షణల నేపథ్యంలో అలాంటివి సంబంధాలు బహిర్గతపర్చటం, ఇండియాకు మంచిది కాదు. సమదూరం పాటిస్తున్న వైఖరిని ప్రదర్శించటమే విదేశాంగ విధానంలో అవలంబించాల్సిన పద్ధతి! ఒక విధంగా ఇజ్రాయిల్‌ను కొంచెం దూరంగా పెట్టటం నష్టమైనా తప్పని పరిస్థితి! ఆర్థిక ప్రగతి ఈ యుద్ధాల వల్ల ముఖ్యంగా చమురు దిగుమతుల విషయంలో ఇతర దేశాలలోనే కాదు మన దేశంలో కూడా కుంటుపడిన విషయం అందరికీ తెలిసినదే! మన దేశంతో ఇరాన్‌కు వున్న సంబంధాలు ప్రాచీన నాగరికతకు సంబంధించినవి! ఈ రెండు దేశాలకే ఆ పేరు వుంది. ఈమధ్యకాలంలో దక్షిణ ఆసియా రాజకీయాలలో భారతదేశం



ఆచితూచి అడుగు వేస్తుంది కాబట్టి ఇరాన్‌కు మరింత దగ్గరగా వుండలేక పోయిన వాస్తవాన్ని దాయాల్సిన పనిలేదు! అంతమాత్రాన ఇరాన్‌తో అనేక కారణాల వల్ల అంటీముట్టనట్లుగా వుండాల్సిన అగ త్యమూ లేదు! ముఖ్యంగా జలసంధి (హర్ముజ్)లో మన చమురు నౌకల రాకపోకలన్నీ సుహృద్భావ వాతావరణంలో బలపడినవే! అందువల్లే చమురు కొరత సంభవించినా మన దేశం ఆ విషయంలో చాలా తక్కువగానే నష్టపడింది! ఇతర దేశాలతో పోల్చుకోవటం అనవసరం. ఎంతగా పాకిస్థాన్‌మధ్యవర్తిత్వం నెరిపి ఇరాన్ తనకు అత్యంత సన్నిహిత దేశంగా బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు ఆదుర్దా పడుతున్నా ఇరాన్, ఇండియా సంబంధాలకు పాకిస్థాన్ అడ్డుతగలలేక పోయింది! ఇండియా స్నేహ సంబంధాలను పాకిస్థాన్ వల్ల ఇరాన్ వొదులుకునే పరిస్థితి లేదు! ఎంతవరకు నిజమో కానీ భారత్‌లో ఇరాన్‌లో వున్న షియా మతస్థుల సంబంధాల నేపథ్యంలో శతృత్వం లేనిమాట నిజం! ప్రతిక్షణం పరిస్థితులు మారేది ప్రపంచ దేశాల మిత్రత్వం వల్లనో శతృత్వం వల్లనో అన్న సత్యం చరిత్ర ప్రతిసారీ జ్ఞాపకం చేస్తూనే వుంటుంది! ఇజ్రాయిల్‌తో అమెరికా సంబంధాలలో తేడాలు వుండకపోవటం వల్లే, ఇరు దేశాల నాయకులు ఇరాన్ దేశాన్ని ఒక పట్టుపట్టాలని చూసారు. సంఘటితంగానే అప్రకటిత యుద్ధం ఘర్షణల రూపంలో మొదలుపెట్టారు! నిజానికి అమెరికా పాలసీ ఈ విషయంలో మారుతుందని ఎవరూ ఊహించలేదు! యుద్ధం మధ్యలో వాషింగ్టను టెల్ ఎవివ్‌కు పొరపొచ్చాలు లెబనాన్ విషయంలో, డోనాల్డ్ ట్రంప్ ఇంటా బయటా యుద్ధం విషయంలో ఎదుర్కొన్న విమర్శల వల్లనో, ఇరాన్ అప్రతిహతంగా ప్రతిఘటించటం వల్లనో ఇప్పుడు సంబంధాలు బెడిసికొట్టాయి! ట్రంప్ ఇరాన్‌ను తేలిగ్గా తీసుకొని, ఇజ్రాయిల్ పి.యం మాటలు నమ్మి అకారణంగా ఇరాన్‌తో వైరాన్ని తెచ్చుకొని, మింగలేని, కక్కలేని పరిస్థితులు ఎదుర్కోవటంతో నెతన్యాహూ (ఇజ్రాయిల్ ప్రైమ్ మినిస్టర్)ను బాహాటంగానే విమర్శించసాగాడు. చివరకు అనేక దేశాల ఆర్థికనష్టాలు హర్ముజ్ జలసంధిపై విధించిన నిబంధనల వల్ల పెరిగిపోయి చమురు, ఇతరఉత్పత్తుల కరవుతో పెక్కుదేశాల్లో యు.యస్.ఏ ఆధిపత్యం బలహీనపడింది! ఇలాంటి పరిస్థితులలో భారత్‌కు వేరే దారిలేదు! కేవలం దౌత్యపరంగా, వ్యూహాలను మార్చుకుంటూ సమన్వయంతో కాలగమనాన్ని వీక్షించటం తప్పు! ఇండియా ఒక విధంగా మెరుగైన స్థితిలో వుండటానికి కారణం అరబ్‌గల్ఫ్ దేశాలకు వెళ్ళినవారు అక్కడ సంపాదించిన డబ్బును మన దేశానికి పంపటం వల్ల సంబంధాలు రోజురోజుకూ ఈ యుద్ధపు నీడలు పడేంతవరకూ చాలా బాగా వుండేవి! ఒక్క సౌదీ అరేబియా మాత్రం పాకిస్థాన్‌తో ఈ మధ్య దగ్గరవు తున్న మాటనిజం! అయినా యునైటెడ్ అరబ్ ఇమరేట్స్‌తో మన దేశ సంబంధాలు ఇంకా దృఢంగానే వున్నాయి! ఇప్పుడు భారత్, యూరప్ దేశాలతో పాటు చైనా, జపాన్లతో దగ్గర కాకతప్పదు! చైనాతో ఈమధ్య ఆర్థిక సంబంధాలు పవర్ గ్రిడ్ డీల్స్‌తో పాటు ఎగుమతి దిగుమతులవాణిజ్యం మెరుగుపర్చుకుంటున్నట్లు మీడియాలో వార్తలువస్తున్నాయి. ప్రధాని జపాన్, ఫ్రాన్స్, స్కాండనేవియన్ దేశాలతో సంబంధాలు మరింతగా పెంచుకొనే దిశలో వున్నట్లు వార్తలు వస్తున్నాయి! అమెరికాను మన దేశం అన్నివేళలా నమ్మే పరిస్థితి చాలా తక్కువ. రష్యా, ఉక్రెయిన్ సమస్యతో తీరికలేకుండా వున్నది. పాకిస్థాన్ మాత్రం రష్యా, అమెరికా మాదిరి దగ్గరకు తీసే పరిస్థితి లేదు. రష్యా ఎప్పటికీ భారత్ స్నేహాన్ని వదులుకోదు! ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల్లో ఎవరికి దగ్గర కావాలన్నది భారత్ ఆలోచించే ప్రసక్తే లేదు!భారత్ వ్యూహాత్మకంగా సమదూరం పాటించటమే కాకుండా చైనా లాంటిదేశాన్ని న్యూట్రల్గా కొన్నాళ్ళయినా చేయగలుగుతే పాకిస్థాన్ కవ్వింపులు, ఉగ్రవాదాల దాడులను తేలిగ్గా అధిగమించ గలదు! పాకిస్థాన్ బెలూచిస్థాన్ తలనొప్పిని ఎదుర్కొంటూనే పాక్ ఆక్రమిత కాశ్మీర్ తిరుగుబాటుతో అతలాకుతలమవుతున్నది! అందుకనే అంతర్జాతీయంగా దృష్టిమరల్చటానికి మన దేశం మీద ఏదైనా పన్నాగం పన్నే అవకాశం వుంది! మొన్నటి ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ప్రధానమంత్రి జాగ్రత్తగా వ్యవహరించి దౌత్యపరంగా మెరుగైన విధానాలతో భారత్‌కు గౌరవస్థానాన్ని, ఇతర దేశాలు మెచ్చుకొనే విధంగా కల్పించ గలగటంలో కృతకృత్యులయ్యారు! అదే విధంగా ఇప్పుడున్న

# డిజిటల్ మౌలిక వసతుల భద్రతకు జాతీయ కార్యాచరణ


సి.హెచ్.ప్రతాప్

భారత్ వేగంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతోంది. బ్యాంకింగ్, విద్యుత్ పంపిణీ, రైల్వేలు, విమానయానం, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పరిపాలన, డిజిటల్ చెల్లింపులు, ఇ-వాణిజ్యం వంటి రంగాలు సమాచార సాంకేతికతపై అధికంగా ఆధారపడుతున్నాయి. ఈ మార్పు ప్రజలకు సౌలభ్యం, పారదర్శకత, వేగవంతమైన సేవలను అందిస్తున్నప్పటికీ, సైబర్ ముప్పులు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. అందువల్ల డిజిటల్ మౌలిక వసతుల భద్రత ఇప్పుడు కేవలం సాంకేతిక అంశం మాత్రమే కాదు, జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, ప్రజా విశ్వాసంతో ముడిపడిన అత్యంత కీలక అంశంగా మారింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ గ్రిడ్‌లు, విమానాశ్రయాలు, రైల్వే నియంత్రణ వ్యవస్థలు, బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లు, ఆరోగ్య సమాచార వ్యవస్థలపై సైబర్ దాడులు పెరుగుతున్నాయి. ఇలాంటి దాడులు సేవలకు అంతరాయం కలిగించడమే కాకుండా కోట్లాది ప్రజల వ్యక్తిగత సమాచారం, ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ సమాచారాన్ని ప్రమాదంలో పడేస్తాయి. డిజిటల్ సేవలపై ప్రజల విశ్వాసం నిలవాలంటే భద్రతా ప్రమాణాలు కాలానుగుణంగా బలోపేతం కావాలి. దేశంలోని కీలక మౌలిక వసతులకు బహుళస్థాయి సైబర్ రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం అత్యవసరం. విద్యుత్ పంపిణీ కేంద్రాలు, చమురు, వాయువు నెట్‌వర్క్‌లు, రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలు, విమానయాన నియంత్రణ కేంద్రాలు, ఆసుపత్రుల డిజిటల్ వేదికలు వంటి వ్యవస్థల్లో క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించాలి. సైబర్ ముప్పులను ముందుగానే గుర్తించేందుకు నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు, అత్యవసర స్పందన కేంద్రాలు, భద్రతా ప్రమాణాల నవీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. సాంకేతిక లోపాలను వేగంగా గుర్తించి సరిదిద్దే విధానాలు ప్రతి సంస్థలో తప్పనిసరి కావాలి. ఈ దిశగా క్రమానుగతసైబర్ భద్రతా ఆడిట్‌లు, అత్యవసర పరిస్థితులపై మాక్‌డ్రిల్లులు, ప్రమాద మదింపు కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. కీలక మౌలిక వసతులను నిర్వహించే ప్రతిసంస్థకు స్పష్టమైన సైబర్ అత్యవసర స్పందన ప్రణాళిక ఉండాలి. దాడి జరిగిన సందర్భంలో సేవలు ఎంతవేగంగా పునరుద్ధరించగలమనే సామర్థ్యాన్ని కూడా తరచూ పరీక్షించాలి. డేటా బ్యాకప్ వ్యవస్థలు, ప్రత్యామ్నాయ నియంత్రణ కేంద్రాలు, సురక్షిత క్లౌడ్ మౌలిక వసతులు కూడా ఈ వ్యూహంలో భాగం కావాలి. స్వదేశీ సైబర్ భద్రతా సాంకేతికత అభి వృద్ధి కూడా కాలానుగుణ అవసరంగా మారింది. విదేశీ సాఫ్ట్‌వేర్‌పై పూర్తిగా ఆధారపడకుండా స్వదేశీ భద్రతా పరి ష్కారాలు, గుప్తీకరణ విధానాలు, భద్రతా పరికరాల అభి వృద్ధికి పరిశోధనను ప్రోత్స హించాలి. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, సాంకేతిక సంస్థలు, పరిశ్రమలు కలిసి నూతన భద్రతా పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా దేశ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చు. ఈదిశగా నైపుణ్యం కలిగిన సైబర్ భద్రతా నిపుణులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, ఉన్నత విద్యాకోర్సులు విస్తరించాల్సిన అవసరం ఉంది. కృత్రిమ మేధస్సు ఆధారిత భద్రతా వ్యవస్థలు సైబర్‌రక్షణలో కొత్త అవకాశాలను తెరుస్తున్నాయి. అసాధారణ కార్యకలాపాలను క్షణాల్లో గుర్తించడం, అనుమానాస్పద లావాదేవీలను విశ్లేషించడం, దాడుల నమూనాలను ముందుగానే అంచనా వేయడం వంటి అంశాల్లో కృత్రిమ మేధస్సు సమర్థవంతంగా ఉప యోగపడుతోంది. అదే సమయంలో సైబర్ నేరగాళ్లకూడా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నందున భద్రతావ్యవ స్థలు నిరంతరం నవీకరించబడుతూ ఉండాలి. డిజిటల్ భద్రత ప్రభుత్వ బాధ్యతతో మాత్రమే పరిమితం కాదు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం, సమాచార మార్పిడి, సంయుక్త భద్రతా విన్యాసాలు, అంతర్జాతీయ సహకారం, బలమైన చట్టపరమైన వ్యవస్థ మరింత బలోపేతం కావాలి. ప్రజల్లో కూడా సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం అత్యంత ముఖ్యం. బలమైన పాస్‌వర్డ్‌లు వినియోగించడం, అనుమానాస్పద లింకులను నివారించడం, డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండడం వంటి అలవాట్లు వ్యక్తిగత భద్రతకు తొలి రక్షణగా నిలుస్తాయి. సాంకేతిక పురోగతికి సమానంగా భద్రతా ప్రమాణాలను పెంపొందించినప్పుడే డిజిటల్ భారత్

# 'వెయిటేజి'తో ప్రమాణాలకు 'పరీక్ష'!

తిప్పర్తి శ్రీనివాస్

దేశ విద్యా వ్యవస్థలో ప్రవేశ పరీక్షల చుట్టూ చర్చ కొత్తది కాదు. అయితే ఇటీవల నీట్, జేఈఈ వంటి జాతీయ ప్రవేశ పరీక్షలకు 50 శాతం, ఇంటర్మీడియట్ లేదా బోర్డు పరీక్షల మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదన మళ్లీ విద్యా రంగంలో చర్చకు దారి తీసింది. ఇది కేవలం ప్రవేశాల విధానానికి సంబంధించిన అంశంమాత్రమే కాదు. దేశంలో పాఠశాల విద్య భవిష్యత్తు, కోచింగ్ సంస్కృతి, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, సామాజిక న్యాయం, ప్రభుత్వ విద్యావ్యవస్థ వంటి అనేక అంశాలను తాకే కీలకమైన సంస్కరణ. గత పదేళ్లుగా దేశంలో ప్రవేశ పరీక్షలే విద్యార్థుల జీవితాన్ని శాసిస్తున్నాయి. వైద్య విద్య కావాలంటే నీట్, ఇంజినీరింగ్‌లో ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చేరాలంటే జేఈఈ. ఈ రెండు పరీక్షల్లో వచ్చిన ర్యాంకులే విద్యార్థి భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయి. ఫలితంగా పాఠశాలలు, కళాశాలల్లో జరిగే బోధన కంటే కోచింగ్ సెంటర్లే ప్రధాన విద్యా కేంద్రాలుగా మారిపోయాయి. 'చదువు' అనే పదానికి అర్థమే మారిపోయింది. పుస్తకాలను అర్థం చేసుకోవడం కాదు, ప్రశ్నలను గుర్తించడం. విజ్ఞానం కాదు, వేగం. అవగాహన కాదు, మార్కులు ఇదే నేటి పరిస్థితి. ఇంటర్మీడియేట్ చదివే విద్యార్థి కళాశాలకు వెళ్లేది హాజరుకోసంమాత్రమే. అసలు చదువు కోచింగ్ కేంద్రాల్లోనే జరుగుతోంది. కొందరు విద్యార్థులు రెండు సంవత్సరాల పాటు కుటుంబానికి దూరంగా హాస్టళ్లలో ఉంటూ రోజుకు 14 నుంచి 16 గంటల వరకు కోచింగ్ తీసుకుంటున్నారు. ఇది విద్యకాదు, యాంత్రిక శిక్షణ. విద్యార్థుల బాల్యం, సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సామాజిక జీవితం అన్నీ ఈ పోటీలో కనుమరుగైపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బోర్డు పరీక్షలకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదనలో సహజంగానే ఆకర్షణ కనిపిస్తుంది. ఎందుకంటే అలా చేస్తే విద్యార్థి ఏడాది పొడవునా చదవాల్సి ఉంటుంది. తరగతి గదిలో బోధనకువిలువ పెరుగుతుంది. ఉపాధ్యాయుల పాత్ర బలపడుతుంది. పాఠశాల విద్య మళ్లీ కేంద్ర బిందువుగా మారుతుంది. కేవలం ఒక రోజు నిర్వహించే పరీక్షతోనే భవిష్యత్తు నిర్ణయమవుతుందనే అన్యాయం కొంతవరకు తగ్గుతుంది. ఒక్కరోజు పరీక్షలో అనారోగ్యం, ఒత్తిడి లేదా ఇతర కారణాల వల్ల విద్యార్థి ఆశించిన ఫలితం సాధించకపోవచ్చు. అంత మాత్రాన అతని రెండేళ్ల శ్రమను కొట్టిపారేయడం సమంజసం కాదు. బోర్డు పరీక్షల మార్కులకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల విద్యార్థి నిరంతర అధ్యయనానికి ప్రోత్సాహం లభిస్తుంది. ఇది విద్యా తత్వశాస్త్రం పరంగా కూడా సముచితమైన ఆలోచనే. అయితే ఈ ప్రతిపాదనకు మరో కోణం కూడా ఉంది. దేశంలో ఒకే విధమైన విద్యా ప్రమాణాలు లేవు. ఒక రాష్ట్ర




బోర్డులో 98 శాతం మార్కులు సాధించడం సాధారణమైతే, మరొక బోర్డులో 90శాతం కూడా సాధించడం కష్టమవుతుంది. కొన్ని బోర్డులు మార్కులను ఉదారంగా ఇస్తుంటే, మరి కొన్ని కఠినంగా మూల్యాంకనం చేస్తాయి. ఈ అసమాన పరిస్థితుల్లో బోర్డు మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వడం కొత్త అన్యాయాలకు తావివ్వవచ్చు. అదే విధంగా మార్కుల ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటికే 95 శాతానికి పైగా మార్కులు సాధించే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. వెయిటేజీ పెరిగితే ఈ పోటీ మరింత తీవ్రరూపం దాల్చుతుంది. విద్యాప్రమాణాలు మెరుగుపడకపోయినా మార్కులు మాత్రం పెరిగే పరిస్థితి ఏర్పడే ప్రమాదాన్ని విస్మరించలేం. ఈ సందర్భంగా కోచింగ్ పరిశ్రమ గురించి కూడా మాట్లాడాల్సిందే. నేడు వేల కోట్ల రూపాయల వ్యాపారంగా మారిన కోచింగ్ రంగం దేశవిద్యా విధానాన్నే ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంది. తల్లిదండ్రుల ఆర్థిక స్థోమతే కొన్నిసార్లు విద్యార్థి అవకాశాలను నిర్ణయిస్తోంది. లక్షల రూపాయలు ఖర్చు చేయగలిగిన కుటుంబాలకు మెరుగైన కోచింగ్ లభిస్తే, గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ కుటుంబాల పిల్లలు వెనుకబడుతున్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల స్ఫూర్తికివిరుద్ధం. బోర్డు పరీక్షలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తే ఈ అసమానత కొంతవరకు తగ్గేఅవకాశం ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులకుకూడా అవకాశం పెరుగుతుంది. కానీ దీనికి ముందు దేశవ్యాప్తంగా బోర్డు పరీక్షల్లో ఒకే ప్రమాణాలను అమలు చేయాలి. లేకపోతే ఒక రాష్ట్ర విద్యార్థికి లభించేప్రయోజనం మరో రాష్ట్రవిద్యార్థికిఅందదు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కూడా ఈ చర్చలో విస్మరించరాదు. ప్రవేశ పరీక్షల ఒత్తిడి కారణంగా ప్రతి సంవత్సరం అనేక మంది విద్యార్థులు తీవ్రమైన ఆందోళన, నిరాశ, మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలి తప్ప, జీవితాన్ని భారంగా మార్చకూడదు. దేశవ్యాప్తంగా ఒకేస్థాయి మూల్యాంకన విధానం, మార్కుల సాధారణీకరణ, పారద ర్శక పరీక్షా వ్యవస్థ అమలు చేయడం అత్యవసరం. విద్యా విధానం ఎవరినీ శిక్షించే విధంగా ఉండకూడదు. ప్రతిభను వెలికితీసే విధంగా ఉండాలి. కోచింగ్ కేంద్రాల విజయాన్ని కాదు, పాఠశాల విద్య విజయాన్ని కొలిచే వ్యవస్థను నిర్మిం చాలి. తరగతి గదిలో బోధించే ఉపాధ్యాయుడికి విలువ లేకుండా, కోచింగ్ సెంటర్‌లో బోధించే అధ్యాపకుడే భవిష్యత్తును నిర్ణయించే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ విద్యా వ్యవస్థ క్రమంగా బలహీనపడుతుంది. నీట్, జేఈఈలకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలా వద్దా అన్నది కంటే, దేశానికి ఎలాంటి విద్యా వ్యవస్థ అవసరమన్నదే అసలు ప్రశ్న. విద్యను మార్కుల పోటీ నుంచి జ్ఞాన సాధన దిశగా మళ్లించగలిగితేనే దేశ భవిష్యత్తు బలపడుతుంది. అదే

# గుంటూరు వార్త

## చిలకలూరిపేటలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ పర్యటన

చిలకలూరిపేట, జూలై 7, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఈ రోజు చిలకలూరిపేట అర్బన్, కృష్ణానగర్‌లోని మునిసిపల్



ఎలిమెంటరీ స్కూల్ (పోలింగ్ బూత్ నెం. 141) ను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు 100 శాతం పూర్తయిందని, డిజిటైజేషన్ ప్రక్రియ నేటికి 62 శాతం పూర్తయిందని వెల్లడించారు. జూలై 14వ తేదీ నాటికి ఈ డిజిటైజేషన్ పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించినట్లు ఆయన తెలిపారు. ఓటర్లు ఎవరైనా ఇంటి వద్ద అందుబాటులో లేకపోతే, వారి తరఫున బంధువులు ఆ ఫారం నింపి ఇవ్వవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే, బీఎల్ఓ (బీలివో)లను సులభంగా సంప్రదించడానికి ECINET యాప్‌లో క్లిక్ యువర్ కాల్ విత్ బీలివో అనే ప్రత్యేక సదుపాయం ఉందని, ఓటర్లు దీనిని వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం రాజకీయ పార్టీల బీఎల్ఏ (బీలిఏ)లు కూడా ఈ రివిజన్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు.

## పట్టణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి:మున్సిపల్ కమీషనర్



తెనాలి మున్సిపాలిటీ జూలై7 (ప్రభాతవార్త): తెనాలి పట్టణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం పట్టణం లోని 32 వార్డ్ ఎల్ల లింగయ్య నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో కాలువలను పరిశీలించి కాలువలలో చెత్త, ఇతర వ్యర్థాలు వేయకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని కాలువలో నీటిపారుదలకు ఆటంకం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ ధారా రాజేష్ కు ఆదేశించారు. కాలువలను శుభ్రం చేయించడంతో పాటు కాలువ పక్కన, రోడ్ మార్జిన్ లో పెరిగిన పిచ్చి మొక్కలు ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. చెత్త సేకరణ పై ప్రత్యేక దృష్టి సార్చించాలని ప్రతి ఇంటి నుండి తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని అన్నారు. చెత్తను రోడ్లపై కాలువలలో వేయకుండా పురపాలక సంఘ వాహనాలకు అందించాలని ప్రజలను కోరారు.కమీషనర్ వెంట మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమెరికన్ ఫ్లాగ్ ఫుట్ బాల్ కి బాపట్ల జిల్లా కార్యవర్గం నియామకం

తెనాలి మున్సిపాలిటీ(చుండూరు) జులై7(ప్రభాతవార్త): అమెరికన్ ఫ్లాగ్ ఫుట్ బాల్ కి సంబంధించి,బాపట్ల జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు,అమెరికన్ ఫ్లాగ్ ఫుట్ బాల్




అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య మరియు అసోసియేషన్ రాష్ట్ర సలహాదారులు గమిడి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా అసోసియేషన్ సెక్రటరీగా, చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన,మన్నారు అమర్నాథ్ (కవి)జాయింట్ సెక్రటరీగా,చేబ్రోలు ఆర్వీఐటి కళాశాల పీడీడి.రూకేష్, ట్రెజరర్ గా పొన్నూరు సెయింట్ థామస్ కళాశాల పీడీరుద్రపాటి అర్జున్ లను నియమించినట్లు,రాష్ట్ర కమిటీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని,ఫుట్ బాల్ క్రీడాకారులు,పలువురు క్రీడాభిమానులు అభినందించారు.

## కూతురు ప్రేమ వివాహంతో తండ్రి ఆత్మహత్య



నాదెండ్ల, చిలకలూరిపేట, జూలై 7, ప్రభాతవార్త: నాదెండ్ల మండలం గణపవరానికి చెందిన చికెన్ షాపు నిర్వాహకుడు కాళహస్తి.. తన 22 ఏళ్ల కుమార్తె ప్రేమ వివాహం చేసుకుందన్న మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పరువు పోయిందన్న బాధతో జూన్ 30న ఎలుకల మందు తాగిన ఆయన, మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేరి.. మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాధాకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మానవతకు అర్థం చెప్పిన సెయింట్‌ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థులు



పెడన జూలై7,ప్రభాతవార్త : పెడనకు చెందిన రాజీవ్‌నగర్ కాలనీ నివాసి అంకమరావు కుమారుడు బైలపాటి హర్షవర్ధన్(13) బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు.మెరుగైన చికిత్స కొరకు ఆర్థికసహాయం కొరకు తల్లిదండ్రులు సెయింట్‌ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మచిలీపట్నం పాఠశాలను ఆశ్రయించగా పాఠశాల విద్యార్థులు తమ వంతుగా రూ.76,906లను విరాళంగా సేకరించారు.మంగళవారం విరాళాన్ని కరస్పాండెంట్ రెవ.ఫాదర్. నక్కాడేవిడ్‌రాజు, ప్రిన్సిపల్ రెవ.సిస్టర్ శిబి ఆంటోని చేతుల మీదుగా హర్షవర్ధన్ కుటుంబానికి అందజేసారు.విద్యార్థులకు,స్కూలు యాజమాన్యానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## బుడమేరులో వ్యర్థాల తొలగింపు

విజయవాడ కార్పొరేషన్,జూలై 7,ప్రభాతవార్త: వర్షాకాలంలో బుడమేరు కాల్వలో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కల్గకుండా కార్పొరేషన్ నిరంతరం మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు వ్యర్థాలు,పూడిక తొలగింపు పనులు చేపడుతోంది. ఆయన ఆదేశాల మేరకు చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు సూచనలతో బయాలజిస్ట్ సూర్యకుమార్‌నాయక్



అధ్వర్యంలో మంగళవారం ఉదయం రామకృష్ణాపురం వద్ద బుడమేరు కాలువలో పేరుకుపోయిన పూడిక,వ్యర్థాలను యంత్రాల సహాయంతో తొలగించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్‌నాయక్ మాట్లాడుతూ వర్షపు నీరు వేగంగా ప్రవహించేలా బుడమేరు కాలువను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నామన్నారు. కాలువల్లో చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా ప్రజలు సహకరించాలని,వ్యర్థాలను నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే వేయాలని సూచించారు. వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా నగరం లోని బుడమేరు పరిధి లోని అన్ని కీలక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణతో పూడిక,వ్యర్థాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయన్నారు.

## రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం

### గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జులై 7,ప్రభాతవార్త :రాష్ట్రంలో యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఏపీలో భారీగా పరిశ్రమల స్థాపనకు పెట్టుబడుల ప్రోత్సాహక



మండలి ఎస్ఐపీబీ ఆమోదం తెలపడంపై ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 9,076 కోట్ల రూపాయల పెట్టుబడులతో 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించడం ద్వారా 10,531 ఉద్యోగ అవకాశాలు రానున్నాయని చెప్పారు. ఇది ఆంధ్రప్రదేశ్ లో యువతకు సువర్ణ అవకాశమని, మంచి స్కిల్స్ ఉన్న వారికి ఏపీని ఉద్యోగాలకు కేంద్రంగా మారుస్తున్నారని అన్నారు. మరో వైపు దక్షిణకొరియా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్ దిగ్గజ సంస్థలతో భేటీ అయ్యారని తెలిపారు. హ్యూందాయ్ మోబిస్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్, శాంసంగ్ వంటి కంపెనీతో చర్చలు నిర్వహిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చెప్పుల తయారీ వంటి కంపెనీలను సైతం రాష్ట్రం నుంచి తరిమికొట్టారని మండిపడ్డారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలంటేనే భయం కలిగేలా పాలన సాగించారన్నారు. దీంతో అనేక మంది యువత ఉద్యోగావకాశాలను కోల్పోయారని, వైసీపీది దుర్మార్గపు పాలన అని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, క్వాంటమ్ వ్యాలీ, గూగుల్ వంటి పెద్ద పెద్ద సంస్థలు తరలివచ్చాయని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సృజనాత్మకతతో ఆలోచించాలని సూచించారు. అప్పుడే ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు.

## నేరనియంత్రణకు,భద్రతకు సీసీ కెమెరాలు అమర్చుకోండి

తెనాలి జులై7(ప్రభాతవార్త): నేర నియంత్రణలో భాగంగా ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా నేరాలు నియంత్రణకు మరియు భద్రతకు, అవి ఎంతగానో ఉపయోగపడతాయని తెనాలి టూ టౌన్ సీఐ రవీంద్ర బాబు, త్రీ టౌన్ సీఐ ఎస్. సాంబశివరావులు వ్యాపారస్తులకు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సమీపంలోని పలువురు వ్యాపారస్తులకు సీసీ కెమెరాలు ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించారు. నేరాల



అదుపులో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రతి ఒక్క వ్యాపారస్తుడు తమ దుకాణాల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని తగు భద్రత పొందవలసిందిగా వారు సూచించారు. అనంతరం రోడ్డు మార్జిన్ ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణదారులు,రోడ్డు మార్జిన్ వదిలి వ్యాపారాలు నిర్వహించుకోవాలని ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ 3 టౌన్ పోలీస్ సిబ్బంది,ఎస్సైలు పాల్గొన్నారు.

## నగల దుకాణంలో చోరీ: నిందితుడి అరెస్ట్

తెనాలి జులై7(ప్రభాతవార్త): తాళాలు వేసిన నగల దుకాణంలో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసిన తెనాలి టూ టౌన్ పోలీసులు. పోలీసుల కథనం ప్రకారం తెనాలి పట్టణం గంగానమ్మపేట విజయలక్ష్మి జ్యువెలర్స్ యజమాని టేకి రవీంద్రబాబు జూన్ 17వ తేదీ రాత్రి తన షాపు లో దొంగతనం జరిగిందని షాపులోని వెండి వస్తువులు దొంగిలించారని తెనాలి టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, తెనాలి డిఎస్పి జనార్ధన్ రావు ఉత్తర్వుల మేరకు టూ టౌన్ ఎస్సై లలిత్ కుమార్ ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి



నిందితుడి కొరకు తీవ్రంగా గాలించగా, నిందితులు ఇద్దరిలో ఒకరు బద్రీనారాయణ(20) స్థానిక గంగానమ్మపేట మార్వాడి గుడి వీధిలో అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. నిందితుడు బద్రీనారాయణ గుంటూరు పట్టణం అడవి తక్కెళ్ళపాడు సమీపంలోని టిడ్కో గృహాల్లో నివసిస్తుంటాడని,నిందితుడు ఐటిఐ వరకు చదువుకొని చిన్న చిన్న పనులు చేసుకుంటూ చెడు స్నేహాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు, అతనితోపాటు మరొక నిందితుడు యార్లగడ్డ జస్వంత్ శరత్ బ్రహ్మ తేజ (బబ్లు)అనే అతనితో కలిసి దొంగతనాలు చేస్తూ జూన్ 17వ తేదీన తెనాలి పట్టణంలోని గంగానమ్మపేట విజయలక్ష్మి జువెలర్స్ షాప్ షట్టర్ పగలగొట్టి అందులోని వెండి వస్తువులు దొంగిలించినట్లు వెల్లడించాడు. రెండవ నిందితుడు అయిన బబ్లు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని త్వరలో అతనిని కూడా అరెస్టు చేస్తామని ఎస్సై తెలిపారు.నిందితుడు బద్రి నారాయణ వద్ద నుండి దొంగిలించబడిన సొత్తు 75 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనపరచుకోవటం జరిగిందని ఎస్సై తెలిపారు.ఈ సందర్భంగా నిందితులను త్వరితగతిన అరెస్టు చేసిన టూ టౌన్ పోలీసు సిబ్బందిని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

## డీలర్లను సాధికారత వైపు నడిపించే విజనరీ నిర్ణయం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

### మీ మార్ట్.. తో ప్రజలకు తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు ..

గుంటూరు, జులై 7,ప్రభాతవార్త :రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు రేషన్ డీలర్ల ఆర్థిక సాధికారతను దృష్టిలో పెట్టుకుని "మీ మార్ట్" అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రజలకు అతి తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు అందించబోతున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం గుంటూరు 34వ డివిజన్ దేవాపురంలోని రేషన్ షాప్ నెం.30లో ఏర్పాటు చేసిన "మీ మార్ట్ – నీది, నాది, మనందరిదీ" కిరాణా విక్రయ కేంద్రాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా గతంలో బియ్యం, పంచదార, గోధుమపిండి, జొన్నలు వంటి ప్రభుత్వ సరుకుల పంపిణీ మాత్రమే జరిగేదని, ఇప్పుడు అదే కేంద్రాల్లో నిత్యావసర సరుకులను కూడా విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.ఈ కార్యక్రమాన్ని గత ఏడాది కుప్పంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించి విజయవంతంగా నిర్వహించారని, ఆ విజయాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా కేవలం ఐదు రాష్ట్రాల్లో మాత్రమే ఇలాంటి కార్యక్రమాలుఅమలవుతున్నాయని, వాటిలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉండటం గర్వకారణమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.రేషన్ డీలర్లు ఇప్పటివరకు పరిమిత ఆదాయంతోనే దుకాణాల నిర్వహణ, అద్దెలు, సిబ్బంది ఖర్చులు భరించాల్సిన పరిస్థితి ఉండేదని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ కార్యక్రమం గొప్ప ఊరటనిస్తుందని చెప్పారు. ప్రభుత్వం అందించే ఉచిత రవాణా సదుపాయంతో సరుకులు అందుబాటులోకి రావడంతో పాటు, మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే



వినియోగదారులకు వస్తువులు లభిస్తాయని వివరించారు.34వ డివిజన్ దేవాపురం రేషన్ షాప్ పరిధిలో సుమారు 500 రేషన్ కార్డుదారులు ఉన్నారని, వారు తమకు అవసరమైన నిత్యావసర సరుకులను తమ ప్రాంతంలోని ఈ కేంద్రం నుంచే తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. డిమార్ట్ వంటి పెద్ద రిటైల్ సంస్థల కంటే కూడా మరింత తక్కువ ధరలకు సరుకులు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.

రేషన్ డీలర్లను కేవలం పంపిణీదారులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతోందని, అందుకే ముఖ్యమంత్రి ను విజనరీ లీడర్‌గా ప్రజలు గుర్తిస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. డీలర్లకు స్థిరమైన ఆదాయం, ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు వారిని స్వయం సమృద్ధి దిశగా నడిపించే ప్రయత్నమే "మీ మార్ట్" అని చెప్పారు.గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 90 రేషన్ షాపులు ఉన్నాయని, ప్రస్తుతం పైలట్ ప్రాజెక్ట్‌గా షాప్ నెం.30లో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని రానున్న రోజుల్లో అన్ని 90 దుకాణాలకు విస్తరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు. దీనికోసం డీలర్లు కూడా సరుకుల నిల్వకు తగిన స్థల సదుపాయాలు కల్పించుకోవాలని సూచించారు.

మహిళలు నిర్వహిస్తున్న రేషన్ షాపులకు ఈ కార్యక్రమం ఉపాధి అవకాశాలను మరింత పెంచుతుందని, మహిళా సాధికారతకు కూడా ఇది తోడ్పడుతుందని తెలిపారు. ప్రజలకు తమ ఇంటి సమీపంలోనే తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు అందుబాటులోకి రావడం వల్ల సమయం, ప్రయాణ ఖర్చు రెండూ ఆదా అవుతాయని చెప్పారు.

జిల్లాలో ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమైందని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కూడా డీఎస్‌ఓ, ఎంఆర్‌ఓ, రేషన్ డీలర్లు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. డీలర్లకు చేయూతనివ్వడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం, డీలర్ల అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ తీసుకొచ్చిన ఈ వినూత్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆహార సరఫరా శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## విజయవాడ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్

విజయవాడ కార్పొరేషన్,జూలై 7,ప్రభాతవార్త: ఎన్టీఆర్ జిల్లా నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో ప్రజా జీవనానికి,ప్రజలకు ఇబ్బందులు లేకుండా,శాంతి భద్రతలకు విఘాతం కల్గకుండా ఉండేందుకు,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా సజావుగా శాంతిభద్రతలు పరిరక్షించడానికి సిపి,మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మెజిస్ట్రేట్ రాజశేఖరబాబు పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఈ నెల 10 నుండి అక్టోబరు 9వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు ఉత్తర్వులు జారీ చేశారు. నిషేధాజ్ఞలు అమలు ఉన్న సమయంలో పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఎటువంటి సభలు,సమావేశాలు,ఊరేగింపులు,నిరసన,ధర్నా కార్యక్రమాలను పోలీసు వారి ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదని పేర్కొన్నారు.నిషేధాజ్ఞలు అతిక్రమించి నిర్వహించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఉపా చట్టం దుర్వినియోగం తగదు : ఎ.బి.వెంకటేశ్వరరావు

విజయవాడ, జూలై 7 (ప్రభాతవార్త): ఉగ్రవాదుల అణచివేతకు ఉపయోగించాల్సిన ఉపా చట్టం దుర్వినియోగాన్ని అరికట్టాలని మాజీ పోలీసు అధికారి, మాజీ ఇంటిలిజెన్స్ ఛీఫ్ ఎ.బి.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉన్నత స్థాయిలో ఉన్న ప్రభుత్వ పెద్దలపై పరుష పదజాలంతో మాట్లాడే వారిని తాము సమర్థించడం లేదని, కానీ వారిపై ఉపా వంటి చట్టం అమలు చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల్లో వ్యతిరేకత కారణంగా పివి నరసింహారావు హయాంలో టాడా చట్టాన్ని రద్దు చేశారని, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉగ్రవాద నిరోధక చట్టంగా పోటా అని తీసుకువచ్చారని, 2004 లో కాంగ్రెస్ ఈ పోటా చట్టాన్ని రద్దు చేయగా, 2014 లోబిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపా చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు.

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT**
**AT : MEDCHAL**
**O.S No. 212 of 2025**

BETWEEN:
**NARSING RAO & OTHERS** ....PLAINTIFF
AND
**K. RAJA REDDY & OTHERS** ....DEFENDANTS

**NOTICE**

To,
**D-2) Sri Doddappaneni Ramachandra Rao** S/o: D. Punnaiah, aged : 51 years, Occ: Service, R/o: Abbanna Godavalli, Ravikampadu post, Tenali taluqa, Guntur District 523324.

Please take notice that my client's by name **1).** Narsing Rao s/o: balaraju, aged: 35 years occ: pvt employee R/o: H.no 2-65/1, Gajularamaram, Quthbullapur, MEDCHAL - MALKAJGIRI DISTRICT **2)** Mallieshwari D/o: balaraju age:40 years occ: Housewife R/o: 5-67 , S. N colony Sangeeth theatre Back Ramachandrapuram M, Ramachandra puram, Medak **3).** Srilatha D/o.Bal Raju, Aged about 39 years, Occ: House wife R/o.H no 4-8-730/9 kalasiguda, Bollarum, Secbad 500010. **4).** Andalu D/o.Late Ramaiah, Aged about 68 years, Occ: House wife R/o. H.no 5-81 praksh Nagar, near zphs school Kukatpally, Hyderabad 500072 **5).** Lalitha D/o.Late Ramaiah Aged about 51 years, Occ: House wife R/o. H.No 3-17-54 chinnakamala, lalbazar, Tirumalgiri, Hyderabad 500015, **6).** Nagesh s/o: late Ramaiah age: 40 years occ:pvt employe R/o: H.No 2-66 Gajularamaram village, quthbullapur mandal, medchal- Malkajgiri **7).** Venkatesh S/o: late Ramaiah age : 50 years , occ: business R/o: h.no 2-66 Gajularamaram village, quthbullapur mandal medchal-Malkajgiri dist. filed suit for partion and separate possession and to declare the regd sale deed vide doct.No 513/2006. Regd sale deed vide doct no 6774/2004 dated 26-6-2008, regd sale deed doct no 17417/2011 dt 12-12-2011, regd sale deed vide doct no 10105/2012 dated 24/8/2012 regd sale deed vide doct no 2582/2013 dated 28/2/2013 as null and void and not binding of the plaintiff against **1. Sri K. Raja Reddy, 2. Sri Doddappaneni Ramachandra 3. Sri Dayakar Reddy 4. Sri C Nanda Reddy 5. Sri S Dharmveer. 6. Sri Jonna Govardhan** Before Honble principal Senior civil judge, medchal Malkajgiri District,, at medchal the above suit is posted to **20-7-2026** for your appearance Hence the above named K.Raja reddy ka here by directed to appear personally or through Authorised representative or through Advocate appointed by you on the said date ie. **20-7-2026 at 10.30 AM** before the Hon'ble Court without fail, otherwise the matter will be decided as per law.

// By order of the court //
**CH. Srilatha**
Shop No 201 Ghmc Double bedrooms, BahadurPally village
Dundigal - Gandimaisamma mandal
Medchal - Malkajgiri Dist-500043.
Dundigal - Gandimaisamma mandal
Medchal - Malkajgiri Dist-500043.

## మూడు నియోజక వర్గాల్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

విజయవాడ కార్పొరేషన్,జూలై 7,ప్రభాతవార్త: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరం లోని మూడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ,డిజటలైజేషన్ వేగంగా కొనసాగుతోందని కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. జులై 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు 80-విజయవాడ పశ్చిమ నియోజక వర్గంలో మొత్తం 2,77,823 మంది ఓటర్లలో 2,72,680 మందికి ఎన్యూమరేషణ్ ఫారాలు పంపిణీ చేయగా,1,39,541 ఫారాలు,డిజటలైజేషన్ చేయబడ్డాయన్నారు. 81-విజయవాడ తూర్పు నియోజక వర్గంలో మొత్తం 2,69,734 మంది ఓటర్లలో 2,65,747 మందికి ఎన్యూమరేషణ్ ఫారాలను పంపిణీ చేయగా, 2,40,256 ఫారాలు డిజిటలైజేజ్ చేయబడ్డాయన్నారు. 79-విజయవాడ నియోజక వర్గంలో మొత్తం 2,56,980 మంది ఓటర్లలో 2,53,196 మందికి ఎన్యూమరేషణ్ ఫారాలను పంపిణీ చేయగా 1,24,879 ఫారాలు డిజటలైజ్ చేయబడ్డాయన్నారు. పంపిణీ చేసిన ఎన్యూమరేషణ్ ఫారాలను త్వరితగతిన సేకరించి, ఎన్నికల సంఘం నిర్ధేశించిన గడువు లోగా డిజటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అన్ని ఎఇఆర్‌ఓలు,బిఎల్ఓ సూపర్‌వైజర్లు,బిఎల్‌ఓలకు ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. నియోజక వర్గాల వారీగా పురోగతి వివరాలను విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

# మిత్ర ధర్మాన్ని పాటిస్తూనే, టీడీపీ శ్రేణులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 7, ప్రభాతవార్త: వచ్చే మూడేళ్లలో పార్టీ శ్రేణులు అభిప్రాయాలు, ఆలోచనలకు అనుగుణంగా టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్, అధినేత చంద్రబాబులు పార్టీని సంస్కరించబోతున్నారని, యువరక్తం, అనుభవాల కలబోతతో పార్టీ మరింత బలపడుతుందని రాజమహేంద్రవరం పార్లమెంట్ టీడీపీ కో ఆర్డినేటర్, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మంగళవారం ఆయన రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని అనపర్తి నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. మంత్రి నిమ్మల రామానాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి, ప్రత్తిపాటిలతో కూడిన త్రిసభ్య కమిటీ అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ ఎంపికపై శ్రేణుల అభిప్రాయాలు, ఆలోచనలు స్వీకరించింది. అనంతరం పార్టీ శ్రేణులను



ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రానికి సాధ్యం కాని సంక్షేమం, అభివృద్ధిని మన నాయకుడు చంద్రబాబు ఈ రెండేళ్లలో రాష్ట్రానికి అందించారని, కూటమి ప్రభుత్వం తప్ప మరే పార్టీకి అధికార అవకాశం లేకుండా చేయాల్సిన బాధ్యత మూడు ప్రధాన పార్టీలపై ఉందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ముఖ్యంగా టీడీపీ శ్రేణులు ప్రభుత్వం ఈ రెండేళ్లలో సాధించిన తిరుగులేని విజయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మిత్ర పక్షాలను సమన్వయం చేసుకునే సందర్భంలో అవసరమైతే టీడీపీ శ్రేణులు ఒక అడుగు తగ్గినా తప్పులేదన్నారు. మిత్రధర్మాన్ని పాటించడంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ఓర్పు, సంయమనం, క్రమశిక్షణతో పనిచేసేవారికి తప్పకుండా మంచి గుర్తింపు... ఎన్నో ధనిక రాష్ట్రాలకు సాధ్యం కాని ప్రజా సంక్షేమం, అభివృద్ధిని మన కూటమి ప్రభుత్వం, మన నాయకుడు చంద్రబాబు రెండేళ్లలో సాధించారని, ఈ విజయం వెనుక పార్టీ శ్రేణుల త్యాగాలు, కృషి ఉన్నాయని ప్రత్తిపాటి తెలిపారు. పార్టీ శ్రేణులు ఎవరూ అసంతృప్తికి గురికావాల్సిన పనిలేదని, ఓర్పు...సంయమనం..క్రమశిక్షణతో పనిచేసే వారికి కాస్త ఆలస్యంగా అయినా తప్పకుండా న్యాయం జరుగుతుందని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు. అనపర్తి శ్రేణులు అందించిన విలువైన సూచనలు, సలహాలను బుధవారం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని, అదినాయకుడి నిర్ణయాన్ని, భవిష్యత్ లక్ష్యాల ఆలోచనల్ని అందరూ గౌరవించాలని ప్రత్తిపాటి సూచించారు. అనపర్తి నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు ఐకమత్యంగా, అంకితభావంతో పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో వారి తండ్రి నల్లమిల్లి మూలారెడ్డితో తనకు మంచి అనుబంధం ఉందన్న ప్రత్తిపాటి, నేడు రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్ రెడ్డి టీడీపీ బలోపేతానికి చేస్తున్న కృషి నిజంగా అభినందనీయమన్నారు.

# ప్రత్తిపాటి సమక్షంలో టిడిపిలో చేరిన వైకాపా విద్యార్థి విభాగం మాజీ అధ్యక్షుడు సయ్యద్ సిరాజ్

చిలకలూరిపేట, జూలై 7, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా వైసీపీ పార్టీ విద్యార్థి విభాగం మాజీ అధ్యక్షులు సయ్యద్ సిరాజ్ గత 2 సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై ఆకర్షితులై, నేడు మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు.. అనంతరం సయ్యద్ సిరాజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 2సంవత్సరాల్లో ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి



లభించిందని, ఎన్నో కంపెనీలు ఆంధ్రప్రదేశ్ కి తరలి వస్తున్నాయని, గత ప్రభుత్వం గాలికి వదిలేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పార్టీలకతీతంగా అందచేస్తున్నాయని, నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో కలసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు...

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రత్తిపాటి



చిలకలూరిపేట, జూలై 7, ప్రభాతవార్త: మంగళగిరి లోని దిరీ కన్వెన్షన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి గౌతమీ శ్వేత వివాహ రిసెప్షన్ వేడుక ఘనంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం నూతన కార్యవర్గం

చిలకలూరిపేట, జూలై 7, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని, గ్రాండ్ వెంకటేష్ కళ్యాణమండపంలో రోటరీ క్లబ్ ఆఫ్ పండరిపురం నూతన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్ గా ఎన్నిక కాబడిన లంకా ఆదినారాయణ రెడ్డి , పోపూరి వెంకట రమణ , బొగ్గవరపు చెంచు పున్నయ్య చే ప్రమాణస్వీకారం చేయించి, నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియచేసిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు. కార్యక్రమంలో పలువురు నేతలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



## 132 పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ సమగ్ర వివరాల నమోదు కార్యక్రమంలో : టీడీపీ సీనియర్ నేత అబ్దుల్ కుమిర్



చిలకలూరిపేట, జూలై 7, ప్రభాతవార్త: కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఓటర్ వివరాల నమోదు కార్యక్రమంలో భాగంగా మాజీమంత్రి స్థానిక శాసన సభ్యులు పత్తిపాటి పుల్లారావు గారి ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఓటర్ కు తమ ఓటు కోల్పోకుండా ఎన్నికల సంఘం బి ఎల్ వో ల ద్వారా పంపిణీ చేసిన ఓటర్ ఫారాలు వివరాలు నమోదు చేసే ప్రక్రియను పురుషోత్తమ పట్నం పరిధిలోనీ 132వ పోలింగ్ కేంద్రంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ అబ్దుల్ కుమీర్ శనివారం నాడు చేపట్టారు ఈ కార్యక్రమంలో పురుషోత్తమ పట్నం పరిధిలో ఉన్న బిఎల్ ఎ లు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పీఎండీఎస్‌తో నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది


## ప్రకృతి వ్యవసాయంతోనే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చు: జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి

నాదెండ్ల, చిలకలూరిపేట, జూలై 7, ప్రభాతవార్త: ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానాన్ని అమలు చేయడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలు సహజసిద్ధంగా అందుబాటులోకి వస్తాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారి తెలిపారు. మంగళవారం నాదెండ్ల మండలం గురిజేపల్లి గ్రామానికి చెందిన రైతు కంజుల వీరారెడ్డి 30 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పీఎండీఎస్ పొలాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పీఎండీఎస్ ప్రయోజనాలను వివరించారు. ముందుగా 30 రకాల విత్తనాలను విత్తన గుళికలుగా (సీడ్ పెలెట్స్) తయారు చేసి పొలంలో చల్లాలని సూచించారు. సుమారు 45 రోజుల తర్వాత పెరిగిన పంటను పశువులకు మేతగా వినియోగించడం వల్ల పాల దిగుబడి, పాలలో వెన్న శాతం పెరుగుతాయని తెలిపారు. అనంతరం మిగిలిన మొక్కలను భూమిలో కలియదున్నడం ద్వారా నేలలో జీవవైవిధ్యం పెరిగి, సూక్ష్మజీవుల సంఖ్య అధికమవుతుందని చెప్పారు. దీని వల్ల



ప్రధాన పంటకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలు మొక్కలకు సులభంగా అందుతాయని, వేర్ల అభివృద్ధి మెరుగుపడుతుందని వివరించారు. అలాగే నేల గుల్లబారి పెరగడం, వానపాముల సంఖ్య అధికమవడం, నీటి నిల్వ సామర్థ్యం పెరగడం, నేల కోత తగ్గడం, సేంద్రియ కర్బన శాతం పెరగడం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. పీఎండీఎస్ అమలు వల్ల ప్రధాన పంటలో కలుపు సమస్య తగ్గడంతో పాటు చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే శక్తి పెరిగి, దిగుబడులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులను కూడా పంటలు సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు విస్తృతంగా అనుసరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రామారావు, రైతు పార్థసారథి, ఎఫ్ఎంటీ సాగి శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీ కవిత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



# ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే అరవింద్ బాబు

## నియోజకవర్గ అభివృద్ధి పనులకు సహకరించాలని కోరిన ఎమ్మెల్యే

నరసరావుపేట, జులై 7 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు సోమవారం రాత్రి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అవసరమైన నిధులను మంజూరు చేసి సహకరించాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రతిపాదనల దశలో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు, ఆటోనగర్ నిర్మాణం, కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి, గ్రామీణ రహదారుల అభివృద్ధి, నరసరావుపేట



మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు పలు పైలట్ ప్రాజెక్టుల గురించి సమగ్రంగా వివరించినట్లు తెలిసింది. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు కీలకమని, వీటి అమలుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలియజేశారు . ఈ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

## వల్లపుచెరువు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి: ఎమ్మెల్యే అరవింద బాబు

నరసరావుపేట, జులై 7 ప్రభాతవార్త : నరసరావుపేటలో సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన వల్లపు చెరువు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు . ప్రధానమంత్రి కృషి యోజన 2.0 కింద రూ.1.30 కోట్ల వ్యయంతో



చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మే 22న అధికారికంగా పనులు మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. మంగళవారం చెరువు వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలి విడతగా రూ.50 లక్షల నిధులు మంజూరై ప్రస్తుతం ప్రారంభ దశ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని చారిత్రక వల్లపు చెరువును మోడల్ ట్యాంక్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రధానమంత్రి కృషి యోజన 2.0 నిధులతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీటి భద్రత, భూగర్భ జలాల పెరుగుదల, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన విహార వాతావరణం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం చెరువులో పూడికతీత, ట్యాంక్‌బండ్ బలోపేతం, రిటైనింగ్ వాల్ నిర్మాణం, పరిసర ప్రాంతాల శుభ్రత వంటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. తదుపరి దశలో వాకింగ్ ట్రాక్, ఇరువైపులా మొక్కల పెంపకం, సోలార్ లైటింగ్, పెద్దల కోసం బెంచీలు, చిన్నారుల కోసం పార్క్, బోటింగ్ సౌకర్యం వంటి ఆధునిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. చెరువు మధ్యలో శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి మొత్తం ప్రాంతాన్ని ఆకర్షణీయమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పనులను వేగంగా పూర్తి చేసి, 2027లో వచ్చే గంగమ్మ తల్లి తిరునాళ్ల నాటికి వల్లపు చెరువుకు సరికొత్త రూపును తీసుకురావడమే లక్ష్యమని ఎమ్మెల్యే అరవింద బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడి కమిటీ చైర్మన్ పాండురంగారావు, అధికారులు, కూటమి నాయకులు, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంఘం నాయకుల సమావేశం : జిల్లా అధ్యక్షునికి సన్మానం

రొంపిచర్ల, జులై 7 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా బీసీ సంఘ నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన పట్టణానికి చెందిన బిళ్ళ కంటి శ్రీనివాసరావును పట్టణంలోని ఓ ప్రైవేటు వసతి గృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ ల మార్గంలో బీసీ ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తామని



తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ వరగాని విద్యాసాగర్, డాక్టర్ ఎస్. రాంప్రసాద్, బీసీ నాయకులు వేముల పాండురంగారావు, బాదుగున్నల శ్రీనివాసరావు, డాక్టర్ శివన్నారాయణ, మధు, వెంకట్, శ్రీనివాసరావు, వాసు, మూర్తి, రామాంజనేయులు, ఎస్సీ నాయకులు ప్రీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పురపాలక సంఘ పరిధిలో రూ.32.44 కోట్ల అమృత్-2 పనులపై సమీక్షా సమావేశం


నరసరావుపేట టౌన్, జూలై 7 ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అమృత్-2.0 పథకం ద్వారా నరసరావుపేట పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ గెస్ట్ హౌస్ లో అమృత్-2.0 పథకం పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడం, నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నరసరావుపేట పట్టణానికి అమృత్-2.0 కింద



మొత్తం రూ.32.44 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో రూ.23.82 కోట్లతో తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం, నీటి వనరుల అభివృద్ధి, పైప్‌లైన్ మౌలిక వసతుల విస్తరణ, రూ.5.60 కోట్లతో కట్వా చెరువు పునరుద్ధరణ, అలాగే ఏపీ టిడ్కో గృహాలకు రూ.2.82 కోట్లతో తాగునీటి సౌకర్యాలు, రూ.20 లక్షలతో మురుగునీటి సదుపాయాల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని వివరించారు. నరసరావుపేట వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణమని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేయడం అత్యంత అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా పనులను దశలవారీగా చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. అన్ని రంగాల్లో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, మున్సిపాలిటీ ఎంఈ, డీఈ, తెలుగుదేశం పార్టీ నాయకులు కపలవాయి విజయ్ కుమార్, వాసిరెడ్డి రవి, నాగసరపు సుబ్బరాయ గుప్తా, రాయల శ్రీనివాసరావు, షేక్ ఖాసిం సైదులు, మున్సిపాలిటీ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగాసనా పోటీలకు ఎంపికైన ఎన్ఇసి విద్యార్థి


నకరికల్లు, జులై 7 ప్రభాతవార్త : స్థానిక ఎన్ఇసి కళాశాలలో సిఎస్ఈ (ఏఐ) చదువుతున్న సిహెచ్. మారుతి శ్రీనివాసరాజు జిల్లాస్థాయి యోగాసనా పోటీలలో ద్వితీయ స్థానం సాధించినట్లు




కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. వివరాలను కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్ తెలియజేశారు. పల్నాడు యోగాసనా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసనా పోటీలలో ట్రెడిషనల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భాన్ని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు, విభాగాధిపతి డాక్టర్ వివిఎస్. లక్ష్మి, ఏఓ శ్రీధర్, ఏఏఓ డా. కె. అనిల్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్. కృష్ణా రెడ్డి, ఎన్. ఆంజనేయులు, పి. విజయకుమార్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మారుతి శ్రీనివాసరాజుని సన్మానించి అభినందించారు.

## డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన పార్టీ నాయకులు

నరసరావుపేట టౌన్, జూలై 7 ప్రభాతవార్త : వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మద్దిరెడ్డి నరసింహారెడ్డి, నరసరావుపేట యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ వెంకట శ్రీనివాస్ లు ఇటీవల నూతన పదవులకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం గుంటూరు రోడ్ లోని పార్టీ కార్యాలయంలో వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని వారు కలిశారు. పూలమాలలు, దుస్సాలువాలతో ఘనంగా సన్మానించారు. తమకు పార్టీ పదవులను కేటాయించి, బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్



జగన్మోహన్ రెడ్డికి, రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కి వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని డాక్టర్ గోపిరెడ్డి పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ ను యాక్టివ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణవేణి...లో ముగిసిన వర్క్‌షాప్

రొంపిచర్ల, జులై 7 ప్రభాతవార్త : స్థానిక కృష్ణవేణి మహిళా డిగ్రీ కళాశాలలో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినుల వ్యక్తిత్వ వికాసం, సమర్థవంతమైన సంభాషణ నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన కమ్యూనికేషన్ స్కిల్స్ వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో



విద్యార్థినులకు సమర్థవంతమైన కమ్యూనికేషన్, పబ్లిక్ స్పీకింగ్, బాడీ లాంగ్వేజ్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, ప్రొఫెషనల్ ఎటికెట్ వంటి అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు ప్రతి విద్యార్థినికి అవసరమని, ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలకు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సురేఖ, ప్రిన్సిపల్ శ్రీకాంత్, నాంది ఫౌండేషన్ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మలేషియా సొసైటీ ఆఫ్ న్యూరో సైన్సెస్ సమావేశమునకు ఎ.ఎం రెడ్డి విద్యాసంస్థల ప్రొఫెసర్‌కు ఆహ్వానం

నరసరావుపేట, జులై 7, ప్రభాతవార్త: స్థానిక పెట్లూరు వారి పాలెం వద్ద గల ఎ.ఎం రెడ్డి విద్యాసంస్థల నందు విధులు నిర్వహిస్తున్న డీన్ ఆఫ్ ఎకడమిక్, డాక్టర్ ఏ. పావనికి, అంతర్జాతీయ న్యూరో సైన్స్ సమ్మిట్ ప్రెస్టేజియస్, 34 మలేషియా సొసైటీ ఆఫ్ న్యూరో సైన్సెస్ వార్షిక సమావేశమునకు ( 2026) ఎన్నిక కాబడినట్లు కళాశాల సెక్రెటరీ డాక్టర్. అట్లూరి .శాంతి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ, మలేషియాలో నిర్వహిస్తున్న న్యూరో సైన్స్ వార్షిక సమావేశమునకు మా విద్యా సంస్థ ద్వారా డాక్టర్ ఏ పావని దరఖాస్తు చేసుకొని కార్యక్రమానికి హాజరు కావడం చాలా సంతోషంగా ఉందని తెలియజేసినారు. డాక్టర్ ఏ పావని మాట్లాడుతూ సైన్స్ విభాగంలో న్యూరో సైన్స్ పై ఈ యొక్క సమావేశంలో పరిశోధనపై అవగాహన మరియు న్యూరో సైన్స్ పై అభివృద్ధి యొక్క విశ్లేషణ వంటివి జరుగుతున్నాయన పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ మల్లికార్జున్ మాట్లాడుతూ అంతర్జాతీయ న్యూరో సదస్సుకు అర్హత సాధించటం అధ్యాపకులకు ఎంతో గర్వకారణం అని , ఇలాంటి అవకాశం ఇస్తున్న సంస్థలు చాలా అరుదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె . కృష్ణారెడ్డి , డాక్టర్ భార్గవ్ భూషణ్ రావు , అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, జూలై 7 ప్రభాతవార్త : స్థానిక ప్రకాష్‌నగర్‌లోని తిలక్ ప్రభుత్వ పాఠశాలలో మిడ్‌డే మీల్స్ (మధ్యాహ్న భోజన పథకం) అమలును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందుగా పాఠశాలలోని భోజన గది, నిల్వ గదులను పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, భద్రత, నిల్వ విధానాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టిక ఆహారం అందుతున్నదని నిర్ధారించుకున్నాక విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమమే



ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న కొత్త పాఠశాల యూనిఫామ్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. పి4 విధానంలో దాతల సహకారంతో అదనపు కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించే అంశాలపై పాఠశాల నిర్వహణ కమిటీతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జి భూమిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మిరెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు కపలవాయి విజయ్ కుమార్, మాజీ మునిసిపల్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, మెహర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం విక్రయించే దుకాణాల్లో రేషన్ బియ్యం కలిపిన బియ్యం అమ్మకాలు

సత్తెనపల్లి, జూలై 7, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని పలు బియ్యం విక్రయించే దుకాణాల్లో గవర్నమెంట్ ఇస్తున్న రేషన్ బియ్యాన్ని పలు రకాల బ్రాండెడ్ బియ్యం కవర్లను తగిలించి



సన్న బియ్యంలో కలుపుతూ అధిక మొత్తంలో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్న దుకాణదారులు. పట్టణంలో ఇంత జరుగుతున్న అధికారులు తనిఖీలు చేయకపోవడం, గత కొంతకాలంగా తనిఖీలు చేయకపోవడం వల్ల విచ్చలవిడిగా అక్రమాలు మరింత పెరిగాయి, అధికారుల మీద (నిమ్మకు నీరెత్తినట్టుగా మాకేం సంబంధం లేనట్టుగా) వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## షేక్‌గౌస్ కుటుంబానికి 'కన్నా' పరామర్శ

సత్తెనపల్లి, జూలై 7, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణానికి చెందిన షైక్ గౌస్ , ఆయన కుమారుడు ప్రమాదవశాస్తూ గాయపడిన విషయం విదితమే. విషయం తెలుసుకుని గుంటూరు పట్టణం హాస్పిటల్ నందు చికిత్స తీసుకుంటున్న సమయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ పరామర్శించారు. ఆయన వెంటనే పలువురు కూటమి నేతలు, స్థానిక ప్రముఖులు ఉన్నారు.



## ఆర్‌యుబి (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణానికి గ్రామస్థుల అభ్యంతరం



సత్తెనపల్లి, జూలై 7, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం, వెన్నాదేవి -కంకణాలపల్లి గ్రామాల మధ్య గల ఎల్‌సి గేట్ 41 వద్ద రెండు గ్రామాల వారు ఆర్‌యుబి (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణానికి అభ్యంతరాలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారి తహసిల్దార్ సత్తెనపల్లి రైల్వే శాఖ అధికారులు మరియు రెవెన్యూ అధికారులు,సర్వే అధికారులు పాల్గొన్నారు.

## మా ఊరును...మేం కాపాడుకుంటాం : కంకణాలపల్లి గ్రామస్తులు

సత్తెనపల్లి, జూలై 7, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామంలో మా ఊరిని కాపాడమంటున్న కంకణాలపల్లి గ్రామస్తులు సత్తెనపల్లి మండలం కంకణాల పల్లి గ్రామంలో రైతుల ఆవేదన



వ్యక్తం చేవారు. 2500 కుటుంబాలు కల్గిన కంకణాలపల్లి గ్రామంలో ప్రధాన రహదారి కి అనుసంధానంగా 'యు' ఆకారం కలిగిన అండర్ గ్రౌండ్ రైల్వే బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఈ 'యు' ఆకారపు బ్రిడ్జి ప్రజల రాకపోకలకు, మొక్కజొన్న రైతుల వాహనాలకు ఇబ్బంది కలుగుతుందని రెవిన్యూ అధికారులతో గ్రామస్థులు వాపోయారు. బ్రిడ్జ్ ని తక్షణమే ఆపివేసి నేరుగా ప్రధాన రహదారికి అనుసంధానం చేయాలని అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## అండర్-13ఫుట్‌బాల్ పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థినుల ప్రతిభ




సత్తెనపల్లి, జూలై 7, ప్రభాత వార్త: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 13 బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 3వ తేదీ నుంచి 5వ వరకు నంద్యాల జిల్లా లోని నంద్యాలలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం జరిగినది. అందులో పలనాడు జిల్లా తరపున పీఎం జడ్.పి.హెచ్.ఎస్ సుగాలి సత్తెనపల్లి విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో పాల్గొని నాలుగో స్థానం సాధించారు. వారిని విద్యా కమిటీ మరియు ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, బోధ నేతల సిబ్బంది అభినందించారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను వేగవంతం చేయాలి



పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త: ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా సర్వశిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఓటు నమోదు అధికారి ఇదుపులపాటి పద్మావతి ఆదేశించారు. సర్ కార్యక్రమానికి గడువు తేదీ ముగుస్తున్న నేపథ్యంలో బిఎల్వోలను, బిఎల్యేలను, ఇతర అధికారులను సమాయత్తపరుస్తున్నారు. నియోజకవర్గంలో నూరుశాతం ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. బిఎల్వోలు చురుగ్గా పనిచేస్తే నూరుశాతం సాధించడం సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి పూర్తిచేసిన ఫారాలను డిజిటైజేషన్ చేయాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు కూడా బిఎల్వోలకు సహకరించాలని కోరారు. ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను త్వరితగతిన బిఎల్వోలకు అందజేస్తే వారు డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారని, తద్వారా ఇంటింటి సర్వే నూరుశాతం పూర్తిచేయవచ్చన్నారు. మండల పరిధిలోని మునిపల్లె తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బిఎల్వోలతో మాట్లాడ, వారికి తగు సూచనలు చేశారు. ప్రత్యేకాధికారి వెంట కంప్యూటర్ ఆపరేటర్లు సయ్యద్‌లాల్, షేక్ సిరాజుద్దీన్, తదితరులున్నారు.

# సేంద్రియ వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేయాలి

## -ఒజీడీసిఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు

పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త: సేంద్రియ వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేయాలని జీడీసిఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు సూచించారు. జీడీసిఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు మంగళవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, వైస్ చాన్సలర్ పి.వినత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి కీలకమైన పలు అంశాలపై విస్తృతగా చర్చలు జరిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు అనుసరించాల్సిన ఆధునిక వ్యవసాయ పద్ధతులు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే సాంకేతికతలపై విశ్వవిద్యాలయ నిపుణుల నుంచి సమగ్ర అవగాహన పొందారు. ప్రత్యేకంగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా లోతైన చర్యలు సాగాయి. రైతులకు ఆరోగ్యకరమైన పంటలు, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడంలో సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను నిపుణులు వివరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్ర బాగుటుంది.... సేంద్రియ వ్యవసాయమే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాట. రైతు కష్టానికి తగిన ఫలితం దక్కేలా, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చేలా ప్రభుత్వం, సహకార వ్యవస్థలు, శాస్త్రవేత్తలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతు క్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, నూతన సాంకేతికలను గ్రామ స్థాయికి తీసుకెళ్లడం, సహకార సంఘాల ద్వారా రైతులకు అవగాహన కల్పించడం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని రైతు పొలాలకు చేరవేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటసాల సోమశేఖర్, అల్లడి సుబ్బారావు తదితరులున్నారు.



# దుకాణదారులు యాప్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

చేబ్రోలు(పొన్నూరు), జూలై 7,ప్రభాతవార్త: ఎరువుల దుకాణదారులు రైతులకు అవసరమైన ఎరువులను తప్పనిసరిగా యాప్ ద్వారానే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని ఆదేశించారు. చేబ్రోలు మండల పరిధిలోని వేజండ్ల, నారాకోడూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో రికార్డులను పరిశీలించారు. స్టాకు వివరాలను పరిశీలించారు. రైతులకు యాప్ ద్వారానే ఎరువులను విక్రయిస్తున్నారా..?లేదా..? అనే విషయాలను పరిశీలించారు. దుకాణదారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తైప్తే ఎరువుల నియంత్రణ చట్టం1985 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం ప్రతి రైతు సేవా కేంద్రానికి వెళ్ళి అక్కడి రికార్డులను, స్టాకు వివరాలను పరిశీలించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.



# ఆర్టీసీ పరిరక్షణే ఆర్టీసి జెఏసి ప్రధాన ధ్యేయం

పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త: ఆర్టీసి సంస్థ పరిరక్షణే ధ్యేయంగా ఆర్టీసి జెఏసి ఉద్యమిస్తుందని ఆర్టీసి జెఏసి నాయకులు స్పష్టం చేశారు. ఆర్టీసి ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను సాధించేందుకు మంగళవారం ఆర్టీసి డిపో ఎదుట ధర్నా, నిరసన తెలిపారు. ప్రభుత్వం ఆర్టీసి సంస్థ తరపునే ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి సంస్థ ఆధ్వర్యంలో నడిచేవిధంగా చేయాలన్నారు. ప్రభుత్వం అమలు




చేస్తున్న స్త్రీ శక్తి పథకానికి పూర్తి నిధులు ప్రభుత్వమే చెల్లించాలన్నారు. మూసివేసిన డిపోలను వెంటనే తెరవాలని, డిపోల ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు.ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా నాలుగువేల కొత్త బస్సులను కొనుగోలు చేయాలన్నారు. ఆర్టీసిలో ఉన్న 15వేల ఖాళీలను పూరించాలన్నారు. 11వ పిఆర్సీ, డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. గ్యారేజి కార్మికులపై అక్రమ శిక్షలు రద్దు చేసి అవసరమైన టూల్స్ అందించాలన్నారు. శిక్షల కారణంగా నిలిచిపోయిన ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఆర్టీసి సంస్థ పరిరక్షణకు సంబంధించిన అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ధరించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు ఏఏబేగ్, ఎంఎస్‌రెడ్డి, ఎంఎన్ రావ్, వై.శంకర్, ఆర్జీ రాజు, జి.వీరయ్య, పోతురాజు, షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ లీప్‌యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త: ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు లీప్‌యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థి యొక్క వివరాలను సులభంగా తెలుసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు దూపం రాజు, కొల్లి విజయభాస్కర్ కోరారు. మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లీప్‌యాప్ యొక్క ఉపయోగాలను వివరించారు. లీప్‌యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నట్లయితే విద్యార్థుల యొక్క ప్రగతి, హాజరు, మార్కులు, విద్యార్థి ప్రవర్తన తదితర విషయాలను తల్లిదండ్రులు తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



## యధాతథంగా కొనసాగించాలి

పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త: నియోజకవర్గంలో కొన్ని పోలింగ్ కేంద్రాలను మార్పు చేసేందుకు అధికారులు ఉన్నతాధికారులకు పంపిన ప్రతిపాదనల్లో కొన్ని మార్పులు చేయాలని వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదేశాల మేరకు నాయకులు తహశీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ షేక్ కరీముల్లాకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పెదకాకాని మండలం, అనుమర్లపూడి గ్రామంలో 63వ నంబరు పోలింగ్ కేంద్రాన్ని, వెనిగండ్ల గ్రామంలోని 7వ నంబరు, ఉప్పలపాడు గ్రామంలోని 74వ నంబరు పోలింగ్ కేంద్రాలను ప్రస్తుతం ఉన్నచోటనే కొనసాగించాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదనల్లో సవరణ చేయాలని కోరారు. అదేవిధంగా పొన్నూరు మండలంలోని వెల్లలూరు గ్రామంలోని 152,153పోలింగ్ కేంద్రాలను ప్రస్తుతం ఉన్న జడ్పీ పాఠశాలలోనే కొనసాగించాలని, ఈ పోలింగ్ బూత్‌లు మార్చేందుకు ఉన్నతాధికారులకు పంపిన ప్రతిపాదనలను మార్పు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు షేక్ నాజర్, చింతలపూడి మురళీకృష్ణ, గోపిశెట్టి వాసు తదితరులున్నారు.



## ఇంటింటి సర్వేని పరిశీలించిన ప్రత్యేకాధికారి



పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు గడువు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ధీరావత్ దుర్గాబాయి పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి ఇంటింటి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. బిఎల్వోలకు పలు సూచనలు చేశారు. ప్రతి బిఎల్వో ఇంటింటికి వెళ్ళి ఓటర్లు పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటైజేషన్ చేయాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలకు మీరే బాధ్యులవుతారని హెచ్చరించారు. ప్రత్యేకాధికారి వెంట మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, పట్టణ ప్రణాళికాధికారి దరిమడుగు వెంకట రఘురాం, రెవెన్యూ ఆఫీసర్ తోట వెంకటేశ్వరరావు, స్వర్ణవార్డుల మేనేజర్ గుడి రాజశేఖర్ తదితరులున్నారు.

# బాపట్ల జిల్లా వార్త



# రోడ్డు ప్రమాదాలపై ఉక్కుపాదం

## ఆరు నెలల్లో 25 శాతం తగ్గింపే లక్ష్యం

## మహిళల భద్రత.. గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

## పోలీసు అధికారులకు ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాలు

బాపట్ల,జులై 7,ప్రభాతవార్త,ప్రతినిధి: జిల్లాలో రాబోయే ఆరు నెలల్లో రోడ్డు ప్రమాదాలను కనీసం 25 శాతం మేర తగ్గించే లక్ష్యంతో పనిచేయాలని జిల్లా ఎస్పీబి.ఉమామహేశ్వర్ పోలీసు అధికారులను ఆదేశించారు. మహిళలు,చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు గంజాయి రవాణా,విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా నేర సమీక్షా సమావేశంలో సబ్‌డివిజన్లు,సర్కిళ్లు,పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులపురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు.విచారణలో ఉన్న కేసులను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వేగంగా ఛేదించి బాధితులకు త్వరిత న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు.



**ప్రమాదాలకు ముందే నివారణ చర్యలు:**

జిల్లా మీదుగా మూడు జాతీయ రహదారులు వెళ్లడం, పర్యాటకుల రాక పెరగడం వల్ల ప్రమాదాల అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు.ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి రాంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడం,జంక్షన్ల వద్ద హెచ్చరిక బోర్డులు,ఇండికేటర్లు,లైటింగ్ సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.రవాణా శాఖతో కలిసి జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలన్నారు.హెల్మెట్ ధారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు ఆటోలు, ట్రాక్టర్లలో పరిమితికి మించి ప్రయాణించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, నిరక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**మహిళల భద్రతే ప్రాధాన్యం**

మహిళలు, విద్యార్థినుల భద్రతకు శక్తి బృందాలు మరింత సమర్థంగా పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల వద్ద నిఘా పెంచడంతో పాటు నిర్మానుష్య ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు.మహిళలను వేధించే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుని అవసరమైతే ఎస్ఓఎస్ షీట్లు తెరవాలని ఆదేశించారు.

**గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి**

గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన వారి కదలికలపై నిరంతర నిఘాఉంచాలని, జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి ఆస్తి నేరాలను అరికట్టడంతో పాటు దొంగిలించిన సొత్తును త్వరగా రికవరీ చేసి బాధితులకు అప్పగించాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు, జిల్లా రవాణా శాఖాధికారి, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# సర్‌లో బాపట్ల వెనుకంజ.. కమిషనర్‌కు షోకాజ్

బాపట్ల,జులై7 ప్రభాతవార్త.ప్రతినిధి: ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బాపట్ల మున్సిపాలిటీ జిల్లా వ్యాప్తంగా అత్యల్పంగా 49 శాతం పురోగతి నమోదు చేయడంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించిన సందర్భంగా బాపట్ల మున్సిపాలిటీ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే బాపట్ల మున్సిపాలిటీ పురోగతి ఎందుకు మందగించిందని మున్సిపల్ కమిషనర్ ఎం. హాసినిని కలెక్టర్ ప్రశ్నించారు. బీఎల్‌వోలు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం లోపించడమే ఈ పరిస్థితికి కారణమని పేర్కొన్నారు. ప్రత్యేక కార్యాచరణతో ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిరక్ష్యం ప్రదర్శించినందుకు మున్సిపల్ కమిషనర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో అలసత్వానికి తావులేకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.



# ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి:ఎంపిడివో విజయలక్ష్మి

కొల్లిపర, జూలై 7, ప్రభాతవార్త:గ్రామ సచివాలయాల్లో విధులను నిర్వహిస్తున్న సిబ్బంది ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి స్పష్టం చేశారు.మంగళవారం మండల కేంద్రంలోని కొల్లిపరలో సచివాలయాలను డిప్యూటీ ఎంపిడివో దానయ్యతో కలిసి తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సలహాలు,సూచనలిచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయంలో పని చేసే సిబ్బంది ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని ఆమె సూచించారు.సచివాలయాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.సర్ ప్రక్రియ కార్యక్రమాన్ని నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని తెలిపారు.పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని విజయలక్ష్మి వెల్లడించారు.



# ప్రకృతి వ్యవసాయ పంటలన పరిశీలించిన కెన్యా బృందం

కొల్లిపర, జూలై 7, ప్రభాతవార్త:రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు కెన్యా దేశానికి చెందిన వంజామా స్టోరోగే డేనియల్,జనాకరియుకి మ్వాంగి,ఒడ్డా ఫైడే ఒచోమో,జిప్పోరా న్యాంబురా కురియా,న్యూయార్క్ యూనివర్శిటీ అబుదాబికి చెందిన ఇంటర్న్ ప్రసిద్ధ సప్కోటా ప్రతినిధుల బృందం మంగళవారం కొల్లిపర మండలంలోని బొమ్ముువానిపాలెం గ్రామాన్ని సందర్శించారు.కెన్యా ప్రతినిధుల బృందానికి గుంటూరు జిల్లాలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయం అమలు తీరు,పురోగతి గురించి క్లుప్తంగా ప్రకృతి వ్యవసాయ శాఖ ఏడిఏ రాజకుమారి వివరించారు.బయో ఇన్పుట్‌ల తయారీ,ఘన జీవామృతం,బీజామృతం,ద్రవ జీవామృతం తయారీపై విదేశీ ప్రతినిధుల బృందానికి అవగాహన కల్పించారు.దేశీ ఆవు ప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్నదని చెప్పారు.ఆవుపేడ,మూత్రంలో అధికంగా లభించే సూక్ష్మజీవులు భూమి సారాన్ని పెంచి పంటల ఆరోగ్యాన్ని రక్షిస్తాయని రాజకుమారి వెల్లడించారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించిన వంకాయ.మిరప,చిక్కుడు,కరివేపాకు తదితర పంటలను కెన్యా బృందం పరిశీలించింది.ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను రసాయనిక ఎరువుల ద్వారా పండించిన పంటల వ్యత్యాసాన్ని గమనించారు.ప్రకృతి వ్యవసాయంలో నేల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలుసుకున్నారు.ప్రకృతి వ్యవసాయ విధానాన్ని కెన్యా బృందం అభినందించింది.అనంతరం అత్తోట గ్రామంలోని భూమి భారతి కేంద్రాన్ని సందర్శించి దేశీయ విత్తనాల సేకరణ,సంరక్షణ రైతుల విత్తనాల అందుబాటుపై సమగ్రంగా అవగాహన చేసుకున్నారు.రైతు బాపయ్య చేపడుతున్న దేశీయ విత్తనాల సేకరణ,భద్రపరిచే విధానం,రైతులకు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తుల విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు.సీడ్ సేవర్ నెట్‌వర్క్,కెన్యా కో ఆర్డినేటర్ వంజామా స్టోరోగే డేనియల్ ప్రత్యేకించి రైతు బాపయ్యను ప్రకృతి వ్యవసాయ విధానం గురించి అడిగి తెలుసుకుని ప్రశంసించారు.గుంటూరు జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ నమూనాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొంటూ కెన్యాలో అమలు చేయడానికి కృషి చేయనున్నట్లు సీడ్ సేవర్ నెట్‌వర్క్,కెన్యా కో ఆర్డినేటర్ వంజామా స్టోరోగే డేనియల్ తెలిపారు.





# అంతర్జాతీయ సదస్సుకు వడ్డిముక్కల వాసి డాక్టర్ సురేష్

పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త: మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామానికి చెందిన డాక్టర్ వడ్రాణం సురేష్ పాండిచ్చేరి కేంద్ర విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. స్పెయిన్ దేశంలోని వాలెన్సియాలో నవంబరు 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. వాలెన్సియాలో విద్య మానవ శాస్త్రాలు-గణన అధ్యయనాలు అనే అంశంపై డాక్టర్ వడ్రాణం సురేష్ ప్రసంగించనున్నారు. మారుమూల గ్రామం అయిన వడ్డిముక్కల గ్రామానికి చెందిన డాక్టర్ వడ్రాణం సురేష్ 2024 సంవత్సరంలో రీసెర్చ్ చేసి జర్నల్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ రీసెర్చ్, లండన్, యు.కెలో ప్రచురించబడిన వికేంద్రీకరణ గ్రామీణ స్థానిక నాయకత్వం ద్వారా రాజకీయ సామాజికీకరణ, నాయకత్వ నిర్మాణం అనే అంశాన్ని ఈ అంతర్జాతీయ సదస్సుకు ఎన్నిక చేయడం, యోగ్యత, ఔచిత్యం కోసం గుర్తించబడడం గమనార్హం.



# పౌరుడి ఓటు కాపాడడం బిఎల్యేల బాధ్యత

## -వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త: ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటును కాపాడడం ప్రతి బిఎల్యేల బాధ్యత అని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. స్థానిక వైకాపా కార్యాలయంలో మంగళవారం రాత్రి జరిగిన బిఎల్యేల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా బూత్‌లెవల్ అధికారులతో సమన్వయం చేసుకొంటూ ప్రతి ఓటర్‌కు అవగాహన కల్పించాలన్నారు.ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు సక్రమంగా నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించలని బిఎల్యేలకు దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల్లో వైకాపా విజయానికి ప్రతి బిఎల్యే, నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, వైఎస్ జగన్మోహనరెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిగా చేసేందుకు పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ నాజర్, మూకిరి అనీలకుమారి, మూకిరి జాకబ్‌పాల్, గోపిశెట్టి వాసు, బలగాని రమేష్, చిర్రా అక్కిరెడ్డి, చందోలు ఇమ్మానియేలు, మూర్తిరాజు తదితరులున్నారు.



# మత్స్యకార బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

రేపల్లె, జూలై 7, ప్రభాతవార్త:విశాఖపట్టణం సముద్రతీరానికి 10 నాటికల్ మైళ్ళ దూరంలో గల్లంతై ప్రాణాలు కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు తక్షణమే ప్రభుత్వం రూ.20 లక్షల సహాయం అందజేయాలని ఆంధ్రప్రదేశ్ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కె.నాగబాబు కోరారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ వాతావరణ విపత్తుల నిర్వహణ,మత్స్యశాఖల అధికారులు సకాలంలో సరైన సమాచారం తెలియజేయని కారణంగానే బోటు మునిగిపోయి మత్స్యకారులు మృతి చెందారని చెప్పారు.సముద్రంలో చేపల వేటకు వెళ్ళే ప్రతి మత్స్యకారునికి లైఫ్ జాకెట్లు అందజేస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన సూచించారు.

# మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై అసంతృప్తి

రేపల్లె, జూలై 7, ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్థంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కార్పొరేషన్ కమిటీ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మెనూ అమలుకావడంలేదన్నారు.చాలా తక్కువ పరిమాణంలో మధ్యాహ్న భోజనం పిల్లలకు అందుతున్నదని తెలిపారు.నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయకుంటే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని కృష్ణ కిషోర్ హెచ్చరించారు.



## బాధిత కుటుంబాలకు సహాయం

రేపల్లె, జూలై 7, ప్రభాతవార్త:విపత్తుల సమయంలో బాధితులకు అండగా రెడ్ క్రాస్ సంస్థ సహాయ సహకారాలు అందిస్తున్నదని రేపల్లె రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య చెప్పారు.మంగళవారం బాపట్ల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ నారాయణ బట్టు పంపిన టార్పాలిన్ షీట్స్,వంట పాత్రలు,బ్లాంకెట్లు తదితర మెటీరియల్‌ను బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వీరరాఘవయ్య మాట్లాడుతూ రేపల్లె పట్టణంలోని 26వ వార్డుకు చెందిన కొలుసు సాంబశివరావు,నగరం మండలంలోని కట్టవ గ్రామానికి చెందిన షేక్ షంషీద్ కుటుంబాలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశానుసారం సహాయ సహకారాలు అందించామని వివరించారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ సభ్యుడు సయ్యద్ కరీముల్లా,మోబిన్,బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి వినతి

రేపల్లె, జూలై 7, ప్రభాతవార్త:ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రేపల్లె పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్లు, రేపల్లె మండలంలోని విశ్వేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులకు ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వం 2026 మార్చి 5వ తేదీ ఆశా వర్కర్లతో చర్చలు జరిపి ఇచ్చిన సర్క్యులర్లకు జీవోలు విడుదల చేయాలని,కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని,ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని,జనాభా ప్రాతిపదికన ఉద్యోగుల సంఖ్య పెంచాలని,ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,మృతి చెందిన ఉద్యోగులకు మట్టి ఖర్చులు మంజూరు చేయాలని,టిఏ,డిఏలను విడుదల చేయాలని కోరారు.ఈ నెల 31వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటి సభ్యురాలు ఎస్.దానమ్మ,రేపల్లె పట్టణ శాఖ అధ్యక్షురాలు డి.బుజ్జిలు తెలిపారు.




## అద్దేపల్లిలో ధర్మ ప్రచారం

రేపల్లె, జూలై 7, ప్రభాతవార్త:భట్టి ప్రోలు మండలంలోని అద్దేపల్లిలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ధర్మ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సంస్కృతి ప్రముఖ్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ కుల భేదాలు లేని హిందూ ధర్మ సమాజ నిర్మాణానికి కృషి చేసిన సంత్ రవిదాన్, ముమ్మడివరం బాలయోగిలను ఆదర్శవంతంగా తీసుకోవాలన్నారు. సమాజం లోని అట్టడుగు వర్గాలలో జన్మించి యోగులుగా మారి హిందూ ధర్మంలోని రుగ్మతలను తొలగించి హిందూ దర్మం అభివృద్ధికి జీవితాంతం రవిదాస్,బాలయోగిలు కృషి చేసి యోగులుగా గురువులుగా పూజింపబడటం విశేషమని ఆయన వివరించారు.హిందూ ధర్మం గొప్పతనాన్ని తెలియజేస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జె.హేమశంకర రావు,మండల కన్వీనర్ వి.శ్రీనివాసరావు,సిహెచ్.మురళీకృష్ణ,సూరిబాబు,వి.అనసూర్య తదితరులు పాల్గొన్నారు.




## మధ్యాహ్న భోజనంలో నాణ్యత నిబంధనలు పాటించాలి:ఎంఇవో ఝాన్సీలత

కొల్లిపర, జూలై 7, ప్రభాతవార్త:మధ్యాహ్న భోజనం తయరీ వ్యవహారంలో విధిగా నాణ్యత నిబంధనలను పాటించాలని మండల విద్యాశాఖ అధికారిణి ఝాన్సీలత ఆదేశించారు. మంగళవారం మండలంలోని వల్లభాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతం,మధ్యాహ్న భోజనం పథకం తీరు తెన్నులపై విద్యార్థులను ప్రశ్నించి వాస్తవాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఏజన్సీ నిర్వాహకులు వంట వండే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.అజాగ్రత్త వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలను పిల్లలకు అందేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఝాన్సీలత సూచించారు.



## రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణ

రాజుపాలెం, జూలై 7, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ మరియు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామంలో ఖరీఫ్ 2026.2027 కింద రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి మరియు వరి పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతుల్పు, ప్రభుత్వ యాప్‌ల వినియోగంపై రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పి.వి. సత్యగోపాల్, మండల వ్యవసాయ అధికారి, పి. వెంకటనరసయ్య హాజరై రైతులకు దిశానిర్దేశం చేశారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సత్యగోపాల్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పత్తి, వరి పంటలలో రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించడానికి సమగ్ర యాజమాన్య పద్ధతులు ఎంతో కీలకమని పేర్కొన్నారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగులు, గులాబీ రంగు కాయతొలుచు పురుగు నివారణతో పాటు వరి సాగులో నారుమడి యాజమాన్యం, విత్తన శుద్ధి, సమతుల్య ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం మండల వ్యవసాయ అధికారి, పి. వెంకటనరసయ్య మాట్లాడుతూ తిశితిలీళీ యాప్ ప్రాధాన్యతను రైతులకు వివరించారు. సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా తమ పంట వివరాలను స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని కోరారు. ఆర్ఎస్‌కేలలో వివరాలు నమోదు చేయించుకోవడం ద్వారానే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంట నష్టపరిహారం మరియు ఇతర ప్రయోజనాలు సకాలంలో అందుతాయని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జగదీష్, ఉమామహేశ్వర రెడ్డి, సంధ్య, మరియు ఉప్పలపాడు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

నగరం, జులై 7, ప్రభాతవార్త: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సిఐటీయు బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్. మణిలాల్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు జి .సునంద అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిధిలోని దూళిపూడి, చిన్నమట్లపూడి పిహెచ్సి మెడికల్ ఆఫీసర్లకు ఆశా వర్కర్ల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2026 మార్చ్ 5వ తేదీన ఆశా వర్కర్లతో చర్చలు జరిపి ఇచ్చిన సర్క్యులర్స్, జీవోలు విడుదల చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని , పర్మినెంట్ చేయాలని తెలిపారు. జనాభా ప్రాతిపదికన ప్రకారం ఆశా వర్కర్ల సంఖ్యను పెంచాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి, మట్టి ఖర్చులు ఇవ్వాలి, ఏఎన్ఎం శిక్షణ పొందిన ఆశా వర్కర్లకు పర్మినెంట్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలని టి ఏ ,డి ఏ లు ఇవ్వాలని తెలిపారు. జులై 31న జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



## పెదవడ్లపూడిలో రూ.2.20 లక్షల ఎల్‌వోసీ చెక్కు పంపిణీ

మంగళగిరి, జూలై 7, ప్రభాతవార్త:
మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరైన రూ.2,20,895 విలువైన ఎల్‌వోసీ చెక్కును లబ్ధిదారుడు నల్లబోతుల నరసింహారావుకు మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, వారి ఆరోగ్య రక్షణకు మంత్రి నారా లోకేష్ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు వైద్య చికిత్స భారంగా మారకుండా ప్రభుత్వం అందిస్తున్న ఎల్‌వోసీ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా మంత్రి లోకేష్ నిరంతరం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలిచి, సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇటువంటి ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిచ్చి, వారి జీవితాల్లో భరోసా కల్పిస్తుందని జవ్వాది కిరణ్ చంద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాదల రమేష్ బాబు, పావులూరి కోటేశ్వరరావు, మొగల్ లాలా బెగ్, ఏసు, మళ్ళా విజయ్, షేక్ నన్నే, కొండపల్లి కిషోర్, నానాజీ, వేమయ్య, మండూరి శంకరరావు , బొమ్మినేని తిరుమల, పెదరాయుడు తదితరులు పాల్గొన్నారు



## పేగా సిస్టమ్స్ సంస్థలో రూ.15.71లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు..

ప్రతిపాడు (వట్టిచెరుకూరు, జూలై 7, ప్రభాతవార్త : మండల పరిధిలోని వింజనంపాడు గ్రామం వద్దనున్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థినీలు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ పెగా సిస్టమ్స్ నిర్వహించిన క్యాంపస్ నియామక ప్రక్రియలో విజయం సాధించి రూ.15.71 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..తమ కళాశాల సీఎస్ఈ విభాగానికి చెందిన నవ్య అచంటి, గీతార్త్రెడ్డి అరిగ ఇరువురు విద్యార్థినిలు ప్లేస్మెంట్‌లలో తన ప్రతిభను చాటి విజయం సాధించినట్లు తెలిపారు. మా విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, విలువలతో కూడిన బోధనను అందిస్తూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడమే కళాశాల లక్ష్యమని తెలిపారు. పేగా సంస్థలో ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థుల నిరంతర శ్రమ, అధ్యాపకుల మార్గదర్శకత్వం, కళాశాల అందిస్తున్న నాణ్యమైన అకాడమిక్ మరియు ప్లేస్మెంట్ శిక్షణ ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ప్రపంచ స్థాయి సంస్థల్లో ఉద్యోగాలు సాధించేలా కళాశాల అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు.సెక్రటరీ కోయ శేఖర్ మాట్లాడుతూ..పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలపై కళాశాలలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు తమ ప్రతిభతో అత్యుత్తమ అవకాశాలను అందిపుచ్చుకోవడం గర్వకారణమని, ఎంపికైన విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్యార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ సిహెచ్. చంద్రశేఖర్ రెడ్డి, సిఎస్ఇ హెచ్ఓడి ప్రొఫెసర్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని, ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తూ భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.



## ఆపదలో ఉన్న రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరా..

ప్రతిపాడు (వట్టిచెరుకూరు), జూలై 7, ప్రభాతవార్త : పేద అవసరాలకు అండగా నిలుస్తూ, అత్యవసర వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తున్నదని ప్రతిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బుర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రతిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ క్యాంపు ఆఫీసులో మంగళవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ఆరోగ్యం పట్ల అత్యంత బాధ్యతతో వ్యవహరిస్తూ అవసరమైన వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రాజకీయాలు, పార్టీ భేదాలు అడ్డుకావని, సహాయం కోరిన ప్రతి అర్హుడికి సీఎం సహాయనిధి అందేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. గత పాలకుల కాలంలో సహాయ నిధుల కోసం దళారీ వ్యవస్థ రాజ్యమేలిందని, చెక్కులు పొందాలంటే ప్రజలు డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేదని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితికి పూర్తిగా తెరదించామని, ఎవరికీ ఒక్క పైసా ఖర్చు లేకుండా నేరుగా లబ్ధిదారుల చేతుల్లోకే చెక్కులు చేరే ప్రక్రియను సులభతరం చేశామన్నారు. ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని వేగంగా పరిష్కారం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి రోగికి ఆలస్యం లేకుండా సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసే ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గడచిన రెండు సంవత్సరాల కాలంలో ప్రతిపాడు నియోజకవర్గంలోని 1084 మంది లబ్ధిదారులకు 30 పర్యాయాలుగా రూ.10.06 కోట్ల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ ఆర్థిక సహాయం వలన లబ్ధిదారులకు వారి కుటుంబ సభ్యులకు ఎంతో ఆనందాన్ని మరియు చేయూతను అందించినట్లుగుందని వివరించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఆపద సమయంలో కుటుంబాలకు పెద్ద కొడుకుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలుస్తూ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



## నారాయణ పాఠశాలలో వనమహోత్సవ వేడుకలు

మాచర్లటౌన్, జులై 7 ప్రభాతవార్త: స్థానిక నారాయణ స్కూల్‌లో వనమహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చెట్ల మొక్కలను రూరల్ ఎస్సై సంధ్యారాణికి, మండల విద్యాధికారులు కోటేశ్వరరావు, సురేష్‌లకు అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ నేటి సమాజంలో చెట్ల ప్రాముఖ్యతను గుర్తుంచుకుని చిన్నారులు తలపెట్టిన ఈ కార్యక్రమం చాలా గొప్పదన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ ఇంటికి దగ్గరలో గాని, ఇంటిముందుగానీ తల్లిపేరుతో ఒక మొక్క నాటడం వల్ల అందరికీ ఆరోగ్యకరమైన ఆహారం, ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఒక మొక్కను నాటడం వల్ల ఈ ప్రపంచానికి మంచి సందేశం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి, ఏజీఎం జానకిరామిఇరెడ్డి, జడ్‌సీఓలు భద్రాంరెడ్డి, గౌస్య, రిహానీ, స్కూల్ ఇన్‌ఛార్జిలు ఇంజనేయులు, ఉదయలక్ష్మి, చంద్రిక, రవినాయక్, చంద్రయ్య, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్లను పరిశీలించిన అధికారులు

మాచర్ల, జులై 7 ప్రభాతవార్త: ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ఇళ్లను సీజీఎం ఫైనాన్స్ లీలారాణి మంగళవారం పరశీలించారు. ఇళ్ల పురోగతి, నాణ్యతను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లేఅవుట్స్, గోడౌన్‌ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాచర్ల హౌసింగ్ డీఈఈ బి.బాలోజినాయక్, హౌసింగ్ ఏఈలు మరియదాసు, వర్క్ఇన్‌స్పెక్టర్ కిన్నెర తేజ, టి.అలీ తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు: ఎమ్మెల్యే జూలకంటి

కారంపూడి, జులై 7 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ట్రస్టు సేవ ఆధ్వర్యంలో కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలోని పొట్టి శ్రీరాములు (వడియరాజులు బీసీ) కాలనీలో 30 సెంట్లలో నిర్మించనున్న లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ నూతన నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గ్రామాల్లో నూతన ఆలయాల నిర్మాణాలకు టీటీడీ ట్రస్టు ఎంతగానో సాయం చేస్తుందన్నారు. ముందుచూపుతో మాచర్ల నియోజకవర్గంలో నూతన నిర్మాణాలకు అన్ని పర్మిషన్లు మంజూరు చేయించిన ఘనత జూలకంటికే దక్కిందని రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పంగులూరి పుల్లయ్య అన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గ రూపురేఖలు మార్చేసిన ఘనత జూలకంటిదేనన్నారు. వెనుకబడిన నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లేందుకు శ్రీకారం చుట్టారని పంగులూరి పుల్లయ్య అన్నారు. నరసరావుపేట ఎ ంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో వెల్దుర్తి, దుర్గి, కారంపూడి మండల ప్రజల కల వరికపూడిసెలతో రైతుల పంటలకు నీళ్లు అందించే విధంగా కృషి చేస్తున్నారని గుర్తు చేశారు.



## శ్రీ సిమెంట్స్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

కారంపూడి, జులై 7 ప్రభాతవార్త: శ్రీసిమెంటు నిర్మాణ సమయంలో కారంపూడి మండలం కాచవరం గ్రామానికి సంబంధించిన రైతులు సుమారు 700 ఎ కరాల భూమిని పరిశ్రమ నిర్మాణం కోసం రైతుల నుంచి సేకరించారు. నిర్మాణ సమయంలో శ్రీసిమెంటు యాజమాన్యం కాచవరం గ్రామానికి సంబంధించి రైతుల పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని ఆనాడు మాట ఇచ్చి మరిచారు. అంతేకాకుండా గ్రామంలో ఇల్లకు అతిసమీపంలో మైనింగ్ బ్లాస్టింగ్ ఇర్వహించడంతో తమ ఇళ్లు సైతం దెబ్బతింటున్నాయని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆందోళన నిర్వహించారు. ఈ నేపథ్యంలో ంరైతఉుల ఆందోళనకు చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా, కాచవరం రైతులకు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. ఈ నెల 8న శ్రీసిమెంటు రెండో ప్లాంట్‌కు సంబంధించి అధికారులు నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు, గ్రామస్థులు పాల్గొని వారి సమస్యలను వివరించనున్నారు.



## క్యాంపస్ సెలెక్షన్స్ లో 393 మంది ఆర్.వి.ఆర్.. జె.సి. ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను ఎంపిక చేసుకున్న టి.సి.ఎస్


గుంటూరు విద్య జూలై 7 ప్రభాత వార్త: 2026-27 విద్యా సంవత్సర ప్రారంభంలోనే ప్రఖ్యాత అంతర్జాతీయ ఐటీ సంస్థ టి.సి.ఎస్ తమ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ నియామకంలో విద్యార్థులు కనబరిచిన విశేష ప్రతిభకు తొలి విడతలోనే భారీ సంఖ్యలో 393 మంది విద్యార్థులు రూ. 3.5 లక్షల నుంచి రూ. 9 లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలకు ఎంపికై నియామక పత్రాలను టి.సి.ఎస్ ప్రతినిధులచే అందుకోవడం కళాశాల విద్యా ప్రమాణాలు, అత్యాధునిక సాంకేతిక శిక్షణకు నిదర్శనమని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి



మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో ప్రైమ్ కేటగిరీలో 9 లక్షల రూపాయలతో 35 మంది , డిజిటల్ కేటగిరీలో 7 లక్షల రూపాయలతో 52 మంది, నింజా కేటగిరీలో 3.5 లక్షల రూపాయల ప్యాకేజీలతో 306 మంది విద్యార్థులు నియమితులయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను మంగళవారం నాడు కళాశాల సిబ్బంది అభినందించారు. తమ కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల కోడింగ్ నైపుణ్యాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ప్రొఫెషనల్ ట్రైనింగ్ కార్యక్రమాలు, మాక్ ఇంటర్వ్యూలు, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి శిక్షణల ఫలితంగానే ఇంత పెద్ద ఎత్తున క్యాంపస్ నియామకాలు సాధ్యమయ్యాయని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ తెలిపారు. ఇప్పటి వరకు ఈ నియామకాలతో కలుపుకొని మొత్తం 4,556 మంది భారీ సంఖ్యలో తమ కళాశాల విద్యార్థులు టి.సి.ఎస్ క్యాంపస్ డ్రైవ్ ద్వారా ఎంపిక అయ్యి, టి.సి.ఎస్ సంస్థలో దేశ విదేశాల్లో, వివిధ హోదాల్లో, అధిక ప్యాకేజీలతో ఉద్యోగాలు చేస్తుండటం తమ కళాశాలకెంతో గర్వకారణమని కళాశాల ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణప్రసాద్ , కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, 393 టి సి ఎస్ క్యాంపస్ డ్రైవ్ ఫలితాలతో పాటూ రాబోవు యెన్ క్యూటి (నేషనల్ క్వాలిఫయర్ టెస్ట్) ఫలితాలతో కలుపుకొని మొత్తం 450 మంది టి.సి.ఎస్ లో ఈ సంవత్సరం ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఆర్ డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాసరావు, టి.సి.ఎస్ సంస్థ ప్రతినిధులు క్యాంపస్ లీడ్ రాజశ్రీ , టాలెంట్ ఏక్వ్యూజేషన్ టీం భాస్కర్ , సీతల్, కళాశాల ట్రైనింగ్ ప్లేస్మెంట్ అధికారులు శ్రీ సి.హెచ్. శ్రీనివాసరావు, డా. కె. సురేష్ బాబు, విభాగాధిపతులు, ప్లేస్మెంట్ ఇన్చార్జ్లు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని రద్దు చేయాలి

గుంటూరు విద్య జూలై 7 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ తెలంగాణ లలో మాలల భవిష్యత్తును విధ్వసం చేసే ఎస్సి వర్గీకరణ చట్టం ను రద్దు చేయాలనీ దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి. కృష్ణ స్వరూప్ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ ను, కూటమి సర్కారుల ను డిమాండ్ చేసారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. అన్నీ దోపిడీ మనువాద కుల పాలక పార్టీ లు కుట్రలు చేసి డాక్టర్ : అంబేద్కర్ వారసులను విద్యా, ఉద్యోగ రంగాల్లోకి రానీయకుండా అణిచివేస్తున్నారని ఆరోపణలు చేసారు. మోడీషా ఆదేశాలు మేరకు ఆర్ఎస్ఎస్ ఎంఆర్పిఎస్ ల తో కుమ్మక్కు ఐన రేవంత్ రెడ్డి, మెజారిటీ 26 మాల ఉప కులాలను తక్కువ జనాభా గా చూపించి గ్రూప్ సి కి ఐదు మాత్రమే కేటాయించారని ఉద్యోగ రోస్టర్ పాయింట్ కేటాయింపు లోనూ మాలలకు ఉన్న రిజర్వేషన్ అవకాశాలు రాకుండా అడ్డుకున్నారని విమర్శలు చేసారు. మాల సామాజిక వర్గం కు చెందిన మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ లు రేవంత్ రెడ్డి కి అసెంబ్లీ లో ఇచ్చిన సహకారం తోనే ఎస్సి వర్గీకరణ జరిగిందని మాల ప్రజా ప్రతినిధులు జాతి కి ద్రోహం చేసారని ప్రధానంగా వివేక్ వెంకట స్వామి మాలలను అడ్డు పెట్టుకొని మంత్రి పదవి తెచ్చుకున్నాడని ఆరోపించారు.ఎస్సి వర్గీకరణ చేయించిన మాల కుల మంత్రులు. ఎమ్మెల్యే ఎంపీ లను రానున్న ఎన్నికల్లో చిత్తు గా ఓడ్నిచాలని మాల జాతి కి దళిత బహుజన పార్టీ పిలుపు ఇస్తుందన్నారు. వర్గీకరణ చట్టం ను రద్దు చేయాలనీ ఆగష్టు లో పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన ర్యాలీ.నిర్వహిస్తామని కృష్ణ స్వరూప్ ప్రకటించారు. ఈ మీడియా సమావేశం లో పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాషా. రాష్ట్ర కార్యదర్శి పి. మోహన్ రావు. మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు




## బిఎల్‌వోలు గడువులోపే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పెదనందిపాడు జులై 7 (ప్రభాతవార్త)సర్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని పెదనందిపాడు ఎంపీడీవో లక్ష్మీదేవి కోరారు. మంగళవారం పెదనందిపాడు సచివాలయం2. సచివాలయం 1. నాగులపాడు సచివాల్నయ లోని బిఎల్ఓ ల పనితీరును వారు పరిశీలించారు. సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ప్రతి ఒక్క ఓటర్ కి ఫామ్ అందజేసి మరలా వారి వద్ద నుంచి తీసుకుని ఏటువంటి సమస్యలు తలెత్తకుండా గడవు లోపు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని,సిబ్బందిని ఎవరిని కూడా ఇబ్బంది పెట్టాలని ఆలోచన తమకు లేదని ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఆదేశాలను ప్రతి ఒక్కరు తూచా తప్పకుండా పాటించాలని ఎంపీడీవో లక్ష్మీదేవి కోరారు. కొప్పరులోని సచివాలయంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని. బి ఎల్ ఓల పనితీరును పెదనందిపాడు తహసిల్దార్ కళ్యాణి పరిశీలించి సూచనలు చేశారు. వారి వెంట మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ అబిద్ అలీ. ఆయా కార్యాలయాల సిబ్బంది ఉన్నారు.





## హెచ్‌పివి వ్యాక్సినేషన్‌ను నూరుశాతం పూర్తి చేయాలి

పెదకూరపాడు,జులై 7 (ప్రభాతవార్త): 75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్వో పద్మావతి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. 14 సంవత్సరాల లోపు బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు అందించే హెచ్ పి వి వ్యాక్సిన్ 100 పూర్తి చేయాలని ఆమె అన్నారు. హాస్పటలలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. మాతా శిశు సంక్షేమ సేవలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. పీహెచ్సీలో జరిగే ఆరోగ్య సేవల గురించి డాక్టర్ వలిగొండ రెడ్డి డిప్యూటీ డిఎంహెచ్వో కి వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు ఫార్మస్టులు పాల్గొన్నారు.



## ఏపీ మోడల్ స్కూల్, వసతి గృహం సందర్శించిన వైద్య అధికారులు

క్రోసూరు( జూలై 7 ప్రభాతవార్త: ) : పల్నాడు జిల్లా క్రోసూరు మండలం క్రోసూరు లోని ఏపీ మోడల్ స్కూల్ ను మరియు వసతి గృహమును క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రవికుమార్, అనిల్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ లు సందర్శించి సిబ్బందికి అనేక సూచనలు సలహాలు అందించారు. వసతి గృహం వంట శాల ను , స్టోర్ రూమును పరిశీలించారు. వంట వంట వండే వారికి అనేక సూచనల అందించారు. ఆహార సరఫరా లో నాణ్యత పాటించాలని తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, హాస్టల్ వార్డెన్ ఓ శ్రీలక్ష్మి, స్కూల్ ఇన్చార్జి ఉపాధ్యాయులు టీ లూర్దు మేరీ హెల్త్ సూపర్వైజర్ల శివుడు, లక్ష్మీ కుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఋషి, ఆరోగ్య కార్యకర్త కోటేశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు పావని చంద్రిక లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు



## రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా గంటా గోపి ఎన్నిక

పెదకూరపాడు,జులై 7 (ప్రభాతవార్త):రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పెదకూరపాడు మండలం 75 తాళ్లూరు గ్రామానికి చెందిన గంటా గోపిని ఎంపిక చేసినట్లు జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభాను చిబ్ నిన్న ఉత్తర్వులు విడుదల చేయడం జరిగింది, ఈ సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశంలో గంటా గోపి మాట్లాడుతూ యువజన కాంగ్రెస్కి జరిగిన ఎన్నికలలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రహీం, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా షేక్ షరీఫ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముప్పరఉదయ శంకర్, పెదకూరపాడు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లెల సతీష్ ఎన్నికయ్యారని తెలియజేశారు, మా మీద నమ్మకం ఉంచి ఎంపిక చేసినందుకు జాతీయ రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తామని తెలియజేశారు, తదనంతరం పేపర్ లీకులు అరికట్టాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎన్ టి ఏ ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని, పలు డిమాండ్లతో ఏఐసిసి ఇచ్చినటువంటి పిలుపుమేరకు విద్యార్థి గర్జన అనేటువంటి కరపత్రాలను విడుదల చేశారు, ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేయకుండా ప్రభుత్వం నియంత్రించాలని ప్రతి ప్రైవేట్ విద్యా సంస్థ ఫీజుల పట్టిక ప్రదర్శించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొల్లారం సుభాని షేక్ లేయాకత్ అలీ మోళి పాల్గొన్నారు.



## ఘనంగా కాంతారావు జన్మదిన వేడుకలు

గురజాల, జూలై 7 ప్రభాతవార్త : పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న పాత టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం టీడీపీ సీనియర్ నేత, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు జన్మదిన వేడుకల ను కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మిఠాయిలు, అల్పాహారం పంచి పెట్టారు. ఈ కార్యకమ్రంలో టీడీపీ నేతలు పోటు నాగేశ్వరరావు, నేలవెల్లి బుల్లయ్య, శరమాల హనుమంతురావు, పట్టణ అధ్యక్షుడు ఆకుల పిచ్చయ్యగుప్తా, కడప శ్రీనివాసరావు, వెంపటి సాంబశివరావు, పాతపాటమ్మ ఆలయ చైర్మన్ చీతిరాల సుబ్బారావు, దావీదు, మహిళా నేత నజీమూన్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం

గుంటూరు విద్య జులై 7 ప్రభాతవార్త: మాదిగ జాతి ముద్దుబిడ్డ మందా కృష్ణ మాదిగ నేతృత్వంలో 1994 జూలై 7న బాపట్ల జిల్లా ఎదుమూడి గ్రామంలో ఆవిర్భవించిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి దళిత సామాజిక న్యాయ చరిత్రలో ఒక గొప్ప మైలురాయిగా నిలిచిందని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు యేసుబాబు మాదిగ పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏసు బాబు మాదిగ మాట్లాడుతూ ఈ ఆవిర్భావం కేవలం ఒక సంస్థ ప్రారంభం మాత్రమే కాదు, శతాబ్దాల అన్యాయం, అసమానత, అణచివేతకు వ్యతిరేకంగా మాదిగల ఆత్మగౌరవ ఘోషగా రూపుదిద్దుకున్న చారిత్రాత్మక ప్రజా ఉద్యమమని ఆయన అన్నారు. ఎమ్మార్పీఎస్ పుట్టుకతో దళిత సమాజంలో సమాన న్యాయం, సముచిత వాటా, రాజ్యాంగ హక్కుల సాధన కోసం ఒక నూతన దిశ ఏర్పడిందని యేసుబాబు మాదిగ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అనే న్యాయమైన డిమాండ్ను గ్రామాల నుంచి దేశ రాజధాని వరకు, వీధుల నుంచి న్యాయస్థానాల వరకు తీసుకెళ్లిన మహోన్నత పోరాట ఫలితమే ఈరోజు కనిపిస్తున్న సామాజిక చైతన్యమని ఆయన స్పష్టం చేశారు. ఎంఆర్పీఎస్ దీర్ఘకాల పోరాటానికి చరమ విజయంగా నిలిచింది సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ ఉపవర్గీకరణ అనుకూల తీర్పు అని ఆయన అభిప్రాయపడ్డారు. 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ, ఎస్టీలలో ఉపవర్గీకరణ రాజ్యాంగబద్ధతను సమర్థించగా, ఆ తీర్పు ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం 2025 ఏప్రిల్ 14న ఎస్సీ ఉపవర్గీకరణను అమల్లోకి తెచ్చిన తొలి రాష్ట్రంగా నిలిచింది. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 2025లో ఎస్సీ ఉపవర్గీకరణ అమలుకు ఆర్డినెన్స్ జారీ చేసి, తదనంతరం అమలు నియమాలను ప్రకటించడం సామాజిక న్యాయం దిశగా ఒక ముఖ్యమైన అడుగని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాలు ఎమ్మార్పీఎస్ ఉద్యమం వ్యర్థం కాలేదని, త్యాగాలు ఫలించాయని, శోషిత వర్గాల స్వరానికి చట్టబద్ధ గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమ పితామహుల త్యాగాలను, అమరుల ఆత్మగౌరవ దీక్షను, వేలాది కార్యకర్తల నిరంతర పోరాట స్ఫూర్తిని స్మరించుకోవాలని యేసుబాబు మాదిగ పిలుపునిచ్చారు. ఇకపై వర్గీకరణ అమలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, విద్య, ఉపాధి, రాజకీయ ప్రతినిధిత్వం, సంక్షేమ పథకాలలో నిజమైన సామాజిక న్యాయంగా ప్రతిఫలించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



8-7Pg5_8-7Pg5.qxd 07/Jul/26 10:55 PM Page 1



**కేరళలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి**

### కేరళ నుంచి కాశ్మీర్ దాకా

# పలు రాష్ట్రాల్లో వర్ష బీభత్సం

## జమ్ముకాశ్మీర్‌లోని కిస్త్వార్ జిల్లాలో వరదలతో అతలాకుతలం

## మూడురోజులుగా మహారాష్ట్రలో జనజీవనం అస్తవ్యస్తం

**ముంబయి,శ్రీనగర్,వాయనాడ్, జులై 7:** దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలతోపాటు దక్షిణాది ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు వరద విలయాన్ని సృష్టిస్తున్నాయి. మహారాష్ట్ర, జమ్ముకాశ్మీర్, కేరళల్లో మూడురోజుల నుంచి కురుస్తున్న ఎడతెగని వర్షాలతో జనజీవనం అతలాకుతలం అయింది. ప్రత్యేకించి మహారాష్ట్ర రాజధాని లోతట్టుప్రాంతాలన్నీ జలమయం అయి ఇతర నగర ప్రాంతంతో సంబంధాలు తెగిపోవడంతో ద్వీపంలా మారింది. ముంబైపుణె, ముంబైఅహ్మదాబాద్, ముంబైకొంకణ్‌రహదారులు పూర్తిగా మూసుకుపోయాయి. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక ముంబైపుణె ఎక్స్‌ప్రెస్ వేపై కొండచరియలు విరగపడ్డాయి. దాంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ముంబైపుణె ఎక్స్‌ప్రెస్ వేలో ట్రాఫిక్ అంతరాయాలను తొలగించేందుకు మిస్సింగ్ లింక్ పేరుతో 13.3 కిలోమీటర్ల బైపాస్‌ను రూ.6,695 కోట్లతో నిర్మించారు. ఇందులో రెండు సొరంగాలు (1.6 కి.మీ., 8.9 కి.మీ.) ఉన్నాయి. ఈ సొరంగ మార్గాన్ని 9 వారాల కిందట ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రారంభించారు. సొరంగం సమీపంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. విపత్తు నిర్వహణ సిబ్బంది ఏకంగా 18 గంటల పాటు శ్రమించి ఈ మార్గాన్ని పునరుద్ధరించారు. రుతుపవనాల ప్రభావంతో సోమవారం పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిశాయి. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వానలు, బలమైన ఈదురుగాలుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 13 మంది మరణించగా, మరో 10 మంది గాయపడ్డారు. వందకు పైగా ఇళ్లు దెబ్బతినడంతో వందలాది మంది నిరాశ్రయులయ్యారని రాష్ట్ర విపత్తు నిర్వహణ కేంద్రం తెలిపింది. గడిచిన 48 గంటల్లో రాష్ట్రంలోని తీరప్రాంత, పశ్చిమ ప్రాంతాల్లో వర్షాల తీవ్రత అత్యధికంగా ఉంది. పర్యాటక ప్రాంతమైన లోనావాలాలో గత 48 గంటల్లో ఏకంగా 625 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. రాయ్‌గఢ్‌లో 236 మి.మీ., ఠాణేలో 161 మి.మీ., రత్నగిరిలో 152 మి.మీ., ముంబైలో 100 నుంచి 161 మి.మీ. వరకు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షాల ధాటికి రాష్ట్రంలోని జలాశయాలు వేగంగా నిండిపోతున్నాయి. అంబా, సావిత్రి, కుండలిక, పాతాళగంగ, ఉల్హాస్ సహా పలు నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో బద్లాపూర్, మోహనే, జాంభూల్‌పాడ ప్రాంతాల్లో వరద హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల కారణంగా పలుచోట్ల విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. ముంబైలోని మాన్‌ఖుర్ద్ ప్రాంతంలో ఓ భవనం మురికివాడపై కూలిపోవడంతో ఆరుగురు మరణించగా, మరొకరు గాయపడ్డారు. చెట్టు కూలి ఒకరు, నీట మునిగి పాల్ఘర్, సింధుదుర్గ్‌లలో చెరొకరు ప్రాణాలు కోల్పోయారు. సతారాలో కొండచరియలు విరిగిపడటంతో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో మాథెరన్, లోనావాలా, ఖోపోలి వంటి హిల్ స్టేషన్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో రెడ్ అలర్ట్ ప్రకటించారు. సహాయక చర్యల కోసం రెండు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను మోహరించారు. తలేగావ్‌దాభాడే సమీపంలో వరద నీటిలో చిక్కుకున్న 25 మంది ప్రయాణికులతో ఉన్న బస్సును ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రాయ్‌గఢ్ జిల్లాలో ఇంటి పైకప్పుపై చిక్కుకుపోయిన ఆరుగురు కుటుంబ సభ్యులను పడవల సాయంతో రక్షించారు. ముంబైగోవా, ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వేలపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహారాష్ట్రలోని ఒక భాగం ఇలా జలవిలయంతో అల్లాడుతుండగా, మరోవైపు విదర్భ ప్రాంతం మాత్రం వర్షాల కోసం ఎదురు చూస్తోంది. వార్ధా, అకోలా, అమరావతి, యవత్ మాల్, చంద్రపూర్ జిల్లాల్లో ఇప్పటివరకు వర్షాలు కురవకపోవడం గమనార్హం. ముంబై మహానగ రాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ముఖ్యంగా తూర్పు శివారు ప్రాంతాల్లో గత 48 గంటల్లో ఏకంగా 380 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో బృహన్ ముంబైమున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తమై హై అలర్ట్ ప్రకటించింది. ముంబయి నగరంలో 300మి.మీ.,పశ్చిమ శివార్లలో 345 మి.మీ.వర్షపాతం నమోదైంది. గంటకు 70నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. భారత వాతావరణశాఖ జులై 4నుంచి 6వరకు గతంలో జారీ చేసిన రెడ్ అలర్ట్‌ను మంగళవారం నాటికి ఆరెంజ్ అలర్ట్‌గాసవరించింది. నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. బీఎంసీ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. విపత్తు నిర్వహణ బృందాలు క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తు న్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు హై కెపాసిటీ పంపులను ఏర్పాటు చేశారు.



భారీ వర్షాలకు జమ్ముకాశ్మీర్‌లో కొండచరియలు విరిగిపడిన దృశ్యం

**కేరళలో టన్నెల్‌వద్ద కొండచరియలు పడి ఐదుగురు మృతి :** కేరళలోని వయనాడ్ జిల్లాలో దారుణ ప్రమాదం జరిగింది. టన్నెల్ వద్ద కొండ చరియలు విరిగిపడిన ఘటనలో ఐదుగురు మరణించారు. మట్టిదిబ్బల కింద మరికొందరు చిక్కుకున్నారు. ఈ ఘటన కేరళలోని వయనాడ్ జిల్లా, మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద మంగళవారం జరిగింది. స్థానిక మీనాక్షి బ్రిడ్జి వద్ద ఒక టన్నెల్ కోసం తవ్వాలు, నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఆ మట్టిదిబ్బలు, రాళ్ల కింద పలువురు చిక్కుకుపోయారు. వీరిలో ముగ్గురు మరణించారు. ఘటనాపై సమాచారం అందుకున్న ఫైర్, రెస్క్యూ బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఘటనపై కేరళ సీఎం వీడీ సతీషన్ కూడా స్పందించారు. వయనాడ్ జిల్లా అధికారులతో మాట్లాడారు. తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించి బాధితుల్ని కాపాడాలని, వ్యవస్థల్ని సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సహాయక చర్యల్ని పర్యవేక్షించాల్సిందిగా మంత్రులు ఏపీ అనిల్ కుమార్, టీ సిద్దిఖ్‌లను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఇక్కడ టన్నెల్ నిర్మాణ పనుల్ని సోమవారం నుంచే నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**జమ్ముకాశ్మీర్‌ను కుదిపేస్తున్న భారీ వర్షాలు వరదలు**

జమ్మూ కాశ్మీర్‌లోకూడా ఈ భారీ వర్షాలు వరద భీభత్సం సృష్టిస్తున్నాయి. దోడా జిల్లాలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు జనజీవనాన్ని కకావికలంచేసాయి. రోడ్లు జలమయ మయ్యాయి. థాత్రి, గండోహ్, బలేస్సా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

కొండచరియలు విరిగిపడటం, వరద నీరు ఇళ్లల్లోకి చేరడం వల్ల రోడ్లు ధ్వంసమై సాధారణ జనజీవనం స్తంభించింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించి వాగులు పొంగిపొర్లడంతో బండరాళ్లు, శిథిలాలు కొట్టుకుపోయి అనేక ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయి. వరదల కారణంగా థాత్రి వద్ద దోడాకిష్త్వార్ జాతీయ రహదారి కూడా మూసివేశారు. దీంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.




# టిక్‌టాక్ వల్లే గెలిచా..

## అత్యధిక ఫాలోవర్లు ఉన్న వాడిని నేనే: ట్రంప్

**వాషింగ్టన్,జులై 7:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తన ఘనవిజయానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్ ఎంతగానో దోహదపడిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనా యాజమాన్యంలోని ఈ యాప్ వల్ల జాతీయ భద్రతకు ముప్పు ఉందంటూ వాషింగ్టన్ రాజకీయ వర్గాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ, ఈ ప్లాట్‌ఫామ్‌లో తనకు ఉన్న ఆదరణే దాని ప్రభావానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో సోమవారం పిల్లల కోసం ట్రంప్ అకౌంట్స్ పథకాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడిన ట్రంప్ టిక్‌టాక్‌లో అత్యధిక ఫాలోవర్లు ఉన్న ఏకైక రాజకీయ నాయకుడిని తానేనని చెప్పుకొచ్చారు. టిక్‌టాక్‌లో నేనే అందరికంటే చాలా ముందున్నాను. నిజం చెప్పాలంటే ఈ యాప్ వల్లే నేను ఎన్నికల్లో ఏకపక్షంగా ఘనవిజయం సాధించానని భావిస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. చైనా యాజమాన్యం కారణంగా ఈ యాప్ వల్ల గూఢచర్య ముప్పు పొంచి ఉందంటూ ఒక టీవీ షోలో చర్చించడాన్ని తాను చూశానని చెప్పారు. పాలసీ మేకర్లు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఆయన అంగీకరించారు. అయితే, ఆ వాదనను తోసిపుచ్చుతూ ఒకవేళ ఈ యాప్ అంతగా ప్రభావితం చేయగలిగితే నేను దేశాన్ని ప్రేమిస్తున్నానని, దేశం కోసం ఎన్నో పనులు చేయబోతున్నానని ఇందులో చెబుతున్నాను కదాఅని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఆడియన్స్ ర్యాంకింగ్స్‌లో ప్రముఖ సెలబ్రిటీల కంటే తానే ముందున్నానని ట్రంప్ ఈ సందర్భంగా వెల్లడించారు. తాజా గణాంకాల ప్రకారం ప్రముఖ సింగర్ టేలర్ స్విఫ్ట్ 11వ స్థానంలో ఉంటే, నేనే నంబర్ వన్ స్థానంలో ఉన్నానని చెప్పారు. ఇదే సమయంలో టిక్‌టాక్ వ్యవహారంపై తాను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మాట్లాడినట్లు ట్రంప్ బహిర్గతం చేశారు.




## ఇండోనేసియాలో బెంగళూరు ఐఐఎం క్యాంపస్

**జకార్తా,జులై 7:** ఇండోనేసియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీమంగళవారం వెల్లడించారు. ప్రస్తుతం మోడీఇండోనేసియాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఇండోనేసియా ప్రెసిడెంట్ ప్రబోవో సుబియాంటోతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. మోడీ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య ఏఐ, టెలికమ్యూనికేషన్స్, డిజిటల్ వంటి టెక్నాలజీలో యువతకు సహకారానికి ఈ రోజు ఇండోనేసియా, ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల మధ్య స్టార్టప్‌ల సహకారాన్ని కూడా ప్రారంభించబోతున్నాం. ఇండియాలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థ ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఇండియాలో ప్రారంభించబోతున్నామని అన్నారు. ఐఐఎంలకు సంబంధించి విదేశాల్లో ప్రారంభించబోతున్న రెండో క్యాంపస్ ఇది. గతంలో ఐఐఎం అహ్మదాబాద్ క్యాంపస్‌ను దుబాయ్‌లో ఏర్పాటు చేశారు. ఐఐఎంలతోపాటు ఐఐటీ క్యాంపస్‌లు కూడా కొన్ని విదేశాల్లో ఉన్నాయి. ఐఐటీ మద్రాస్ క్యాంపస్‌లు టాంజానియాలోని జాంజిబర్‌లో ఉండగా, ఐఐటీ ఢిల్లీ క్యాంపస్ అబుదాబిలో 2024లో ప్రారంభమైంది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ప్రకారం ఐఐఎంలలో ఐఐఎం అహ్మదాబాద్ మొదటి స్థానంలో ఉండగా, ఐఐఎం బెంగళూరు రెండో స్థానంలో ఉంది. క్యాట్ స్కోర్ ఆధారంగా ఐఐఎంలలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. సాధారణంగా క్యాట్ పరీక్ష నవంబర్ చివరి వారంలో జరుగుతుంది. క్యాట్ నోటిఫికేషన్ జూలైలో విడుదలై, ఆగష్టులో ముగుస్తుంది. బ్యాచిలర్ డిగ్రీ పొంది, కనీసం 50 శాతం మార్కులున్న వారు ఐఐఎంలలో ప్రవేశానికి అర్హులు. రిజర్వేషన్ కేటగిరీల వారికి 45 శాతం మార్కులు వస్తే చాలు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఫీజు రూ.1,300 కాగా, ఇతరులకు రూ.2,600.




## టిసిఎస్ మతమార్పిడి కేసులో నిందితురాలు నిదాఖాన్‌కు బెయిల్

**నాసిక్,జులై 7:** టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అనుబంధ బీపీవో యూనిట్‌లో జరిగిన మతమార్పిడి, లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితురాలైన నిదాఖాన్‌కు నాసిక్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అరెస్ట్ అయిన దాదాపు రెండు నెలల తర్వాత ఆమెకు ఈ చట్టపరమైన ఊరట లభించింది. నాసిక్ రోడ్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి కె.జి.జోషి ఈ ఉత్తర్వులు జారీ చేశారు. నిదా ఖాన్‌తో పాటు ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్న తౌసిఫ్ అత్తార్‌కు కూడా కోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే, ఇదే కేసులో ఉన్న మరో కీలక నిందితుడు డానిష్ షేక్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను మాత్రం న్యాయస్థానం తీవ్రంగా తిరస్కరించింది. టీసీఎస్ నాసిక్ బీపీవో యూనిట్‌లో టెలికాలర్‌గా పని చేసిన నిదాఖాన్, ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత దాదాపు 42 రోజుల పాటు పోలీసులకు దొరకకుండా పరారయ్యారు. అనంతరం మే నెలలో ఛత్రపతి శంభాజీనగర్‌లో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. తాను ప్రస్తుతం గర్భవతిగా ఉన్నానని, జైలులోఇబ్బందులు పడుతున్నానని పేర్కొంటూ వైద్యకారణాల రీత్యా ఆమెబెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాధితురాలికి నిదాఖాన్ బురఖా, ఇస్లామిక్ మతపరమైన పుస్తకాలను ఇవ్వడంతోపాటు, ఫోన్‌లో మతపరమైన యాప్స్ ఇన్‌స్టాల్‌చేసి మతమార్పిడికి ప్రేరేపించిందని, వాట్సాప్ గ్రూపులద్వారా ఒత్తిడి తెచ్చిందని పోలీసులుఆరోపించారు. చార్జ్‌షీట్ దాఖలు కావడం, ఆమె గర్భందాల్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని కోర్టుబెయిల్ మంజూరు చేసింది.

# ట్రస్టు అధీనంలో 30 కిలోల బంగారు ఆభరణాలు

## 1518 కిలోల వెండి వస్తువులు: కోశాధికారి గోవింద్‌దేవ్ గిరి వెల్లడి

**అయోధ్య,జులై 7:** శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇవాళ కీలక ప్రకటన చేసింది. తమ ట్రస్టు ఆధీనంలో సుమారు 30 కిలోల బంగారు వస్తువులు ఉన్నట్లు తెలిపింది. సుమారు 1518 కేజీల వెండి వస్తువులు ఉన్నట్లు ఆ ట్రస్టు ట్రెజరర్ స్వామి గోవింద దేవ్ గిరి తెలిపారు. అయోధ్య రామాలయంలో విరాళాలను చోరీ చేసిన ఘటనలో 8 మంది అరెస్టు అయిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఇంకా దర్యాప్తు జరుగుతున్నది. భక్తులు సమర్పించిన విరాళాలను చోరీ చేసినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇవాళ స్పందించింది. దేవాలయానికి ఇప్పటి వరకు 2926 విలువైన వస్తువులను కానుకలుగా సమర్పించారని, అవన్నీ సురక్షితంగా ఉన్నాయని, వాటికి సంబంధించిన రికార్డులను కూడా మెయిన్‌టేన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. బంగారంతో తయారు చేసిన రామచరితమానస్, డైమండ్ నెక్లెస్ కూడా అదృశ్యమైనట్లు వచ్చిన వార్తలను ట్రస్టు కొట్టిపారేసింది. ఆ కానుకలను మీడియా ముందు ప్రదర్శించింది. స్వామివారికి చెందిన వెండి చరణ పాదుకలు, కాకబుషుండి కళాకృతి మిస్సైనట్లు సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న వార్తలను ట్రస్టు కొట్టిపారేసింది. ఆ కానుకలను కూడా మీడియా ముందు ట్రస్టు ప్రదర్శించింది. ప్రతి వస్తువు వివరాలను ఇన్వెంటరీలో పొందుపరిచామని, ఆ వస్తువును విరాళం ఇచ్చిన దాత పేరు కూడా తమ వద్ద ఉన్నట్లు గిరి తెలిపారు. వెండి కాకబుషుండి వస్తువు ఆలయ ఆధీనంలో ఉన్నట్లు గిరి చెప్పారు. 2024 మార్చి 31వ తేదీ వరకు రామమందిరానికి సుమారు 16.765 కిలోల బంగారు వస్తువులు కానుకలుగా వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక 2024-25లో 10.445 కిలోల బంగారం, 2025-26లో 5.050 కిలోల బంగారం కానుకల రూపంలో వచ్చిందన్నారు. 2026 మార్చి 31వ తేదీ వరకు ఆలయానికి మొత్తం 32.259 కిలోల బంగారం అందినట్లు గిరి వెల్లడించారు. వెండి వస్తువులను కరిగించిన తర్వాత ఆలయం వద్ద మొత్తం 849 కేజీల రిఫైన్డ్ సిల్వర్ ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇక ఈ ఏడాది మార్చి 31 వరకు మొత్తం 1518 కిలోల వెండి ఆలయం వద్ద ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఏడాది చార్టెడ్ అకౌంట్‌తో ఆ వస్తువులను వెరిఫై చేయిస్తున్నట్లు గిరి తెలిపారు.



# ఈ25 ఇథనాల్ పెట్రోల్‌పై అపోహలు నమ్మొద్దు

## ప్రచారంపై స్పష్టత ఇచ్చిన కేంద్రం

**న్యూఢిల్లీ,జులై 7:** దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు.

ముడి చమురు దిగుమ తులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరి యు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బ తినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్య మాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమం లోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి.

ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## సంక్షిప్త వార్తలు

### సింధూ జలాల్లో వాటా కోసం గట్టి చర్యలు: పాక్ ఆర్మీ



**ఇస్లామాబాద్, జులై 7:** సింధూ జలాల ఒప్పందాన్ని (ఐడబ్ల్యుటి) భారత్ పక్కనబెట్టడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ ఒప్పందం ప్రకారం తమ దేశానికి రావాల్సిన సింధూ జలాల వాటాను పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని 276వ కోర్ కమాండర్ల సమావేశంలో పాక్ తన నిర్ణయాన్ని వెల్లడించింది. ఆ దేశ రక్షణ దళాల అధిపతి అసిమ్ మునీర్ అధ్యక్షతన జరి గిన ఈ సమావేశంలో ప్రభుత్వ ఆదేశాలు, దేశ ప్రజల ఆకాంక్షల మేరకు సింధూ జలాల కోసం పోరాడుతామని సైన్యం తెలిపింది. 2025 ఏప్రిల్ 24 నాటి జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సి) ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం సింధూ జలాలను ఆపే ఎటువంటి ప్రక్రియనైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని తెలిపింది.

### సిఎం విజయ్‌కి హైకోర్టు నోటీసులు

**చెన్నై, జులై 7:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఎన్నికను సవాల్ చేస్తూ డిఎంకె అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, మంగళవారం విచారణకు వచ్చింది. విజయ్‌తోపాటు మంత్రి ఆదవ్ అర్జున గెలుపుపై వచ్చిన పిటిషన్లను కూడా జస్టిస్ వి.లక్ష్మీ నారాయణన్ ధర్మాసనం విచారణకు స్వీకరించింది. పిటిషన్లలో ఉన్న కొన్ని సాంకేతిక లోపాలను వారం రోజుల్లోగా సరిదిద్దాలని కోర్టు ఆదేశించింది. ఆ ప్రాసెస్ పూర్తి కాగానే విజయ్‌తోపాటు మంత్రికి మూడువారాల గడువిస్తూ రిజిస్ట్రీ నోటీసులు జారీ చేయనుంది. అయితే, ఈ వ్యవహారంలో హైకోర్టు జడ్జి ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా యేళ్ల తరబడి సాగే ఈ ఎన్నికల పిటిషన్ల విచారణను అత్యంత వేగంగా, కేవలం ఆరు నెలల లోపే పూర్తి చేయాలని

### కాక్రోచ్ పార్టీ 'ఎక్స్' ఖాతాను పునరుద్ధరించండి: ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, జులై 7:** 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) 'ఎక్స్' ఖాతాను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో తమ ఖాతాను నిలిపివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారిస్తూ జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఈ ఆదేశాలు జారీ చేశారు. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, జూన్ 21న జరిగిన నీట్ రీఎగ్జామ్‌కు ముందు ముందస్తు జాగ్రత్త చర్యగా ఆ ఖాతాను నిలిపివేసినట్లు కోర్టుకు తెలిపారు. ఆ ప్లాట్‌ఫారమ్‌లోని కొన్ని పోస్ట్‌లు లక్షలాది మంది అభ్యర్థులు, వారి తల్లిదండ్రులలో గందరగోళం, ఆందోళనను కలిగించే అవకాశం ఉందని ఆయన వాదించారు. పరీక్ష పూర్తయినందున, ఆ 'ఎక్స్' ఖాతాపై ఆంక్షలు తొలగించడానికి ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదు అని మెహతా పేర్కొన్నారు.

### లోక్‌సభ ముందుకు జస్టిస్ యశ్వంత్ వర్మ కేసు నివేదిక

**న్యూఢిల్లీ, జులై 7:** అవినీతి ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన అలహాబాద్ హైకోర్టు మాజీన్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కమిటీ రూపొందించిన నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాష్ బిర్లా నిర్ణయించారు. అయితే, అప్పటికే రాజీనామా చేసిన న్యాయమూర్తిపై పార్లమెంట్ ఎలాంటి చర్యలు తీసుకోగలదనే అంశంపై ఇప్పుడు సరికొత్త రాజ్యాంగపరమైన చర్చ తెరపైకి వచ్చింది. గతంలో జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో లెక్కల్లో చూపని నగదు కట్టలు దహనమైన వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. దీంతో ఒత్తిడికి గురైన ఆయన, ఏప్రిల్ 9వ తేదీన తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

### అవినీతికేసులో చైనా మాజీ అధికారికి మరణశిక్ష




**బీజింగ్,జులై 7:** చైనాలో భారీ అవినీతి కేసులో మాజీ ఆర్థికాభివృద్ధి అధికారి యాంగ్ యూలిన్‌కు కోర్టు మరణశిక్ష విధించింది. మూడు దశాబ్దాల పాటు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.2,800 కోట్లు లంచాల రూపంలో స్వీకరించినట్లు కోర్టు తేల్చింది. ఇటీవలి కాలంలో చైనాలో వెలుగుచూసిన అతిపెద్ద అవినీతి కేసుల్లో ఇదొకటిగా నిలిచింది. యాంగ్ యూలిన్ 1993 నుంచి 2023 వరకు పలు ప్రాజెక్టులు, వ్యాపార అనుమతులు, భూముల కేటాయింపులు, వర్కింగ్ క్యాపిటల్‌కు సంబంధించిన అంశాల్లో సాయం చేస్తూ భారీగా లంచాలు తీసుకున్నట్లు చాంగ్‌జౌ ఇంటర్మీడియట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది.

# సియా,చేతన్‌ల రహస్య వివాహం

## కేతన్ హత్యకేసులో రోజుకో ట్విస్ట్




**పూణె,జులై 7:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పుణె బిజినెస్‌మ్యాన్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో మరో ట్విస్ట్ బయటపడింది. ఈ కేసులో నిందితురాలు సియా, ఆమె ప్రియుడు చేతన్‌ను రహస్యంగా పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. దాంతో ఈ కేసు కొత్త మలుపు తిరిగింది. కేతన్‌తో నిశ్చితార్థం జరిగిన తర్వాతే వీరు వివాహం చేసుకున్నట్లు దర్యాప్తులో తేలిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కేతన్ అగర్వాల్‌తో సియాకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిశ్చితార్థం జరిగింది. నవంబరులో వివాహం జరిపించేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పెళ్లి ఇష్టంలేని సియా ఇంట్లో వాళ్లకు చెప్పకుండా నాలుగు నెలల కిందటే పుణెలోని స్థానిక రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రియుడు చేతన్‌ను పెళ్లి చేసుకుందట. దీనికి ఇద్దరు స్నేహితులు సాక్షి సంతకాలు చేసినట్లు సమాచారం. కేసు దర్యాప్తులో భాగంగా సియా, చేతన్ ఫోన్లలోని వాట్సప్ సంభాషణలను పరిశీలించడంతో ఈ విషయం బయటపడినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. దాంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక వివాహ చట్టం కింద వీరికి వివాహ ధ్రువీకరణ పత్రం జారీ అయ్యిందా అనేది వెరిఫై చేస్తున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ పెళ్లి ఫొటోలను సియా తన ప్రైవేట్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిందట. ఆ తర్వాత వాటిని డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతిక బృందాల సాయంతో ఆ ఫొటోలను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జూన్ 18న కేతన్ అగర్వాల్ లోయలోపడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# సిఎంను నియంత్రించడమేంటి?

## డిఎంకె పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ, జులై 7:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను తాము నియంత్రించాలని కోరడమేంటని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కరూర్ తొక్కిసలాట కేసు నేపథ్యంలో డిఎంకె పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చొద్దని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలతో డిఎంకె వెనక్కి తగ్గి తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. కరూర్ తొక్కిసలాట కేసులో సిబిఐ దర్యాప్తు కొనసాగుతున్న సమ యంలో ముఖ్యమంత్రి విజయ్ జులై 10న అక్కడ పర్యటించనున్నారని డిఎంకె కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమం దర్యాప్తులో ఉన్న సాక్షులపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాదించింది. అంతేకాదు టివికె నేత ఆదవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగాలు, పర్యటనలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది.అయితే ఈవాదనలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. 'ముఖ్యమంత్రి ఏం చేయాలో కూడా సుప్రీంకోర్టే చెప్పాలా? ఆయన ఈ కేసులో నిందితుడు కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపైనా ఆంక్షలు కోరుతున్నారా?రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఈ కోర్టు ఎలాఆదేశాలు ఇస్తుంది?' అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో డిఎంకె తన పిటిషన్‌ను వెనక్కి తీసు కునేందుకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది.



8-7Pg6exHMNWJQE_8-7Pg6exHMNWJQE.qxd 07/Jul/26 10:57 PM Page 1



# మామిడి రైతును నట్టేట ముంచుతున్న ర్యాంపులు

**• కేజీ తోతాపురికి రూ.3 మాత్రమే చెల్లింపు • ర్యాంపు నిర్వాహకుల జేబుల్లోకి రూ.4.50 కోట్లు**



**చిత్తూరు, జులై 7 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి రైతును ర్యాంపులు నట్టేట ముంచుతున్నాయి. జిల్లాలోని తోతాపురి మామిడి రైతులకు పల్ప్ ఫ్యాక్టరీలు కేజీ మామిడికి రూ.5 కచ్చితంగా చెల్లించాలని, ర్యాంపుల నిర్వాహకులు కేజీ తోతాపురి మామిడిపై రైతుకు రూ.4 చెల్లించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే జిల్లాలోని మామిడి రైతులకు ర్యాంపులు కలెక్టర్ నిర్ణయించిన ధరను సైతం చెల్లించకుండా భారీగా కోతలు విధించడంతో మామిడి పంట కోత కోయడానికి అప్పులు చేసిన రైతుకు చేతిలో చిల్లిగవ్వ మిగలని పరిస్థితి ఏర్పడింది. ఈ మామిడి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 52 ర్యాంపులు ఏర్పాటు అయ్యాయి. ఈ ర్యాంపుల వద్దకు మామిడి రైతులు తాము పండించిన తోతాపురి మామిడికి తీసుకువస్తే వాటిని ర్యాంపు యాజమానులు కొనుగోలు చేసి ఆపై ర్యాంపుల నుండి తాము ఒప్పందం చేసుకున్న పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడిని తరలిస్తుంటాయి. అత్యధిక మామిడి రైతులు సైతం నేరుగా తమ మామిడి పండ్లను పల్ప్ ఫ్యాక్టరీల వద్దకు తీసుకెళ్తే రోజుల తరబడి క్యూలో వుండాల్సిన పరిస్థితి వుంటుందని, ర్యాంపులకు వెళితే అక్కడ కేజీకి ఒక రూపాయి తక్కువ లభించినా అప్పటికప్పుడు కాయలు అన్‌లోడ్ అవుతాయని భావించి ర్యాంపులకు వెళ్ళి మామిడి కాయలను రైతులు అన్‌లోడ్ చేస్తున్నారు. ఈ పరిస్థితిని అసరాగా చేసుకున్న ర్యాంపు యాజమానులు రైతులను నట్టేట ముంచడం ప్రారంభించారు. తాము కేజీ తోతాపురి మామిడికి రూ.3 కంటే ఎక్కువ చెల్లించడం సాధ్యం కాదని, దీనికంటే ఎక్కువ డబ్బులు కావాలంటే మీరు పల్ప్ ఫ్యాక్టరీలకు తీసుకెళ్ళాలని స్పష్టం చేస్తున్నారు.

జిల్లా అధికార యంత్రాంగం కేజీకి రూ.4 చెల్లించాలని పేర్కొంటుండటంతో ఆ మేరకు తమ కాయలు కొనుగోలు చేయాలని మామిడి రైతులు కొంతమందిది ర్యాంపు నిర్వాహకులను ప్రాథేయపడినప్పటికీ ఫలితం వుండటం లేదు. జిల్లా వ్యాప్తంగా 51 వేల హెక్టార్ల విస్తీర్ణంలో తోతాపురి మామిడి పంట సాగు అయితే ఈ సీజన్‌లో 5 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి ఉత్పత్తి అయ్యింది. జిల్లాలోని మామడి పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మండీలు ఇప్పటి వరకు 2.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడికి కొనుగోలు చేశాయి. ఇందులో జిల్లాలోని 31 పల్ప్ ఫ్యాక్టరీలు 1,60 లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని రైతుల నుండి కొనుగోలు చేస్తే, మండీలు, ర్యాంపులు కలిసి తోతాపురి రైతుల నుండి 45 వేల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడికి కొనుగోలు చేశాయి.

ర్యాంపు నిర్వాహకులు మామిడి రైతుల నుండి 45 వేల మెట్రిక్ టన్నుల మామిడిని కేజీ రూ.3తో కొనుగోలు చేయడంతో ర్యాంపు నిర్వహకులు ఇప్పటికే అధికారికంగా రూ.4.45 కోట్ల అదనపు ఆదాయం గడించినట్లైంది. ర్యాంపు యాజమానులకు సాధారణ ఆదాయంతో పాటు అదనపు ఆదాయం లభిస్తే ఇప్పటికే ర్యాంపు నిర్వాహకులు సుమారు రూ.15 కోట్ల మేరకు ఆదాయం ఆర్జించినట్లు తెలుస్తోంది. ర్యాంపుల్లో మామిడి రైతులకు జరుగుతున్న అన్యాయంను గుర్తించి జిల్లా అధికార యంత్రాంగం మామిడి రైతుకు న్యాయం చేయడానికి సత్వరం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## కొండపర్వ వద్ద రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కొండపర్వ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మైలవరం సమీపం నుంచి కొండ పర్వకు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న దంపతులను వేగంగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో చర్లపల్లి శృతి(28) మృతి చెందారు. ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 15 నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఈ నెల 15 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖ ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. కాలేజీల అనుబంధ గుర్తింపును త్వరగా పూర్తిచేసి, కౌన్సెలింగ్ చేపట్టాలని భావిస్తోంది. ఇంజినీరింగ్ కళాశాలలకు కనీస ఫీజును రూ.40,000ల నుంచి రూ.47,000లకు పెంచింది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో కనీస ఫీజును రూ.45,000లకు పెంచింది. ఆ తర్వాత వైసిపి సర్కార్ దీన్ని రూ.35,000లకు తగ్గించింది. తాజాగా రూ.47,000లుగా నిర్ణయించారు. ఎపిలో ప్రస్తుతం 140 ఇంజినీరింగ్ కాలేజీల కనీస ఫీజు రూ.40,000లుగా ఉంది. తాజా పెంపుతో ఆయా విద్యాసంస్థలకు ప్రయోజనం చేకూరనుంది. మిగతా కళాశాలలకు గత సంవత్సరం ఫీజులే అమల్లో ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణ కమిటీ (ఎపిఎఫ్ఆర్ఎంసి) కళాశాలల ఆదాయ, వ్యయాలను గణించి రెండు, మూడు నెలల్లో కొత్త ఫీజులను ఖరారు చేస్తుంది. ఈ ఫీజులే 2026-27 విద్యా సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల పాటు అమల్లో ఉంటాయి. మరోవైపు ఇంజినీరింగ్ సీట్ల పెంపుపై సర్కార్ పరిమితి విధించింది. గత సంవత్సరంలో ఉన్న సీట్ల సంఖ్యకే ఈ ఏడాదీ ఆమోదం తెలపనుంది. దీనికి కళాశాల యాజమాన్యాలు సమ్మతించాయి. ఈ ఏడాది 6000లకు పైగా సీట్లు పెంచేందుకు ఎఐసిటిఇ అనుమతించినా, ప్రభుత్వం మాత్రం పరిమితి విధించింది.

# పొగాకుకు లభించని గిట్టుబాటు ధర

**• అధికారులు వస్తేనే ధరలు పెంచుతారు • మండిపడుతున్న రైతులు • కంపెనీల తీరుపై మండిపాటు**



**ఒంగోలు (కలెక్టరేట్), జులై 7 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ఆదేశాలు, మంత్రులు, ఎమ్మెల్యేల సూచనలు, జిల్లా కలెక్టర్ హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలం కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించిన సమయంలో మాత్రమే కొనుగోలు కంపెనీలు ధరలు పెంచుతున్నాయని, వారు వెళ్లిన వెంటనే మళ్లీ ధరలు తగ్గిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఏడాది పొడవునా కష్టపడి పండించిన పొగాకుకు సరైన ధర రాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం పలుమార్లు కొనుగోలు కంపెనీలకు హెచ్చరికలు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు వేలం కేంద్రాల్లో ఉన్న సమయంలో మాత్రమే ధరలు పెరగడం, అనంతరం మళ్లీ తగ్గిపోవడం వెనుక అసలు కారణాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ఇది యాదృచ్ఛికమా, లేక రైతులను నష్టపరిచే విధంగా జరుగుతున్న వ్యవహారమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వయంగా ఆదేశాలు ఇచ్చినా కొనుగోలు సంస్థల వైఖరిలో మార్పు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు అమలవుతున్నాయా లేదా అనే అంశంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వేలం కేంద్రాల్లో అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి ధరల విషయంలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతుల నుంచి నాణ్యమైన పొగాకును కొనుగోలు చేసే విషయంలో కూడా పారదర్శక విధానం పాటించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ధరలు నిర్ణయించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, ఎరువులు, కూలీల వ్యయం, అప్పుల భారంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం మరింత భారంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వేలం కేంద్రాల్లో ధరల నిర్ణయ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, కొనుగోలు కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గిట్టుబాటు ధర కల్పించకపోతే పొగాకు సాగుపై రైతులు ఆసక్తి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా కొనుగోలు విధానంలో సంస్కరణలు తీసుకురావాలని వారు కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కనీస గిట్టుబాటు ధరకు హామీ కల్పించాలని కోరారు. జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రతి వేలం కేంద్రంలో ధరలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించే కొనుగోలు కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతోనే పొగాకు రైతులకు న్యాయం జరిగి వారి కష్టం ఫలిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## 15 నుండి సామాజిక శంఖారావం

**తిరుపతి, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** దళితుల ఆత్మగౌరవం కోసం, కులవివక్ష లేని సమాజం కోసం ఈనెల 15 నుండి చేపట్టనున్న సామాజిక శంఖారావాన్ని జయప్రదం చేయాలని దళిత సోషల్ ముక్తి మంచ్ జాతీయ నాయకుడు వి.శ్రీనివాసరావు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఆగస్టు 15న దళితుల స్వాతంత్రానికి చిహ్నంగా జాతీయ సమైక్యతా దినోత్సవంగా ప్రతి గుడి ముందు జాతీయ జెండా ఎగురవేసి ఆలయ ప్రవేశం చేయాలన్నారు. టిటిడి ఛైర్మన్‌గా, ఇఒగా, ఆలయ పూజారులుగా దళితులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధ్యయన యాత్రలు, ఆందోళనలు, ప్రత్యక్ష కార్యాచరణ రూపాల్లో సామాజిక శంఖారావాన్ని పూరించాలన్నారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి యశోదానగర్లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జిల్లా సామాజిక శంఖారావం సదస్సు నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేష్ అధ్యక్షత వహించగా, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ సామాజిక శంఖారావం కార్యాచరణను వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఆలయాల ముందు జాతీయ జెండాలను ఎగురవేసి, ఆలయ ప్రవేశం చేసి జాతీయ సమైక్యతను చాటాలన్నారు. వివక్షకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులను, యువతను ఎక్కువగా భాగస్వాములను చేయాలన్నారు. కుల వివక్షత పోరాట సమితి (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర నాయకుడు వెంకట్రావు, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు, కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, హేమలత, సాయిలక్షి ్మ, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, పవిత్ర, బాలకృష్ణ, చెంగయ్య, లక్ష ్మయ్య, హరినాథ్, ఎన్ డి శ్రీను పాల్గొన్నారు.

## తిరుపతిలో వైసిపి నేతలపై కేసు

**తిరుపతి, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద వైసిపీ నేతల నిరసనలో భాగంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై ఫిర్యాదు చేసేందుకు వైసిపి నాయకులు యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, వైసిపి కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. వైసిపి చంద్రగిరి ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహా పలువురిపై మంగళవారం ఎస్వీయూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే నెపంతో తిరుపతి ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన వైసిపినాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహా చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, చంద్రమౌలి రెడ్డి, చెవిరెడ్డి రఘుతో పాటు మరో 30 మందికి పైగా వ్యక్తులపై పోలీస్ విధులకు ఆటంకం కల్గించారన్న అభియోగంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## జయలలితకో నాయం? జగన్‌కో న్యాయమా?

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** అక్రమాస్తుల కేసులో జగన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేసారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ పై ఉన్న అక్రమాస్తుల కేసుల విచారణ యేళ్ల తరబడి సాగుతుండటంపై ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. గతంలో ఇటువంటి ఆరోపణలు ఎదుర్కొన్న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత కేసులో ఒకలా, ఎపిలో జగన్ కేసులో మరోలా న్యాయం జరుగుతోందా? అని ప్రశ్నించారు. ఈ కేసుల విచారణలో జరుగుతున్న సుదీర్ఘ జాప్యం చూస్తుంటే న్యాయవ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు లొంగుతోందా? అనే అనుమానం సామాన్య ప్రజల్లో కూడా బలంగా కలుగుతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న అయోధ్య రామాలయ నిర్మాణ అంశంపై కూడా ఆయన స్పందించారు. అయోధ్యలో జరిగిన రామాలయ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల పేరిట వేలాది కోట్ల రూపాయలు వసూలు చేసి భారీ అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు నిజాలు బయటకు రావాలంటే తక్షణమే కేంద్ర ప్రభుత్వం సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## తిరుమల సమాచారం



### ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.11 లక్షలు విరాళం

**తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాల్లో ఎస్వీ ప్రాణదానం కూడా కీలకమైంది. ఈ పథకానికి దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. మంగళవారం సాయంత్రం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన ఎస్‌కె ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు టిటిడి ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు ఈ విరాళాల డిడిని టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## 15 చిత్రాల్లో నటిస్తున్నా..!



**తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుతం 15 చిత్రాల్లో నటిస్తున్నానని, అన్నీ మంచి పాత్రలేనని సీనియర్ నటుడు బాబుమోహన్ తెలిపారు. ఇప్పుడు డ్యాన్స్‌లు వేస్తున్నానని ఆనందంగా చెప్పారు. ఎస్వీ కృష్ణారెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రంలో స్టెప్పులు కూడా వేశానన్నారు. తన చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటానని బాబూమోహన్ పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర స్వామి దయతో 41 సంవత్సరాలుగా నటుడిగా కొనసాగు తున్నానని వెల్లడించారు. బాబూమోహన్ ఆలయంలో అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు. తెలుగు ప్రజలందరికీ శుభాలు కలగాలని, శ్రీవారి ఆశీస్సులుండాలని ఆకాంక్షించారు.

# 14న టిటిడి పాలక మండలి భేటీ

**• పలు కీలక అంశాలపై చర్చించే అవకాశం**



**తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశం ఈనెల 14వ తేదీ మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకునే దిశగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. రానున్న సెప్టెంబర్ నెలలో శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానుండటం, ఆ తరువాత అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తిరుమలలో ఏర్పాట్లు, మాఢవీదుల్లో విస్తృత సౌకర్యాలు కల్పించే అంశాలపై కూలంకుషంగా చర్చించే అవకాశం ఉంది. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు రెండవది. అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి బోర్డు పలు విషయాలపై అజెండా రూపొందించింది. ముఖ్యంగా తిరుమలలో ఎదరవుతున్న 'పార్కింగ్' ఇబ్బందులు ప్రత్యామ్నాయంగా 'మల్టీలెవల్' కార్ పార్కింగ్ సౌకర్యంపై చర్చించనున్నారు. వేంకటేశ్వరస్వామి దర్శనానికి రోజుకు లక్షమంది వరకు భక్తులు, ఐదారువేలకు పైగా యాత్రికుల వాహనాలు, ట్యాక్సీలు ఇలా తిరుమలకు వస్తుండటంతో పార్కింగ్ సమస్య ఎదురవుతోంది. ఇక మినీసచివాలయంగా అలరారుతున్న టిటిడిలో ఉద్యోగాల ఖాళీల భర్తీ విషయంగా కూడా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఏటేటా పదవీవిరమణ చేస్తున్న శాశ్వత ఉద్యోగుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. గతనెలలో ఏకంగా 130 మంది వరకు అన్ని కేడర్‌లలో ఉద్యోగులు, అధికారులు పదవీవిరమణ చేయడం విశేషం. ఈనెలలో కూడా భారీసంఖ్యలోనే ఉద్యోగులు పదవీవిరమణ ఉందని టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. కొన్ని కీలకంగా ఉన్న ముఖ్యమైన విభాగాల్లో పోస్టుల నియామకాలకు సంబంధించి చర్చ చేయనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంతో బాటు తిరుపతి స్థానిక ఆలయాల్లోనూ అర్చకుల కొరత వెంటాడుతోంది. దీనిపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఇలానే ఎదుర్కోవాల్సి వస్తే ప్రత్యామ్నాయ చర్యలు, వరుణ యాగాలు, పారాయణాలు చేపట్టాల్సిన విషయంగా కూడా చర్చకు రానుంది.

# బ్రహ్మోత్సవాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ బస్సులు

**• రిలయన్స్ బృందంతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి**



**తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రిలయన్స్ సంస్థ విరాళంగా అందిస్తున్న విద్యుత్ బస్సులను భక్తులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అన్నారు. రానున్న బ్రహ్మోత్సవాల నాటికి పూర్తిస్థాయిలో తిరుమలలో విద్యుత్ బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం టిటిడి నడుపుతున్న 15 బస్సులతో పాటు అదనంగా మరో పది బస్సుల కోసం మొత్తం 50 బస్సుల సామర్థంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి ఒకేసారి 20 బస్సులు ఛార్జింగ్ అయ్యేలా 10 ఛార్జింగ్ పాయింట్లను అందుబాటులో ఉంచాలని రిలయన్స్ బృందాన్ని కోరారు. రిలయన్స్ సంస్థ టిటిడికి 25 విద్యుత్ బస్సులను విరాళంగా ఇస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు, పవర్ సప్లయ్, డ్రైవర్ల నిర్వహణ, వివిధ మౌలిక సదుపాయాల ఏర్పాటుపై రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో తిరుమలలో పద్మావతి అతిథి గృహంలోని ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,030 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన ఒక్కో బస్సులో 50 మంది సురక్షి తంగా ప్రయాణించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. బస్సులు త్వరగా ఛార్జింగ్ అయ్యేందుకు వీలుగా 2 మెగా వాట్ల సామర్థం కలిగిన ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. బస్సులను నడిపేందుకు 50 మంది నిపుణులైన డ్రైవర్లను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. బస్సులో అధునాతన ప్రయాణికుల సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి రాబోయే బస్టాప్‌ల వివరాలు భక్తులకు తెలిసేలా చర్యలు చేపట్టాలని చేపట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో టిటిడి ఎస్టేట్ అధికారి వేంకటేశ్వర్లు, ఐటీ జిఎం వేంకటేష్ నాయుడు, ఎలక్ట్రికల్ డిఇచంద్ర శేఖర్, రవాణా డిఎం లక్షీ ్మ ప్రసన్న, రిలయన్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ గణేసన్, సీనియర్ జనరల్ మేనేజర్లు

## ప్రశ్న రావణ్ పై ఉపా చట్టం

### సిపిఐ ఆధ్వర్యంలో 10న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టాన్ని మోపటాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నేతలు, మేధావులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొననున్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తూ ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నదన్నారు. ప్రశ్న రావణ్ పై ఇప్పటికే పలు కేసులు నమోదు చేసిన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రమాదకరమైన దేశద్రోహు లపై ప్రయోగించే ఉపా చట్టం మోపటం దుర్మార్గం గుజ్జుల ఈశ్వరయ్య వ్యాఖ్యానించారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం ఎన్టీఆర్ జిల్లా యువతి మృతి



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడుకు చెందిన తెలుగు విద్యార్థిని మృతి చెందింది. మూలపాడు గ్రామానికి చెందిన అట్లూరి ప్రసన్న న్యూయార్క్‌లో జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె ఇటీవల న్యూయార్క్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తుంది. ప్రసన్న తన స్నేహితులతో కలిసి కారులో సమీపంలోని ఆలయానికి వెళుతోంది. మార్గమధ్యంలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వారి వాహనం ఆగి ఉండగా, వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ప్రసన్నతో పాటు మరో యువతి కూడా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కారులో ఉన్న మూడో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రసన్న ఇటీవలే న్యూయార్క్‌లోని పేస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ఆమె ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే విధి వక్రించి ప్రమాదం రూపంలో ఆమెను మృత్యువు కబళించింది. ప్రసన్న మరణవార్త తెలియడంతో ఆమె స్వగ్రామం మూలపాడులో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీర వుతున్నారు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. అయితే సమాచారం ఆలస్యంగా అందింది. మృతదేహం తరలింపుపై ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.




# తిరుపతిలో కొత్తరకం నేరాలు

**- ద్విచక్రవాహనంపై పడిపోతున్నట్లు నటన**
**- సాయంచేసే వారి సెల్‌ఫోన్‌ల అపహరణ**

**తిరుపతి, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** స్మార్ట్‌సిటీ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో కొత్తరకం నేరాలకు పాల్పడేలా కొందరు ముఠా తయారయ్యారు. ఇదివరకు ద్విచక్ర వాహనాల్లో వెళ్ళే వారిని వెంబడించడం, వారి మెడల్లోని బంగారు గొలుసులు లాక్కెడం వంటి ఘటనలు జరిగేవి. నగరంలో పలుచోట్ల ఇళ్ళ ముందు ఉండే మహిళలను చిరునామాలు అడగడం, ఆ తరువాత మత్తుమందుచల్లి బంగారు నగలు దోచుకోవడం జరిగేది. ఇప్పుడు సులభంగా సెల్‌ఫోన్‌లను కొట్టేసే ఘటనలకు పాల్పడుతున్నారు. ఈ కొత్త తరహాలో చోరీలకు పాల్పడుతున్న ముఠా తిరుపతి నగరంలోకి దిగింది. రోడ్లపై వెళుతూ ద్విచక్ర వాహనాన్ని అదుపు తప్పినట్లు చేసి సాయం కోరినట్లు నటిస్తూ చేసిన సహాయానికి వచ్చిన వ్యక్తి నుండి జేబుల్లోంచి సెల్‌ఫోన్‌లు అపహరిస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల నగరంలోని తూర్పు పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరాగిపట్టెడలో ఆదివారం మధ్యాహ్నం పట్ట పగలే రూ.1.50 లక్షలు విలువచేసే ఫోన్ అపహరించుకెళ్ళారు. ఆ ప్రాంతంలోని సిసికెమెరా ఫుటేజ్‌లో రికార్డ్ అయిన దృశ్యాలను పోలీసులు గమనించారు. ఇక సోమవారం సాయంత్రం తిరుపతి-మంగళం రోడ్డులోని బొంతాలమ్మ గుడి వద్ద అదే తరహాలో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాన్ని కిందపడిపోతున్నట్లు నటిస్తూ సాయంగా వచ్చిన వ్యక్తి జేబులోని రూ.25వేల విలువైన ఫోన్ చోరీ చేసుకెళ్ళారు. మంగళవారం ఉదయం తిరుపతి అన్నారావు సర్కిల్ వద్ద అదే తరహాలో మరో రెండు ఫోన్లు చోరీ చేసుకెళ్ళారు. నగరంలో ఇదో కొత్త తరహాలో చోరీలకు పాల్పడుతూ నేరస్తులు పోలీసులకు సవాల్ చేస్తున్నారు. ఇలా నగరంలో ఎంతమంది గ్యాంగ్‌లు వచ్చారనేది ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి తరహాల నేరాలకు ఇంకా ఎంతమంది గురికావలసి వస్తుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

8-7Pg7exHMNWJQEBPGOL_8-7Pg7exHMNWJQEBPGOL.qxd 07/Jul/26 11:53 PM Page 1



# పోలీసు స్టేషన్ ముందే ఆత్మహత్యాయత్నం

- సిఐ వేధింపులే కారణమని బంధువుల ఆరోపణలు
- మహిళలతో దురుసుగా ప్రవర్తించారంటూ ఆగ్రహం



**ఆస్పరి, జులై 7 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా ఆస్పరి పోలీసు స్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఘటన తీవ్ర కలకలం రేపింది. బిల్లేకల్లు గ్రామానికి చెందిన హనుమంతురెడ్డి అనే వ్యక్తి కేసు విచారణ పేరుతో సి.ఐ. శ్రీనివాస్ నాయక్ తనను తీవ్రంగా వేధిస్తున్నాడని ఆరోపిస్తూ పోలీసు స్టేషన్‌లోనే పురుగుల మందు త్రాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. భాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం నెల రోజుల క్రితం గ్రామంలో వాల్మీకి, ఈడిగ సామాజిక వర్గాలకు చెందిన రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో హనుమంతరెడ్డి ప్రమేయం ఉందనే అనుమానంతో పోలీసులు పలుమార్లు విచారణకు పిలిపించారని తెలిపారు. ఆస్పరిలోని పోలీసు క్వార్టర్స్‌లో మూడు రోజుల పాటు నిర్భంధించి చిత్ర హింసలకు గురి చేయడంతో పాటుడబ్బులు కూడా డిమాండ్ చేశారని వారు ఆరోపించారు. ప్రస్తుతం ఆస్పరి సొసైటిలో జరిగిన అవినీతి అక్రమాలపై సింగిల్ విండో సీఈఓ నరసింహులు ఇచ్చిన కేసు విచారణ పేరుతో మూడు రోజుల క్రితం కూడా స్టేషన్‌కు రప్పించి తీవ్రంగా కొట్టారని వారు పేర్కొన్నారు. మంగళవారం మరోసారి స్టేషన్‌కు రావాలని సమాచారం అందడంతో మళ్ళీ వేధింపులకు గురిఅవుతాననే భయంతో తీవ్ర మనస్తాపానికి గురై హనుమంతురెడ్డి పోలీసు స్టేషన్‌లోనే పురుగుల మందు తాగినట్లు బంధువులు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతన్ని అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం 108 అంబులెన్స్‌లో ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జరిగిన ఘటనపై ఆరా తీసేందుకు పోలీసు స్టేషన్‌కు వెళ్ళిన మహిళలతో సి.ఐ. దురుసుగా ప్రవర్తించాడని భాధితుడి సభ్యులు ఆరోపించారు. మహిళల చీరలను లాఠీతో లాగుతూ అసభ్య పదజాలంతో దూషించాడని వారు వాపోయారు. ఈ ఘటనతో భాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ఆంధోళనకు దిగారు. విచారణ పేరుతో పోలీసుల వేధింపులే ఈ ఘటనకు కారణమరని ఆరోపిస్తు ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా బాధిత కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై పోలీసుశాఖ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరిస్తున్నట్లు సమాచారం.

## దుర్గమ్మ గుడిలో శాకంబరి ఉత్సవాలు

- 27 నుండి 29 వరకు వేడుకలు



**ఇంద్రకీలాద్రి, జులై 7 ప్రభాతవార్త:** దుర్గమ్మ శాకంబరి మాతగా ఈనెల 27 నుండి 29 వరకు మూడు రోజుల పాటు భక్తులను అనుగ్రహించనున్నారు. సకలలోకాలు క్షామంతో పీడితగ్రస్తమై బాధపడుతుండగా వారిని అనుగ్రహించడానికి శ్రీ అమ్మవారు శాకంబరిగా అవతరించి వారి క్షుద్బాధను తీర్చినందున భక్తులు శ్రీ అమ్మవారిని శాకంబరి మాతగా కొలుస్తుంటారు. శాకంబరి మాతను దర్శించుకుంటే కరువు కాటకాలు తొలగి, సుఖసంతోషాలు కలుగుతాయని వేదపురాణాల వచనం ప్రకారం ఈ ఉత్సవాలను దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్, పాలకమండలి, అధికారులు ఉత్సవ పత్రికను ఆవిష్కరించారు. అలాగే ఈనెల 15 నుండి ఆగస్టు 12 వరకు దుర్గమ్మ ఆలయంలో ఆషాఢమాస ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

**పలు తీర్మానాల ఆమోదం:** పాలక మండలి సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించినట్లు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మ ఆలయంలో 2లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్‌ట్యాంక్ నిర్మాణం, పైపు లైన్ ఏర్పాటుకోసం తీర్మానం ఆమోదించారు. ఆలయంలో వినియోగిస్తున్న మారుతి అంబులెన్స్ వేలంలో హెచ్చుపాటపాడిన తాడేపల్లికి చెందిన గౌరిశంకర్ మోహన్‌రావుకు పాట ఆమోదించారు. దేవస్థానంలో పలు ఆదాయ వ్యయాల వివరాలను పాలకమండలి సమావేశంలో ఆమోదించారు. రు.3,25,000 అంచనాలతో పోరంకి వేదపాఠశాలలో బోరు వేయుటకు ఆమోదం తెలిపారు. దేవస్థానంకు కొత్త సెక్యూరిటీ ఏజెన్సీ టటెండరు పిలుచుటకు ఆమోదం తెలిపారు. రు.3,75,000ల అంచనాతో సింగ్‌నగర్‌లో వున్న 1.98సెంట్ల దేవస్థాన భూమిలో బోరు వేయుటకు ఆమోదం, సివిరెడ్డి గెస్ట్‌హౌస్, మాడపాటి గెస్ట్‌హౌస్‌లో సమగ్ర వర్షపునీటి సంరక్షణకు రు.40లక్షలతో వ్యవస్థ ఏఆర్పాటుకు ఆమోదం, కొత్త క్యూలైన్ల ప్రేమ్‌ల టెండర్ ఆమోదం, కేశఖండనశాల నిర్వహణకు టెండరు ఆమోదం, మహామండపం లిఫ్టులు, నిత్యాన్నదాన భవనం వద్ద ఆర్‌సిసి డ్రైన్ ఏర్పాటుకు టెండర్లు ఆమోదం, శ్రీ అమ్మవారికి భక్తులందించిన వడిబియ్యం, దసరా, భవానీ దీక్షలకు వచ్చు ఇరుముడి బియ్యం కొనుగోలుకు లైసెన్సు టెండర్ ఆమోదం, రు.40లక్షలతో కొండపై షామియానాలు, కార్పెట్లు సప్లయ్ చేయడానికి టెండర్ ఆమోదం తెలిపారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మ భక్తులు మంగళవారం మొత్తం నలుగురు విరాళాలు అందించారు. నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విజయవాడకు చెందిన పోతిన బెసి కంటేశ్వరుడు, నిర్మలాదేవి దంపతులు మరియు కుమారులు పోతిన దుర్గ వెంకటేష్ పోతిన బాల వర్ధన్‌లు రు.1,00,016ల విరాళం చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. విజయవాడకు చెందిన జగదీశ్వరి, కూతురు ప్రత్యూష వారి అల్లుడు రవీంద్ర పేరున అమ్మవారి నిత్య అన్నదాన విభాగమునకు రూ.2లక్షల విరాళము అందించారు. శ్రీఅమ్మవారి ప్రతిరోజు ఉచిత ప్రసాదం విభాగమునకు గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన సానా శ్రీనివాసరావు రు.1లక్ష విరాళం అందించారు. నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పి రవిచంద్ర, వారి కుటుంబ సభ్యులు రు.1లక్ష విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతులు

- 117 కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్లు
- వచ్చే వారం సిఎం చేతుల మీదుగా పనుల ప్రారంభం
- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త:** ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతులు,117 కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్లతో పనులను ప్రారంభిస్తున్నామని, వచ్చే వారం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు జల వనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం ధవళేశ్వరం బ్యారేజ్‌పై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, రాష్ట్రానికి జలవనరుల శాఖ అత్యంత కీలకమని అన్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ రంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో రూ.18 వేల కోట్ల బిల్లులు బకాయిలుగా మిగిలాయని ఆరోపించారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించి ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెడుతోంద న్నారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల పరిస్థితిపై నిపుణులు హెచ్చరించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఫలితంగా 2024లో 19వ గేటు కొట్టుకుపోయి 105 టీఎంసీల నీరు వృథా అయిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వేగంగా స్పందించి గేటును పునర్నిర్మించి 80 టీఎంసీల నీటిని కాపాడిందని వివరించారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు రూ.250 కోట్లు కేటాయించి పనులు చేపట్టగా, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల పనులను కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ గోదావరి జిల్లాల జీవనాడి అని, దీని ద్వారా తాగునీటితో పాటు సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. బ్యారేజీ గేట్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని నిపుణులు హెచ్చరించినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. 2015లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో 175 గేట్లలో 58 గేట్లను రూ.32 కోట్లతో మార్చిన విషయాన్ని గుర్తుచేసిన మంత్రి, ఇప్పుడు మిగిలిన117 గేట్లను రూ.150 కోట్లతో పూర్తిగా పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే సాగు సీజన్ నాటికి ఈ పనులను పూర్తి చేయడమే లక్ష్యమన్నారు.

గోదావరి జిల్లాల రైతులకు భద్రత, భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి విడుదల చేసిన 36 ప్రాజెక్టుల ఇరిగేషన్ క్యాలెండర్‌లో గోదావరి డెల్టా ఆధునికీకరణ కూడా ఉందన్నారు. ఉమ్మడి ఐదు గోదావరి జిల్లాల్లో డ్రెయిన్లు, కాలువల వ్యవస్థను రూ.14 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన మెరుగుపరుస్తామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో, ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 'జలధార–జలహారతి' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిపాదించి అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. నీటి వనరుల సమర్థ నిర్వహణ, సాగునీటి భద్రత, తాగునీటి లభ్యతను నిరంతరం మెరుగుపరచాలనే ప్రభుత్వ నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. మంత్రి వెంట ఇరిగేషన్

# గీత కార్మికుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- మద్యం దుకాణాలు, బార్లలో 10 శాతం రిజర్వేషన్
- లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ: మంత్రి కొల్లు రవీంద్ర



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యంగా గీత కార్మికులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం పలు కీలక నిర్ణయాలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భశాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఇతర కూటమి నాయకులతో కలిసి మంత్రి మాట్లాడారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ క్రమంలో గీత కులాలైన శెట్టిబలిజ, గౌడ, యాత, శ్రీశయన వర్గాల ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నూతన మద్యం విధానంలో మద్యం దుకాణాల కేటాయింపులో 10 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. బార్ల కేటాయింపు లోనూ 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గీత కార్మికుల సామాజిక భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, చెట్లపై నుంచి పడి ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు కార్మిక శాఖ నుంచి రూ.5 లక్షలు, ఎక్సైజ్ శాఖ నుంచి రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 33 కేసులకు త్వరలోనే పరిహారం అందించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులకు పెన్షన్ అందించడం తమ ప్రభుత్వ విశిష్ట కార్యక్రమమని పేర్కొన్నారు. పోలవరం జిల్లాలోని పందిరిమామిడి ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించినట్లు మంత్రి తెలిపారు. అక్కడ సుమారు 200 రకాల తాటి జాతులపై పరిశోధనలు కొనసాగు తున్నాయని, నీరా పానీయం ఉత్పత్తి, నిల్వ, కోల్డ్‌చైన్ ఏర్పాటుతో పాటు బెల్లం, పౌడర్, స్పిరిట్, స్వీట్నర్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై పరిశోధనలు జరుగుతు న్నాయని చెప్పారు. వీటిని అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం చేసి గీత కార్మికులకు మెరుగైన ఆదాయం అందేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి గోవా, కేరళ తరహాలో విశాఖపట్నం, సూర్యలంక తీర ప్రాంతాల్లో బీచ్ షాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్టార్ హోటళ్లతో అనుసంధానించి, పర్యాటకాభివృద్ధికి తోడ్పడేలా ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. అలాగే రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధాన ప్రయోజనాలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా ప్రజలకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను కోరారు.

## ప్రతి ఆనకట్ట తనిఖీకి సర్కార్ నిర్ణయం

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలోని ప్రతి ఆనకట్టను తనిఖీ చేయాలని జలవనరుల శాఖ నిర్ణయం తీసుకుంది. 151 ఆనకట్టల భద్రత మదింపుకు కమిటీ చైర్మన్లుగా జలవనరుల నిపుణులను నియమించింది. ఈ కమిటీ చైర్మన్లుగా అక్షయ్‌కుమార్ దాస్, పి.రామచంద్రరావు, ఎం.కె.శ్రీనివాస్, ఎ.కె.గంజు నియమించారు. కమిటీ చైర్మన్లుగా ఎ.కె.బజాజ్, అల్వాల్ పరమేశం, జె.చంద్రశేఖర్ అయ్యర్, ఎస్.కె.శ్రీవాత్సవ నియమితులయ్యారు.

## 9న బనగానపల్లెకు సిఎం చంద్రబాబు

### 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమానికి హాజరు

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** మీ భూమి మీహక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 9 తేదీన నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. రీ సర్వే ప్రక్రియ పూర్తైన గ్రామాల్లోని రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 9న రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసే పట్టాదారు పాస్ పుస్తకాలతో కలిపి ఇప్పటి వరకూ ప్రభుత్వం 29 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్టు అవుతుంది. ఇప్పటివరకు 6,887 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసి 29.04 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం ముద్రించి పంపిణీ చేసింది. ఈ నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 428 గ్రామాల్లో 2.48 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాల పరిశీలనను రెవెన్యూ శాఖ పూర్తి చేసింది. నంద్యాల జిల్లాలో 8,412 ఖాతా పుస్తకాలు, బనగానపల్లె నియోజకవర్గంలోని 1,125 పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 9,929 గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇంకా 64.53 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. మీ భూమి మీ హక్కు సమావేశం అనంతరం బనగానపల్లె పార్టీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ఈ నెల 9 తేదీన ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బనగానపల్లెకు ముఖ్యమంత్రి బయల్దేరి వెళ్లనున్నారు. 11.20కి బనగానపల్లె చేరుకుని స్థానిక తహసిల్దారు కార్యాలయానికి వెళ్లనున్న ముఖ్యమంత్రి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను నేరుగా పరిశీలించనున్నారు. అలాగే పలువురు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు మీ భూమి మీ హక్కు పేరిట పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.35 గంటలకు బనగానపల్లె నియోజకవర్గ టిడిపి కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటల తర్వాత

## జనసేన పార్టీలో చేరిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గుడిపాటి సీతారాం, భార్య, యువ గాయని శ్రీలలిత



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గుడిపాటి సీతారాం జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీతారాం భార్య, యువ గాయని శ్రీలలిత కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడిపాటి సీతారాం మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ ఖిదేశమే ప్రథమంఖి అనే దృక్పథంతో పనిచేస్తున్నారని, ఆయన నాయకత్వ స్ఫూర్తితోనే తాను జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు, పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. గుడిపాటి ఫౌండేషన్ ఛైర్మన్‌గా సీతారాం క్రీడలు, యువజన అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ క్రీడా రంగంలో తనదైన గుర్తింపు పొందారు. ఆయన చేరికతో కృష్ణా జిల్లాలో జనసేన పార్టీకి క్రీడా, వ్యాపార వర్గాల నుంచి మరింత మద్దతు లభిస్తుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సీతారాం పార్టీలో చేరడం పట్ల జనసేన శ్రేణులు, సోషల్ మీడియా వేదికగా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తిరుపతిలో శరభయ్య విగ్రహం ప్రతిష్టిస్తాం

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్



**తిరుపతి (హెల్త్), జులై 7 ప్రభాతవార్త:** తిరుపతిలో సన్నిధి గొల్ల శరభయ్య యాదవ్ విగ్రహం తిరుమలలో ఏర్పాటు చేయాలనే నినాదంతో యాదవు లంతా మీటింగులు, ర్యాలీలు నిర్వహించడం జరిగిందని, యాదవులంతా ఒకతాటిపై రావడం గర్వకారణమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా ఉన్న యాదవుల మనోభావాలకు సంబంధించి యాదవ కార్పొరేషన్ చైర్మన్ అయిన 17.4.2025 విజయవాడలో జరిగిన మొదటి సమావేశంలోనే తిరుమలలో శరభయ్య యాదవ్ విగ్రహం పెట్టాలని, శరభయ్య యాదవ్ పేరుపైన మఠం ఏర్పాటు చేయాలని, తిరుమలలో బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసి తిరుమలలో ఒక్క వీధికి శరభయ్య యాదవ్ పేరు నామకరణం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. తిరుపతిలో నిర్మిస్తున్న యాదవ్ భవన్ నిర్మాణానికి యువతకు అందరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. తిరుపతి ప్రశాంతతను దెబ్బ తీసే విధంగా వైసీపీ నాయకులు కుట్రలు చేస్తుందన్నారని ఆరోపించారు.

## ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే

# రావణ్ అరెస్ట్ డ్రామా



**నెల్లూరు(వైద్యం), జులై 7 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే రావణ్ అరెస్ట్ డ్రామా ఆడుతున్నారని, ఉపా చట్టం ప్రయోగంపై దేశవ్యాప్తంగా భారీ వ్యతిరేకతను చూపుస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరులోని వైయస్సార్సీపీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు పరాకాష్ట రావణ్ అరెస్ట్ చేసారని శాంతిభద్రతల వైఫల్యాలు, కస్టోడియల్ డెత్స్ నుంచి డైవర్షన్ పాలిటిక్స్ కూటమి ప్రభుత్వం కొత్త డ్రామాలకు తెరలేపారన్నారు. రావణ్ వ్యాఖ్యలతో మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదు కానీ ఉపా చట్టం ప్రయోగించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయని, పోలీస్ స్టేషన్లలో లాకప్ డెత్‌లు, శవాల మాయం వంటి అరాచకాలు రాజ్యమేలుతున్నాయని గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాయికృష్ణ, క్రాంతి కుమార్ వంటి బాధితుల కస్టోడియల్ మరణాలపై తాము చట్టాన్ని, పోలీసు వ్యవస్థను ప్రశ్నిస్తుంటే, ఆ పరిపాలనా వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చంద్రబాబు నాయుడు అత్యంత చాకచక్యంగా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని గోవర్ధన్ రెడ్డి మండిపడ్డారు.

## కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే వ్యక్తులను ప్రోత్సహిస్తారా జగన్

**నెల్లూరు, జులై 7 ప్రభాతవార్త:** హిందూ ధర్మానికి, దేవుళ్ళకు అవమానం జరిగితే స్పందించాల్సిన బాధ్యత సాటి భారతీయుడిగా తనకు ఉందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈరోజు హిందువులపై మాట్లాడాడు, రేపు క్రిస్టియన్, ముస్లింలపై మాట్లాడడని మీరు గ్యారెంటీ ఇస్తారా జగన్ రెడ్డి? హిందూ దేవుళ్లపై, సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులను మీరు ఎలా సమర్థిస్తారు? అని ప్రశ్నించారు. ప్రజా జీవితంలో జగన్ రెడ్డి కొనసాగాలంటే కోట్లాదిమంది భారతీయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాను ఎమ్మెల్యేగా కాకుండా ఓ సామాన్య భారతీయుడుగా మాట్లాడుతున్నా, తాను భారతీయుడిని, హిందువుని. పరామతాలతో కలిసి నడిచే ధర్మం హిందూ ధర్మం నేర్పింది. అన్ని కులాలు, మతాలను గౌరవించే వ్యక్తిని నేను. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు మాట్లాడా. క్రిస్టియన్‌లకి అండగా ఉన్నా. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తులకు జగన్ మద్దతు ఇస్తుంటే మాట్లాడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. హిందూ మత విశ్వాసలపై మాటల దాడులు చేస్తున్న జోసఫ్ ప్రశ్న రావణ్‌ని ఎలా సమర్థిస్తారు జగన్ రెడ్డి అని నిలదీశారు. దేవుళ్ళని నమ్మడం, నమ్మకపోవడం వారి ఇష్టం. దేవుళ్ళని తిట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారు. జోసఫ్ ప్రశ్న రావణ్ మాట్లాడిన మాటలు విన్నారా. రాముడిని, రామాయణాన్ని, మహా భారతాన్ని జోసఫ్ రావన్ మాట్లాడిన మాటలు విని జగన్ రెడ్డి ఎలా సమర్థిస్తారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నిలదీశారు.

## కొడుకును హత్య చేసి.. తండ్రి ఆత్మహత్య

**కంభం (అర్ధవీడు), జులై 7 ప్రభాతవార్త:** ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న కొడుకును మద్యం మత్తులో ఉన్న తండ్రి హత్య చేసి, అనంతరం తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మార్కాపురం జిల్లా అర్ధవీడు మండలం మిట్టమీదపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు మిట్టమీదిపల్లె గ్రామానికి చెందిన పఠాన్ శిలార్ (55)కు గ్రామంలో చిన్న, చిన్న పనులు చేసుకుంటూ మద్యానికి బానిస అయ్యాడు. పెద్ద కుమారుడు ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ చేస్తుండగా, తల్లి రోజు కూలికి వెళ్లి వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్న కుమారుడు పఠాన్ జావేద్ (25) ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నం చేసి వయస్సు మీరడంతో ఏ పని చేయక ఖాళీగా ఉంటుండగా ఈ విషయంలో తండ్రి, కొడుకుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. మూడు రోజుల క్రితం తండ్రీ, కొడుకుల మధ్య వివాదం జరిగినట్లు తెలిసింది. కాగా మంగళవారం పఠాన్ జావిద్ ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా మద్యం సేవించి ఇంటికి వచ్చిన తండ్రి పఠాన్ శిలార్ కోపంతో ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో కుమారుడు జావీద్ తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన జావేదును కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు దృవీకరించారు. ఈ విషయం తెలిసిన తండ్రి పఠాన్ శిలార్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ కుటుంబం తీవ్ర విషాదం లో మునిగింది. విషయం తెలుసుకున్న కంభం సీఐ మల్లికార్జున, అర్ధవీడు ఎస్ఐ నాంచారయ్యలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జగన్ మా నాయకుడు.. అసత్య ప్రచారం నమ్మొద్దు: మాజీ ఎంపి మేకపాటి



**నెల్లూరు(వైద్యం), జులై 7 ప్రభాతవార్త:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామని, ఆయన వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితోనే మా పయనం.. ఎన్ని అపోహలు సృష్టించిన.. మా నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి అని మాజీ పార్లమెంట్ సభ్యుడు మేకపాటి రాజమోహన్ రెడ్డి పేర్కొన్నారు. తాను అనారోగ్యం కారణంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేకపోతున్న అంతే తప్ప ఎలాంటి అపోహలకు తావు లేదని ఆయన స్పష్టం చేశారు. తాము పార్టీ మారుతున్నామని వస్తున్న వార్తల్లో నిజం లేదని మంగళవారం రాజమోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి సత్యదూర ప్రచారాన్ని ప్రజలు, తమ అభిమానులు నమ్మవద్దని సూచించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పట్ల ప్రజల్లో సంపూర్ణ నమ్మకం, విశ్వాసం ఉందని, రాష్ట్ర భవిష్యత్తు ఆయనతోనేనని.. జగన్ వెంట నడవడం తాము అదృష్టంగా భావిస్తున్నామని.. త్వరలోనే ప్రజా పోరాటానికి శ్రీకారం చుడతామని రాజమోహన్ రెడ్డి వెల్లడించారు. తమను సంప్రదించకుండా నిరాధార ప్రచారం చేయడం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. మేకపాటి కుటుంబం ఇప్పటికీ ఎప్పటికీ.. జగన్ వెంటే నడుస్తుందని తెలిపారు.

08-07pg10_08-07pg10.qxd 07/Jul/26 11:57 PM Page 1



# రొనాల్డో కల చెదిరె.. పోర్చుగల్ కథ ముగిసె

## అమెరికా ఖేల్ ఖతమ్ * క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్, బెల్జియం


పోర్చుగల్ జీరో క్రిస్టియానో రొనాల్డో

**డల్లాస్, జులై 7:** సాకర్ ప్రపంచకప్‌లో మరో సంచలనం నమోదైంది. యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ ఏకైక గోల్‌తో హాట్ ఫేవరెట్ పోర్చుగల్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. చివరి నిమిషాల్లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మికెల్ మెరినో అద్భుత గోల్‌తో పోర్చుగల్ కథ ముగిసింది. దీంతో కప్పు కల నెరవేరకుండా ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ప్రపంచకప్ వీడాడు. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌కు కన్నీటితో వీడ్కోలు పలికాడు. ఆరు ప్రపంచకప్ ఎడిషన్ల పాటు సాగిన రొనాల్డో సుదీర్ఘ ప్రస్థానానికి తెరపడింది.

మ్యాచ్ ఆరంభం నుంచే పోర్చుగల్, స్పెయిన్ మధ్య మైండ్ గేమ్ ప్రారంభమైంది. 4వ నిమిషంలోనే స్పెయిన్ ఫార్వర్డ్ మికేల్ ఓయర్జబల్ గోల్ ప్రయత్నాన్ని పోర్చుగల్ గోల్ కీపర్ డియోగో కోస్టా అడ్డుకున్నాడు. కాసేపటికే పెడ్రో నెటో రైట్ వింగ్ నుంచి ఇచ్చిన అద్భుతమైన క్రాస్‌ను ఫెలిక్స్ అడ్డుకుని రొనాల్డో వైపు మళ్లించాడు. రొనాల్డో గాల్లోనే బంతిని హుక్ చేస్తూ గోల్ వైపు కొట్టగా స్పెయిన్ గోల్ కీపర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఇరు జట్లు 0-0తో సమంగా నిలిచాయి.

**పోర్చుగల్ బ్యాడ్‌లక్**

రెండో అర్ధభాగంలో స్పెయిన్ ఆటగాడు దాని ఓల్మో ఫౌల్ చేయడంతో పోర్చుగల్‌కు ఫ్రీకిక్ లభించింది. అయితే బ్రూనో ఫెర్నాండెజ్ కొట్టిన షాట్ నేరుగా కీపర్ సిమోన్ చేతుల్లోకి వెళ్లింది. 59వ నిమిషంలో రొనాల్డోకు మరో సువర్ణావకాశం లభించింది. జోవా ఫెలిక్స్ డిఫెండర్లను దాటుకుంటూ బంతిని బ్యాక్ పోస్ట్ వైపు చిప్ చేశాడు. రొనాల్డో అక్కడ షాట్ కొట్టడానికి ప్రయత్నించాడు, కానీ బంతి అతని కాలికి సరిగ్గా కనెక్ట్ కాకపోవడంతో వైడ్‌గా వెళ్లింది.

**ఇంజ్యూరీ టైమ్‌లో సబ్‌స్టిట్యూట్ల మ్యాజిక్**

ఇక ఇంజ్యూరీ టైమ్ ప్రారంభమైన కొన్ని సెకన్లలోనే స్పెయిన్ మేనేజర్ వ్యూహాత్మకంగా మైదానంలోకి పంపిన సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు అద్భుతం చేశారు. స్పెయిన్ ఆటగాడు ఫాబియన్ రూయిజ్ బంతిని సబ్‌స్టిట్యూట్ ఆటగాడు ఫెర్రాన్ టోరెస్ వైపు పంపాడు. టోరెస్ దాన్ని తిరిగి బంతిని బాక్స్‌లో ఉన్న మరో సబ్‌స్టిట్యూట్ మికెల్ మెరినోకు పాస్ చేశాడు. మెరినో ఎలాంటి పొరపాటు చేయకుండా, బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ఈ గోల్‌తో స్పెయిన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లడంతో కాకుండా పోర్చుగల్ ఆశలపై నీళ్లు చల్లింది..

**ముగిసిన ఆతిథ్యదేశాల ఆట**

ఫిఫా ప్రపంచకప్‌కు ఆతిథ్యమిస్తున్న దేశాల ఆట ముగిసింది. ప్రీక్వార్టర్ ఫైనల్ చేరిన కెనడా, మెక్సికో ఇప్పటికే ఓటములతో నిష్క్రమించగా, తాజాగా అమెరికా కూడా అదే దారి పట్టింది. సహ ఆతిథ్య దేశం అమెరికాపై బెల్జియం 4-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

**ఆరంభం నుంచే బెల్జియం ఆధిక్యం**

మ్యాచ్ ప్రారంభం నుంచే బెల్జియం ఆధిపత్యం చెలాయించింది. 9వ నిమిషంలో ట్రాస్ కె కెబెలార్ గోల్ చేసి బెల్జియంకు తొలి ఆధిక్యం అందించాడు. 31వ నిమిషంలో మాలిక్ టిల్‌మన్ ఫ్రీ కిక్ ద్వారా అద్భుత గోల్ చేసి అమెరికాను 1-1తో సమవుజ్జీగా నిలిపాడు. అయితే అమెరికా ఆనందం ఎంతో సేపు నిలవలేదు. కేవలం రెండు నిమిషాలకే బెల్జియం మరో గోల్ చేసి మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లింది.

**కొనసాగిన అమెరికా తప్పిదాలు**

రెండో అర్ధభాగంలో కూడా అమెరికా తప్పిదాలు కొనసాగాయి. 57వ నిమిషంలో గోల్‌కీపర్ మ్యాట్ ఫ్రీస్ పెనాల్టీ ప్రాంతం బయటకు వచ్చి లాంగ్ బాల్‌ను అందుకునే ప్రయత్నంలో బంతిని కోల్పోవడంతో హాన్స్ వానాకెన్ ఖాళీ గోల్‌లోకి సులభంగా బంతిని పంపించాడు. అదనపు సమయంలో లుకాకు మరో గోల్ చేయడంతో బెల్జియం 4-1తో మ్యాచ్‌ను ముగించింది. ప్రపంచకప్‌లో ముందంజ వేసింది. క్వార్టర్‌ఫైనల్లో స్పెయిన్‌తో తలపడనుంది.


స్పెయిన్ హీరో మికెల్ మెరినో

# వింబుల్డన్ సెమీస్‌లో సినర్, కోకో గాఫ్


**లండన్, జులై 7:** వింబుల్డన్ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ జానిక్ సినర్, మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ సెమీఫైనల్స్ ప్రవేశించారు. జపాన్ దాల్ నయోమి ఒసాకా క్వార్టర్ ఫైనల్స్‌లోనే వెనుదిరిగింది. క్వార్టర్ ఫైనల్లో సినర్...జాన్‌లెన్నార్డ్ స్ట్రఫ్ యొక్క అద్భుతమైన ప్రయాణానికి ముగింపు పలికాడు. మూడు సెట్ల పోరులో 7-5, 7-6, 6-3తో గెలుపొందాడు. నాలుగుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ సినర్ శక్తివంతమైన సర్వ్‌లతో విరుచుకుపడి స్ట్రఫ్‌ను కట్టడి చేశాడు. దీంతో అతను తన 10వ గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్‌కు, వింబుల్డన్‌లో మూడో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ 4-6, 6-3, 6-3తో తోటి అమెరికన్ జెస్సికా పెగులాపై గెలిచి మొదటిసారి వింబుల్డన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. సెంటర్ కోర్టులో జరిగిన ఈ ఆల్‌అమెరికన్ పోరులో తొలి సెట్ ఓడినా ఆ తర్వాత పుంజుకుని వరుసగా రెండు సెట్లను కైవసం చేసుకుంది.

**క్వార్టర్ ఫైనల్లో అలెగ్జాండర్ జ్వెరెవ్**

రెండు రోజుల పాటు సాగిన పురుషుల నాలుగో రౌండ్‌లో రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-4, 7-5, 3-6, 7-6తో 14వ సీడ్ జిరి లెహెకాపై నెగ్గి తొలిసారిగా వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. జ్వెరెవ్ 6-4, 7-5, 3-3తో ఆధిక్యంలో ఉన్నప్పుడు చీకటి కారణంగా ఆటను నిలిపివేశారు. మంగళవారం తిరిగి ప్రారంభమైనప్పుడు లెహెకా పుంజుకున్నప్పటికీ, జ్వెరెవ్ దూకుడు చూపి నెగ్గాడు.







# మెస్సీ మ్యాజిక్: క్వార్టర్స్‌లో అర్జెంటీనా

**న్యూయార్క్, జులై 7:** డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వరుసగా రెండో కప్ అందుకునే దిశగా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈజిప్ట్‌తో జరిగిన ప్రి క్వార్టర్ ఫైనల్లో మెస్సీ మ్యాజిక్ చేశాడు. ఓటమి ఖాయమనుకున్న దశ నుంచి అర్జెంటీనాను గెలుపు తీరాలపై నిలిపాడు. 3-2 గోల్స్ తేడాతో విజయాన్ని అందించాడు. మ్యాచ్ ఆరంభంలోనే ఈజిప్ట్ ఆధిక్యం చాటి ఝలక్ ఇచ్చింది. 15వ నిమిషంలో యాసర్ ఇబ్రహీం హెడర్‌తో గోల్ సాధించాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి ఈజిప్ట్ 1-0 ఆధిక్యంతో నిలిచింది. రెండో అర్ధభాగంలో మరో గోల్ చేసింది. 67వ నిమిషంలో ముస్తాఫా జికో గోల్ చేసి ఈజిప్ట్ ఆధిక్యాన్ని 2-0కు చేర్చాడు. ఇక మ్యాచ్ చివరి దశకు చేరుకుంటున్న దశలో మెస్సీ మ్యాజిక్ చేశాడు. నాలుగు నిమిషాల్లో రెండు గోల్స్ సాధించడంలో కీ రోల్ పోషించాడు. 79వ నిమిషంలో మెస్సీ అందించిన పాస్‌ను రొమెరో గోల్‌గా మలచగా, 83వ నిమిషంలో స్వయంగా మెస్సీ గోల్ సాధించాడు. ఈ ప్రపంచకప్‌లో మెస్సీకి ఇది ఎనిమిదో గోల్. కాగా ఇంజ్యూరీ టైమ్ ఆరంభంలో ఎంజో ఫెర్నాండెజ్ చేసి గోల్‌తో అర్జెంటీనా విజయం ఖాయమైంది. తొలిసారి క్వార్టర్ ఫైనల్ చేరాలన్న ఈజిప్ట్ ఆశలపై నీళ్లు చల్లింది.

# కోహ్లితో క్రికెట్ ఆడాలనుంది: జొకోవిచ్

**లండన్, జులై 7:** మిస్టర్ ఛేజర్ విరాట్ కోహ్లిపై సెర్బియా టెన్నిస్ దిగ్గజం నోవాక్ జొకోవిచ్ అభిమానాన్ని చాటుకున్నాడు. ప్రస్తుతం వింబుల్డన్ ఆడుతున్న జొకోవిచ్... గొప్ప బ్యాటింగ్ యోధుడు విరాట్ కోహ్లితో కలిసి క్రికెట్, టెన్నిస్ ఆడాలని ఉందని జియో స్టార్‌తో మాట్లాడుతూ చెప్పాడు. త్వరలో భారత్‌ను సందర్శించేందుకు ప్లాన్ చేస్తున్నానని, ఇప్పటికే కోహ్లితో మాట్లాడినట్లు చెప్పుకొచ్చాడు. విరాట్ ఓ గ్లోబల్ స్టార్, అతను భారత్‌లో అద్భుతమైన ఆటగాడు. కోహ్లి తనకు అతిథ్యమిచ్చి, దేశమంతా తిప్పి చూపిస్తే బాగుంటుంది. అతనిపైనా, భారత్ క్రికెట్‌పైనా తనకు చాలా గౌరవం ఉందని జొకోవిచ్ పేర్కొన్నాడు. సెర్బియాలో క్రికెట్‌కు అంత ప్రాధాన్యం లేదని, అయితే ఇంగ్లాండ్ టెన్నిస్ ప్లేయర్ల నుంచి క్రికెట్ గురించి తెలుసుకున్నట్లు చెప్పాడు. గత వింబుల్డన్‌లో తన భార్య బాలీవుడ్ నటి అనుష్కశర్మతో కలిసి కోహ్లి... జొకోవిచ్ మ్యాచ్‌ను వీక్షించాడు. ఎంత అద్భుతమైన మ్యాచ్. గ్లాడియేటర్ జొకోవిచ్‌కు ఇది మామూలు విషయమేనని కోహ్లి పోస్ట్ చేశాడు.





# పసిడి తాకట్టు రుణాలు 3.29లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జులై 7:** ప్రైవేటు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థల్లో బంగారు ఆభరణాల తాకట్టుపై మంజూరు చేసిన రుణాలు ఈ ఏడాది మే నెలలో దాదాపు 70శాతం పెరిగి అన్ని రుణ విభాగాల్లోనే అత్యంత భారీ వృద్ధిని నమోదు చేసినట్లు రిజర్వు బ్యాంకు మంగళవారం విడుదల చేసిన నివేదికలో ప్రస్తావించింది.

2026మే నెలాఖరు నాటికి బంగారు ఆభరణాల తాకట్టుపై ఎన్‌బీఎఫ్‌సీలు ఇచ్చిన రుణాలు రూ.3.29 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంలో ఇవి రూ.1.94 లక్షల కోట్లుగా ఉండగా, ఏడాది వ్యవధిలో 69.9 శాతం వృద్ధి నమోదైంది. రిటైల్ రుణాల విభాగంలో గృహ రుణాలు, వాహన రుణాలు, బంగారం తాకట్టు రుణాలు గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. దీంతో మొత్తం రిటైల్ రుణాల వృద్ధి 2026 మేలో వార్షిక ప్రాతిపదికన 19.5 శాతానికి చేరుకుంది. గత ఏడాది ఇదే నెలలో ఈవృద్ధి 14.9 శాతంగా నమోదైంది. బంగారం రుణాల తర్వాత వాణిజ్య రంగానికి ఎన్‌బీఎఫ్‌సీలు అందించిన రుణాల బకాయిలు రెండో స్థానంలో నిలిచాయి. గత ఏడాది మేలో రూ.85,317 కోట్లుగా ఉండగా, 2026 మే నాటికి రూ.1.19 లక్షల కోట్లకు పెరిగి 40.2శాతం వార్షిక వృద్ధిని నమోదు చేశాయి. వ్యవసాయం, అనుబంధ రంగాలకు అందించిన రుణాల వృద్ధి కూడా బలంగానే కొనసాగింది. ఈ విభాగంలో రుణాలు 2026 మేలో వార్షిక ప్రాతిపదికన 17.9 శాతం పెరిగాయి. గత ఏడాది ఇదే నెలలో నమోదైన 5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. పారిశ్రామిక రంగానికి రుణాల వృద్ధి కొంత మందగించింది. 2025 మేలో 10 శాతంగా ఉన్న పారిశ్రామిక రుణాల వృద్ధి 2026 మేలో 7.3 శాతానికి తగ్గింది. ముఖ్యంగా మౌలిక వనరుల రంగానికి రుణాల వృద్ధి మందగించడం ఇందుకు ప్రధాన కారణమని ఆర్‌బీఐ తెలిపింది.

2025 మేలో 23.9 శాతంగా నమోదైన సేవల రంగ రుణాల వృద్ధి, 2026 మేలో 16.7 శాతానికి పరిమితమైంది.




# లాభాల స్వీకరణతో వరుస నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

**ముంబయి, జులై 7:** దేశీయ ఈక్విటీ మార్కెట్లలో వరుసగా 4 రోజులుగా కొనసాగిన ర్యాలీకి మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడంతో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. విస్తృత స్థాయిలో అమ్మకాల ఒత్తిడి నెలకొని నిఫ్టీ 24,400 స్థాయి దిగువన ముగిసింది. మెటల్, రియాల్టీ రంగ షేర్లు భారీగా నష్టపోగా, ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలకు చెందిన షేర్లు లాభాల్లో నిలిచాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 104.35 పాయింట్లు తగ్గి 78,180.72 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 31.65 పాయింటు క్షీణించి 24,398.70వద్ద స్థిరపడింది. నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.34 శాతం, నిఫ్టీ 2.35 శాతం చొప్పున లాభపడిన విషయం గమనార్హం. నిఫ్టీపై అత్యధిక ఒత్తిడి తీసుకొచ్చిన షేర్లలో ట్రెంట్ 12.64శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్1.23శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.04 శాతం చొప్పున క్షీణించాయి.

విస్తృత మార్కెట్ కూడా ప్రధాన సూచీల కంటే బలహీనంగా ప్రదర్శించింది. బీఎస్‌ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.18 శాతం తగ్గగా, బీఎస్‌ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.76శాతం పడిపోయింది. ఎన్‌ఎస్‌ఈలో మార్కెట్ వెడల్పు ప్రతికూలంగా నమోదైంది. మొత్తం 1,191 షేర్లు లాభపడగా, 2,084 షేర్లు నష్టపోయాయి. మరో 109 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. సమీప కాలంలో మార్కెట్ అస్థిరతను సూచించే ఇండియా వీఐఎక్స్ సూచీ 1.43 శాతం తగ్గి 11.65 వద్దకు చేరింది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ94.95 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.43గా నమోదైంది.




ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన ఎంసీఎక్స్ బంగారం ఫ్యూచర్స్ ధర 1.02 శాతం తగ్గి రూ.1,45,414కు చేరింది. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 81 సెంట్లు (1.13 శాతం) పెరిగి 72.80 డాలర్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లుఅమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజా ద్రవ్య విధాన సమావేశ మినిట్స్‌తో పాటు కీలక ఆర్థిక గణాంకాల విడుదలకు ముందు జాగ్రత్త ధోరణి కొనసాగడంతో యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశ మినిట్స్ కోసం వేచి చూసిన ఆసియా మార్కెట్లు మాత్రం నష్టాల్లో ముగిశాయి. ప్రధాన కార్పొరేట్ పరిణామాలుతొలి త్రైమాసిక ఆదాయ వృద్ధి మార్కెట్ అంచనాలకు తగ్గడంతో ట్రెంట్ షేరు 12.64 శాతం క్షీణించింది. టైటాన్ కంపెనీ తొలి త్రైమాసికంలో వినియోగదారుల వ్యాపారం 41 శాతం వృద్ధి నమోదు చేయడంతో షేరు 2.38 శాతం పెరిగింది. దేశీయ యాజమాన్యం 50 శాతాన్ని దాటినట్లు ప్రకటించడంతో స్విగ్గీ షేరు 7.17 శాతం ఎగిసింది.

తొలి త్రైమాసిక బిల్లింగ్స్ రూ.737 కోట్లకు చేరి 14.4 శాతం వృద్ధి నమోదు చేయడంతో ఇన్ఫో ఎడ్జ్ ఇండియా షేరు 12.95 శాతం లాభపడింది. ప్రీమియం హౌసింగ్ ప్రాజెక్టులకు బలమైన డిమాండ్ కారణంగా టీఏఆర్‌సీ షేరు 1.74 శాతం పెరిగింది. జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ షేరు 3.98 శాతం లాభపడింది. వరుణ్ బేవరేజెస్ షేరు 2.19 శాతం తగ్గింది. టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ షేరు 2.02 శాతం క్షీణించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి రూ.166.82 కోట్ల బొగ్గు గ్యాస్ ఉత్పత్తి సేవల ఆర్డర్ పొందడంతో సౌత్ వెస్ట్ పిన్నాకిల్ ఎక్స్‌ప్లోరేషన్ షేరు 2.45 శాతం పెరిగింది. తొలి త్రైమాసికంలో ఆదాయం 41 శాతం పెరిగినప్పటికీ పి ఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్ షేరు 2.20 శాతం తగ్గింది. రిటైల్ ఆదాయం 56 శాతం పెరిగి మొత్తం ఆదాయంలో 78 శాతం వాటాను అందుకుంది. ఫ్రాక్టల్ అనలిటిక్స్ షేరు 2.97 శాతం క్షీణించింది. వివిధ విభాగాల్లో కలిపి రూ.239.61 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు పొందినట్లు కేపీ గ్రీన్ ఇంజినీరింగ్ ప్రకటించింది. సోలార్ ప్రాజెక్టులు, క్రాష్ బ్యారియర్లు, ఆర్‌ఎస్‌జే పోల్స్, ప్రీఇంజినీర్డ్ భవనాలు, ట్రాన్స్‌మిషన్ టవర్లు ప్రాజెక్టులు పొందినా షేరు 2.12 శాతం తగ్గింది.

# ఐదేళ్లలో 1 లక్ష కోట్ల ఆదాయం
## 10వేల కోట్ల లాభం టార్గెట్: టాటా పవర్




**ముంబయి, జులై 7:** విద్యుత్ రంగంలోని ప్రముఖ సంస్థ టాటా పవర్ వచ్చే ఐదేళ్లలో లక్ష కోట్ల ఆదాయం, రూ.10వేల కోట్ల నికర లాభాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంగళవారం ప్రకటించింది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, పునరుత్పాదక ఇంధనాలు, తయారీ విభాగాల్లో విస్తరణ ద్వారా ఈ లక్ష్యాలను చేరుకోవాలని సంస్థ భావిస్తోంది. కంపెనీ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో ప్రశ్నోత్తరాల సందర్భంగా టాటా పవర్ చైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ఐదేళ్లలో రూ.10,000 కోట్ల లాభం, రూ.1 లక్ష కోట్ల ఆదాయాన్ని సాధించాలన్నది సంస్థ లక్ష్యమని, నివాస, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు పరిశుభ్రమైన, హరిత ఇంధన పరిష్కారాలకు మారేలా ఎనర్జీ యాజ్ ఎ సర్వీస్ విధానాన్ని టాటా పవర్ ముందుండి అమలు చేస్తుందని తెలిపారు. సౌర పరికరాల తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా ఒడిశాలో కొత్తగా 10 గిగావాట్ల సామర్థ్యంతో సౌర తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు కూడా చంద్రశేఖరన్ వెల్లడించారు.


ప్రస్తుతం తమిళనాడులోని తిరునెల్వేలిలో టాటా పవర్‌కు 4.3 గిగావాట్ల సౌర సెల్స్, మాడ్యూల్ తయారీ సామర్థ్యం ఉంది. బెంగళూరు యూనిట్‌తో కలిపి సంస్థ మొత్తం తయారీ సామర్థ్యం 4.9 గిగావాట్లకు చేరుకుంది. సౌర తయారీతో పాటు ఇంగాట్లు, వేఫర్లు ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా ఒడిశాలోని కొత్త 10 గిగావాట్ల ప్రాజెక్టు ద్వారా పెంచాలని కంపెనీ ప్రణాళిక రూపొందించింది. విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేటీకరణ చేపట్టే రాష్ట్రాల్లో అవకాశాలు లభిస్తే తమ పంపిణీ కార్యకలాపాలను కూడా విస్తరించేందుకు టాటా పవర్ సిద్ధంగా ఉందని చంద్రశేఖరన్ తెలిపారు. ఇప్పటివరకు కంపెనీ 2.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రారంభించినట్లు వెల్లడించారు.

# గ్లోబల్ మార్కెట్లలో స్థిరంగా ముడిచమురు ధరలు

**న్యూఢిల్లీ, జులై 7:** అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు మంగళవారం స్థిరంగా కొనసాగాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 72 డాలర్లకు పైగా నిలిస్తే అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 69డాలర్ల సమీపంలో ట్రేడైంది. యుద్ధ ప్రభావం పూర్తిగా తగ్గిన చమురుధరలు అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందం కుదరడంతో మధ్యప్రాచ్య చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్న భయాలు తగ్గాయి. దీంతో రెండో త్రైమాసికంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు సుమారు 30 శాతం మేర పడిపోయాయి. యుద్ధ భయాల కారణంగా చమురు ధరల్లో ఏర్పడిన అదనపు పెరుగుదల దాదాపు పూర్తిగా కరిగిపోయిందని మార్కెట్ నిపుణుల అంచనా. రాబోయే నెలల్లో ప్రపంచ మార్కెట్లో ముడి చమురు అధిక సరఫరా పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని గోల్డ్‌మన్ సాక్స్, మోర్గాన్ స్టాన్లీ వంటి ప్రముఖ అంతర్జాతీయ పెట్టుబడి బ్యాంకులు హెచ్చరిస్తున్నాయి. ఈ ఆందోళనలకు మరింత బలం చేకూరుస్తూ సౌదీ అరాంకో ఆసియా కొనుగోలుదారుల కోసం ప్రధాన అరబ్‌లైట్ క్రూడ్ ధరను వచ్చే నెలకు బ్యారెల్‌కు 11 డాలర్లు తగ్గించింది. ప్రాంతీయ బెంచ్‌మార్క్‌తో పోలిస్తే బ్యారెల్‌కు 1.5డాలర్ల డిస్కౌంట్‌పై విక్రయించనున్నట్లు ప్రకటించింది. గతంలో 2020, 2015లో జరిగిన అంతర్జాతీయ చమురు ధరల యుద్ధాల సమయంలో మాత్రమే ఈ గ్రేడ్‌ను డిస్కౌంట్‌పై విక్రయించారు. సౌదీ అరేబియాతో పాటు ఒపెక్ ప్లస్ సభ్యదేశాలు వచ్చే నెలనుంచి ఉత్పత్తి కోటాలను పెంచాలని నిర్ణయించాయి. అదనపు ఉత్పత్తి వెంటనే మార్కెట్‌లోకి రాకపోయినా, పరిస్థితులు సాధారణ స్థితికి చేరుతున్న నేపథ్యంలో సరఫరాను పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఈ నిర్ణయం సూచిస్తోంది. ఇదిలా ఉంటే అమెరికా ఇంధన మార్కెట్ సమాచార సంస్థ డేటా ప్రకారం 2027 నాటికి అమెరికా ముడి చమురు ఉత్పత్తి అంచనాను రోజుకు అదనంగా 2.20 లక్షల బ్యారెళ్ల మేర పెంచి 1.383 కోట్ల బ్యారెళ్లకు సవరించింది.



# ఆరు నెలల్లోనే ఐటి కంపెనీల్లో 1.19 లక్షల మందికి లేఆఫ్




**న్యూఢిల్లీ, జులై 7:** ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో ఉద్యోగాల కోతలుఏమాత్రం తగ్గడం లేదు. తమ వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా టెక్ కంపెనీలు ఉద్యోగులను తొలగించడాన్ని తీవ్రం చేశాయి. తాజా గణాంకాల ప్రకారం 2026 సంవత్సరపు మొదటి ఆరు నెలల కాలంలోనే వివిధ టెక్ కంపెనీలలో దాదాపు 1.19లక్షలమందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారు. ఈ లేఆఫ్స్ పర్వం ఐటీ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న ఉద్యోగాల తొలగింపు ప్రక్రియతో పోలిస్తే, 2026 మొదటి అర్ధభాగంలో ఈ సంఖ్య మరింత పెరిగినట్లు మార్కెట్ డేటా స్పష్టం చేస్తోంది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే లేఆఫ్స్ తీవ్రత ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. పెద్ద పెద్ద టెక్ దిగ్గజాల నుండి చిన్న స్థాయి స్టార్టప్‌ల వరకు అనేక కంపెనీలు తమ వ్యాపార పునర్వ్యవస్థీకరణ, వ్యయాలను తగ్గించుకోవడం, మారుతున్న మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా మారే ప్రక్రియలో భాగంగా ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నాయి.

# కల్ట్.ఫిట్ ఐపీఓకు సెబీకి దరఖాస్తు
## నాలుగు వేల కోట్ల సమీకరణ లక్ష్యం




**ముంబయి, జులై 7:** ఫిట్‌నెస్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఫిట్‌నెస్, వెల్‌నెస్ సంస్థ కల్ట్ ఫిట్ ఐపిఒకోసం సెబీకి డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఐపీఓ ద్వారా కంపెనీ ఈక్విటీ షేర్ల జారీచేసి సుమారు రూ.950 కోట్ల వరకు నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆఫర్ ఫర్ సేల్‌తో కలిపి మొత్తం ఐపీఓ పరిమాణం రూ.4,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణుల అంచనా. ఐపీఓలో ప్రస్తుత పెట్టుబడిదారులైన టీమ్‌సెక్, ఫిట్‌నెస్ ఫస్ట్ లక్సెంబర్గ్, చిరాటే వెంచర్స్, టాటా డిజిటల్, యాక్సెల్ ఇండియా, కలారి క్యాపిటల్, ఫ్రోడర్స్ క్యాపిటల్ తదితర సంస్థలు కలిపి 17.86 కోట్ల షేర్ల వరకు విక్రయించనున్నాయి.

ఒక్కో ఈక్విటీ షేరు ముఖ విలువ రూ.1గా నిర్ణయించారు కంపెనీ సహ వ్యవస్థాపకుడు ముకేష్ బన్సాల్, ఏంజెల్ ఇన్వెస్టర్ బ్రూనో రాఫ్లే, ప్రముఖ సినీ నటుడు హృతిక్ రోషన్‌లు తమ వాటాలోని కొంత భాగాన్ని ఈ ఐపీఓలో విక్రయించనున్నారు. షేర్లు విక్రయించే ఇతర వాటాదారుల్లో ఏషియన్ పెయింట్స్ ప్రమోటర్ డోలీ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, సన్ ఎన్ సాండ్ హోటల్స్, ఎండియా పార్ట్‌నర్స్ వ్యవస్థాపకుడు సతీష్ ఆంధ్రా, మాజీ మింత్రా సీఈఓ అనంత్ నారాయణన్ కుటుంబ ట్రస్ట్, హృతిక్ రోషన్ పెట్టుబడి సంస్థ ఎక్స్‌ట్రీమ్ బ్రాండ్స్ ఉన్నాయి. కల్ట్.ఫిట్‌లో మాక్‌రిచీ ఇన్వెస్ట్‌మెంట్స్ అత్యధికంగా 20.3 శాతం వాటాను కలిగి ఉంది. తర్వాత యాక్సెల్‌కు 13.5 శాతం, సహ వ్యవస్థాపకుడు ముకేష్ బన్సాల్‌కు 8.4శాతం, కలారి క్యాపిటల్‌కు 7.8, ఎటర్నల్ వద్ద 4.9, టాటా డిజిటల్ వద్ద 3.6 శాతం వాటాలున్నాయి. ఐపీఓ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ రుణాల చెల్లింపు, కల్ట్ ఎలైట్, కల్ట్ నియో ఫిట్‌నెస్ సెంటర్ల విస్తరణ, కొత్త కల్ట్‌స్పోర్ట్ రిటైల్ స్టోర్ల ఏర్పాటు, లీజ్ చెల్లింపులు, మార్కెటింగ్ కార్యక్రమాల కోసం వినియోగించనుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14